సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 23

శనివారం 15-4-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





4 అంతస్థుల స్వర్ణాభరణాల
మెగా షోరూం
A.S.రావ్ నగర్ లో
ప్రముఖ సినీ తార
శ్రీలీల చే
రేపే
శుభ ప్రారంభం
April 8th to 23rd
Akshaya Tritiya
Celebrations
Akshaya Tritiya Advance Bookings Started
తరుగు (V.A)
(916 HUID Jewellery)
UPTO 50% OFF
సిల్వర్ ఆర్టికల్స్‌పై
తరుగు, మజూరి
చార్జీలు లేవు
5 DECADES OF LEGACY
CMR
LEGACY OF JEWELLERY
www.cmrjewellers.com
888 188 1193 WHATSAPP SHOPPING
ప్యాట్నీసెంటర్ 27804733
మల్కాజ్‌గిరి 27060600
దిల్‌సుఖ్‌నగర్ 24068999
సోమాజిగూడ 23404440
కూకట్‌పల్లి 23253033
ప్యాట్నీ సర్కిల్ 27892828
చింతల్ 23085555
నిజాంపేట 23899990
సిద్దిపేట 222299
మహబూబ్‌నగర్ 220999
మంచిర్యాల 255888
T&C Apply



రంజాన్
సేల్
5 DECADES OF LEGACY
CMR
FAMILY MALL
TELANGANA
www.cmrtelangana.com
WHATSAPP SHOPPING 8881881194
జకాత్ వస్త్రాలు
హోల్‌సేల్ ధరలకే
ఇమిటేషన్
జ్యూయలరీ పై
FLAT 20% OFF
అన్ని రకాల వస్త్రాలపై
UPTO 50% OFF
1+1 & 1+2
OFFERS
T&C Apply
BUY 2 రియల్ జార్జెట్ ₹333
BUY 3 ఖుషి మార్బుల్‌శారీ ₹555
BUY 2 రాయల్ షిఫాన్ శారీ ₹350
BUY 3 కలర్ శిల్క్ శారీస్ ₹888
BUY 3 చందేరి ఫ్యాన్సీ శారీస్ ₹555
హాఫ్ శారీస్‌పై 1+1 OFFER
BUY 5 లేడీస్ చున్నీలు ₹99
BUY 3 సమ్మర్ కుర్తీస్ ₹888
BUY 3 లేడీస్ లెగ్గింగ్స్ ₹555
BUY 2 లేడీస్ డ్రస్‌మెటీరియల్స్ ₹777
BUY 2 లేడీస్ ప్లాజో సెట్స్ ₹750
ప్యాట్నీసెంటర్ హెడ్ పోస్టాఫీసు ఎదురుగా ఫోన్: 27804733
మల్కాజిగిరి భవాని నగర్ ఫోన్: 2760600
దిల్‌సుఖ్‌నగర్ వెంకటాద్రి థియేటర్ ప్రక్కన ఫోన్: 24062999
చింతల్ మెయిన్ రోడ్ ఫోన్: 23086666
నిజాంపేట భవ్యాస్ ఆనందం ఎదురుగా ఫోన్: 23898880
సిద్దిపేట పాత బస్టాండ్ ప్రక్కన ఫోన్: 222299
మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్ సర్కిల్ ఫోన్: 221999
మంచిర్యాల బస్టాండ్ ఎదురుగా ఫోన్: 254888

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 23
శనివారం 15-4-2023
'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





విజయలక్ష్మి



తన చిత్రాలతో విజయలక్ష్మి

సంకల్పానికి చిత్రరూపం



ఆమె చిత్రలేఖనంలో మనకు కనిపించేది ఒక రూపం కాదు... అనేకం. బుద్ధుడి బొమ్మలో కేవలం బుద్ధుడు మాత్రమే కాదు... బ్రష్ పట్టుకుని... తదేక దీక్షతో బుద్ధుడి బొమ్మ వేస్తున్న ఓ టీనేజ్ అమ్మాయి కూడా ఉంటుంది. రవివర్మ కుంచెకు అందిన అందం... విజయలక్ష్మి చిత్రాల్లో ద్యోతకమవుతుంది.

తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లా, శామీర్ పేట మండలంలో ఉంది తుర్కపల్లి. ఆ ఊరిలో అత్యంత సాధారణ కుటుంబంలో పుట్టిన అమ్మాయి చిత్రలేఖనంతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకుంది. కళారత్న, అబ్దుల్ కలామ్ అవార్డులతోపాటు లెక్కలేనన్ని పురస్కారాలు, ప్రశంసలు ఆమె సొంత మయ్యాయి. తన రంగుల ప్రస్థానాన్ని, ఒక చిత్రంలో లెక్కకు మించిన వివరాలను పొందుపరచడంలో తన అభిరుచిని, బొమ్మల పట్ల తన ఇష్టాన్ని సాక్షితో పంచుకున్నారు విజయలక్ష్మి.

అసాధారణమైన ప్రతిభ

''నా జీవితంలో బొమ్మలు ఎప్పుడు ప్రవేశించాయో స్పష్టంగా చెప్పలేను. ఎందుకంటే నా దృష్టిని ఆకర్షించిన దృశ్యాలకు చిత్రరూపం ఇవ్వడం నా బాల్యంలోనే మొదలైంది. నన్ను స్కూల్‌కి మా అన్న తీసుకు వెళ్లి, తీసుకువచ్చే వాడు. నాకు చదువంటే చాలా ఇష్టం. ఇంటికి వచ్చిన తర్వాత కూడా పుస్తకాలే నా లోకం. అందులోని బొమ్మలే నా స్నేహితులు. అందరి పిల్లల్లా ఆడుకోవడం నాకు కుదరదు కదా. అందుకే చదువుకుంటూ, బొమ్మలేసుకుంటూ పెరిగాను. టెన్త్‌క్లాస్ తర్వాత కాలేజ్‌కెళ్లడం కష్టమైంది. కొన్నేళ్ల విరామంలో సైకాలజీ, ప్రముఖుల బయోగ్రఫీలు, భగవద్గీత... అదీ ఇదీ అనే తేడా లేకుండా నాకు దొరికిన ప్రతి పుస్తకాన్నీ చదివాను. ఆ తర్వాత డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ చేశాను. చదివేకొద్దీ నా ఆలోచన పరిధి విస్తృతం కాసాగింది. నా గురించి నేను ఆలోచించడమూ ఎక్కువైంది. ఒక వ్యక్తి అసాధారణమైన నైపుణ్యాలను సాధించినప్పుడు ఆ వ్యక్తిని ఆ ప్రత్యేకతలతోనే గుర్తిస్తారు. ఇతర లోపాలున్నా సరే అవి తొలుత గుర్తుకురావు. నాకు ఎడమ చెయ్యి మాత్రమే మామూలుగా పని చేస్తుంది. రెండు కాళ్లు, కుడి చెయ్యి చిన్నప్పుడే పోలియో భూతం బారిన పడ్డాయి. నా పేరు విన్న వెంటనే కాన్వాస్ మీద అద్భుతాలు సృష్టించగలిగిన ఒక చిత్రకారిణి గుర్తుకురావాలి. సమాజం ఒక సాధారణ వ్యక్తిని సాధారణంగానే గుర్తిస్తుంది. ఒక నైపుణ్యమో, వైకల్యమో ఉన్నప్పుడు వ్యక్తిగా గుర్తించడానికంటే ముందు నైపుణ్యం, వైకల్యాలతోనే పరిగణనలోకి తీసుకుంటుంది. పోలియో బాధితురాలిగా ఐడెంటిఫై కావడం కంటే విజయలక్ష్మి అంటే చిత్రలేఖనం గుర్తుకు వచ్చేటంతగా రాణించాలనుకున్నాను. అందుకోసమే అహర్నిశలూ శ్రమించాను. నేను చూసిన దృశ్యాల నుంచి నా బొమ్మల పరిధిని విస్తరించాను. నేను చదివిన పుస్తకాల నుంచి ఇతివృత్తాలను రూపుదిద్దుకున్నాను.





అన్నింటికీ మించి రాజా రవివర్మ నుంచి స్ఫూర్తి పొందాను.

రవీంద్రభారతిలో పురస్కారాలు


చిత్రకారిణిగా గుర్తింపు రావడమే కాదు, పురస్కారాలను రవీంద్రభారతిలో అందుకోగలిగాను. రవీంద్రభారతిలో అందుకోవడం కూడా ఒక పురస్కారంగానే భావిస్తాను. 2019లో నా చిత్రాలను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రదర్శించే అవకాశం వచ్చింది. అలాగే హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ, సాలార్‌జంగ్ మ్యూజియంతోపాటు ఢిల్లీలోనూ ప్రదర్శితమయ్యాయి. మనలో ఆత్మవిశ్వాసం, అకుంఠిత దీక్ష, సంకల్పబలం ఉంటే భగవంతుడు అవకాశం ఇచ్చి తీరుతాడని నమ్ముతాను. ఓ సంస్థ నా అవసరాన్ని గుర్తించి డెబ్బై వేల విలువ చేసే ఎలక్ట్రానిక్ వీల్‌చైర్ విరాళంగా ఇచ్చింది. అది కూడా భగవంతుడు పంపినట్లే.

స్ఫూర్తిప్రదాతగా...

నేను రాజా రవివర్మ నుంచి స్ఫూర్తి పొందితే, నన్ను స్ఫూర్తిగా తీసుకుంటున్న కొత్తతరం ఉండడం నాకు సంతోషంగా ఉంది. నేను చదువుకున్న స్కూల్లో నా బొమ్మలను ప్రదర్శించినప్పుడు నాకా సంగతి తెలిసింది. జీవితాన్ని నిస్సారంగా గడిపేయకూడదు, స్ఫూర్తిమంతంగా ఉండాలని కోరుకుంటాను. సోషల్ మీడియాను నూటికి నూరు శాతం వినియోగించుకున్నాననే చెప్పాలి. సోషల్ మీడియా వేదికగానే ఇన్‌ఫ్లూయెన్సర్‌ని కాగలిగాను. తలసేమియా వ్యాధిగ్రస్థులకు రక్తం కోసం ఏడాదికి మూడుసార్లు బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నాను. మా ఊరి కుర్రాళ్లు 'ఏం చేయాలో చెప్పక్కా, మేము చేసి పెడతాం' అని ఉత్సాహంగా సహాయం చేస్తున్నారు. 'వీల్‌చైర్ నుంచి నేను ఇన్ని చేస్తుంటే హాయిగా నడవగలిగిన వాళ్లు ఎందుకు చేయలేరు. స్థిర చిత్తం ఉంటే ఏదైనా సాధ్యమే'నని వీడియోల్లో చెబుతుంటాను'' అని సంతోషంగా తన బొమ్మలలోకొన్ని వివరించింది విజయలక్ష్మి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బుద్ధుడి వెనుక యువతి



విజయలక్ష్మి చిత్రలేఖనంలో ఉన్న అమ్మాయి అచ్చమైన తెలుగుదనంతో ఒత్తైన జడ వేసుకుని ఉంటుంది. ఆ జడను అలంకరించి పూలు కూడా అచ్చం పూలను పోలినట్లే తెల్లటి పువ్వులో పసుపువర్ణంలో పువ్వు మధ్య భాగం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఆ అమ్మాయి చెవి జుంకీలకున్న నగిషీలు కూడా. అలాగే మరో చిత్రలేఖనం ఇంకా అద్భుతం... మన దృష్టి అభయ ముద్రలో ఉన్న బుద్ధుడి మీద కేంద్రీకృతమవుతుంది. బుద్ధుని పాదాల వద్దనున్న కమలం మీద, బుద్ధుడి శిఖ, శిఖ వెనుకనున్న కాంతివలయాన్ని కూడా చూస్తాం. ఆ తర్వాత మన దృష్టికి వస్తుందో అద్భుతం. ఆ బుద్ధుడి బొమ్మ ఉన్నది కేవలం కాన్వాస్ మీద కాదు. ఒక యువతి వీపు మీద. అటువైపు తిరిగి కూర్చుని ఉన్న యువతిని చిత్రీకరించిన తర్వాత ఆమె వీపు మీద చూపరులకు అభిముఖంగా ఉన్న బుద్ధుడిని చిత్రించింది విజయలక్ష్మి.

మటన్ సుఖా

రంజాన్ స్పెషల్ రెసిపీ



కావలసినవి:

మటన్ – అర కేజీ; నీళ్లు – 750 ఎమ్ఎల్; ఉల్లిపాయలు – 2 (తరగాలి); పచ్చి మిర్చి– 1 (పొడవుగా చీరాలి); టొమాటో – 1 (తరగాలి); మినప్పప్పు– అర టీ స్పూన్; దాల్చిన చెక్క – అంగుళం ముక్క; లవంగాలు – 4; యాలకులు – 5; నక్షత్ర లవంగం – 1; కరివేపాకు తరుగు – గుప్పెడు; మిరప్పొడి – 2 టేబుల్ స్పూన్‌లు; ధనియాల పొడి– అర టేబుల్ స్పూన్; జీలకర్ర పొడి– అర టీ స్పూన్; గరం మసాలా పొడి – టీ స్పూన్; పసుపు – అర టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు; మిరియాల పొడి– చిటికెడు.

మారినేషన్ కోసం: వెల్లుల్లి రేకలు – 5 (పొట్టు వలిచినవి); ఉల్లిపాయలు – 100 గ్రాములు; అల్లం– 2 అంగుళాల ముక్క; పచ్చి మిర్చి– 2; సోంపు – టీ స్పూన్; నీరు – అర కప్పు.

తయారీ:

- మటన్‌ను శుభ్రం (నీటితో కడిగిన తర్వాత పసుపు, ఉప్పు వేసి పది నిమిషాల తర్వాత మళ్లీ కడగాలి) చేయాలి.
- మారినేషన్ కోసం తీసుకున్న పదార్థాలన్నింటినీ కలిపి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని మటన్ ముక్కలకు పట్టించి గంట నుంచి ఒకటిన్నర గంట సేపు నాననివ్వాలి.
- మందపాటి పాత్రలో నీటిని వేడి చేసి అందులో మారినేట్ చేసిన మటన్ ముక్కలను వేసి ఉడికించాలి. ముక్కలు ఒక మోస్తరుగా ఉడికిన తరవాత మిరప్పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా పొడి, ఉప్పు వేసి కలపాలి. పూర్తిగా ఉడికిన తర్వాత (ముక్క మెత్తబడేటప్పటికి నీరు కూడా ఆవిరై పోతుంది. నీరు తగ్గిపోయినప్పటికీ ముక్క ఉడకకపోతే మరి కొంత నీటిని పోసి ఉడికించాలి) స్టవ్ మీద నుంచి దించి పక్కన పెట్టాలి.
- మందపాటి పెనంలో నెయ్యి వేడి చేసి మినప్పప్పు వేసి సన్న మంట మీద బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి. అవి వేగిన తర్వాత దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, నక్షత్ర లవంగం వేయాలి. అవి వేగిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి ఎర్రగా వేగిన తరవాత పచ్చిమిర్చి, టొమాటో ముక్కలు, కరివేపాకు తరుగు వేసి రెండు నిమిషాల పాటు మగ్గనివ్వాలి. ఇప్పుడు ఉడికించి పక్కన ఉంచిన మటన్ వేసి ముక్కలకు మసాలా పట్టేలా కలిపి మీడియం మంట మీద ఉడికించాలి. ఒకసారి రుచి చూసుకుని ఘాటుగా కావాలంటే మరికొంత, మిరియాల పొడి కలుపుకోవచ్చు. ఐదు నిమిషాల్లో కర్రీలో నీరు తగ్గుతూ నూనె పైకి తేలుతుంది. స్టవ్ ఆపేసి రుచి అమరేవరకు (రెండు నిమిషాలు) స్టవ్ మీద ఉంచాలి. ఇది రోటీలోకి అన్నంలోకి కూడా రుచిగా ఉంటుంది.

ఇంటిప్



- తేనె కొంతకాలం వాడకుండా ఉంచేస్తే సీసా అడుగున గడ్డకట్టుకుపోతుంటుంది. అలాంటప్పుడు తేనెను కరిగించడానికి ఓ అరగంట పాటు తేనె సీసాను ఎండలో ఉంచాలి. తేనెను ఎప్పుడూ నేరుగా వేడి చేయరాదు. ఎండ లేకుండా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఒక పాత్రలో నీటిని వేడి చేసి అందులో తేనె సీసాను ఉంచాలి. నీటి వేడితో ఐదు – పది నిమిషాల్లో తేనె కరుగుతుంది.

● ఇన్‌స్పిరేషన్

మెక్‌డొనాల్డ్, కెఎఫ్‌సి వాటి గొప్ప వాటిదే కావచ్చు. కాని మన వడ పావ్‌కు ఏం తక్కువ అనుకున్నాడు ధీరజ్ గుప్తా. వడ పావ్‌ను బ్రాండ్‌గా చేసి ముంబైలో అతడు మొదలెట్టిన వ్యాపారం దేశీయ వంటల అధునిక రూపం సంపాదించే కోట్లకు సాక్ష్యంగా నిలిచింది.

ఇంచుమించు దానికి సరిసాటి



మన దగ్గర పునుగులు కామన్. కాని వాటిని ఒక బ్రాండ్ చేసి, రుచిని ఖాయం చేసి, శుచిగా మంచి ఔట్‌లెట్స్ ద్వారా అందించాలన్న ఆలోచన ఎవరికైనా వచ్చిందా?

మహారాష్ట్రలో వడ పావ్ కామన్. ప్రతి పది ఫర్లాంగుల దూరంలో ఎవరో ఒకరు వడ పావ్ అమ్ముతుంటారు. కాని ఆ వడ పావ్‌ను బ్రాండ్ కిందకు తెచ్చి, మంచి రుచితో అంటే మారని రుచితో చేసి, చాలా శుచిగా, ఆకర్షణీయమైన దుకాణాల ద్వారా అమ్మితే ఎలా ఉంటుందన్న ఆలోచన ధీరజ్ గుప్తాకు వచ్చింది. ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుందంటారు. అదే జరిగింది.

చేదు జ్ఞాపకాల నుంచి

ముంబైకి చెందిన ధీరజ్ గుప్తా 1998లో ఎంబిఏ చేశాడు. అప్పటికి రెండేళ్ల ముందు మెక్‌డొనాల్డ్, డోమినోస్ మన దేశంలోకి వచ్చి పిజ్జాలు, బర్గర్‌లు తెగ అమ్మడం మొదలెట్టాయి. అయితే వాటి సంగతి మనకు తెలియదు కదా అని స్వీట్ల వ్యాపారం మొదలెట్టాడు ధీరజ్ గుప్తా. మూడు నాలుగేళ్లలో 50 లక్షల నష్టం వచ్చింది. మొత్తం చేదు జ్ఞాపకాలే. కాని ఎలా బతకాలి? ఎలా ఎదగాలి? మరోసారి పిజ్జాలు, బర్గర్‌లు గుర్తొచ్చాయి. అందరూ తెగ తింటున్నారు. అలాగే ముంబైలో రోజుకు 20 లక్షల ప్లేట్ల వడ పావ్‌లు అమ్ముడుపోతాయి. కాని అవన్నీ అంత శుభ్రమైన వాతావరణంలో అమ్మరు. వడ పావ్‌ను అలా బ్రాండ్ చేసి ఎందుకు అమ్మకూడదు అనుకున్నాడు ధీరజ్. సరైన రుచితో, శుచిగా చేస్తే రేటు ఎక్కువైనా 20 లక్షల ప్లేట్లలో పది శాతమైనా తన దగ్గర పోవా అని ఆలోచించాడు. తండ్రి దగ్గర 2 లక్షలు అప్పు తీసుకున్నాడు. ముంబైలోని మలాడ్ రైల్వేస్టేషన్ ఎదురుగా 200 చదరపు అడుగుల దుకాణం తీసుకున్నాడు. 2001లో అతని ప్రయాణం మొదలెట్టాడు.

జంబోకింగ్

జంబో కింగ్ పేరుతో 2001 ఆగస్టులో అతడు దుకాణం తెరిచి మామూలుగా అమ్మే సైజు కంటే 20 శాతం సైజు పెంచి వడపావ్ అమ్మితే రేటు ఎక్కువైనా ఆ హైజీన్‌కి, రుచికి అందరూ ఎగబడ్డారు. మొదటి సంవత్సరంలోనే ఆ ఒక్క షాపు మీద అతనికి 40 లక్షల ఆదాయం వచ్చింది. జంబో కింగ్ సూపర్ హిట్. ఎటువంటి పరిస్థితుల్లో రుచిలో రాజీ పడకుండా చేయడం వల్లే ఇది సాధ్యమైంది. అయితే తాను సొంతగా షాపులు తెరుచుకుంటూ పోతే అజమాయిషీ కష్టం అని భావించాడు ధీరజ్. అతను పుస్తకాలు బాగా చదువుతాడు. ఫ్రాంచైజీల ద్వారా వ్యాపారాన్ని విస్తరణ చేయడం గురించి ఉన్న పుస్తకాలన్నీ చదివాడు. ఏ పద్ధతిలో ఫ్రాంచైజీలు ఇచ్చి, సరుకు రుచిని ఎలా కాపాడుకుంటూ వస్తే వ్యాపారం నిలబడుతుందో అంచనా వేసుకున్నాడు. ముడి పదార్థాల సప్లై చైన్, కచ్చితమైన రుచితో చేసేలా స్టాఫ్‌కు శిక్షణ... ఇవి తన చేతుల్లో ఉంటే తన పేరు మీద దుకాణం తెరిచి మిగిలిన కష్టం చేయడానికి వచ్చే వారు చాలా మంది ఉంటారు. అలా జంబో కింగ్‌ల ఫ్రాంచైజీలు మొదలయ్యాయి.



ధీరజ్ గుప్తా

ఏటిఎం లాగా

'జనానికి ఏటిఎం కనిపించినంత దగ్గరగా నా వడ పావ్ స్టోర్ కనిపించాలి' అంటాడు ధీరజ్. ఇప్పటికే అతను 13 ముఖ్య నగరాల్లో స్టోర్‌లను విస్తరించాడు. కేవలం ముంబై, ఢిల్లీ, హైదరాబాద్‌లలోనే 150 జంబో కింగ్ స్టోర్లు ఉన్నాయి. వడ పావ్‌లతో పాటు 2017 నుంచి బర్గర్లు కూడా అమ్ముతూ దూసుకుపోతున్నాడు ధీరజ్. 15 లక్షల ఖర్చుతో ఎవరైనా సరే ఫ్రాంచైజీ తీసుకోవచ్చు. 5 సంవత్సరాల్లో పెట్టుబడి వచ్చేస్తుందంటాడు ధీరజ్.

ఒక దేశీయ అల్పాహారం ఒక మనిషిని ఎంత దూరం తీసుకెళుతుందో ఈ జంబో కింగ్ కథ చెబుతోంది. అతనికి వడ పావ్ ఉంటే మనకు ఇంకా చాలా ఉన్నాయి. ట్రై చేసేవారిదే అదృష్టం.

బ్యూటిప్



గోధుమ పిండిలో తాజా మీగడను కలుపుకుని ఆ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు పట్టించుకోవాలి. నలుగు పెట్టుకున్నట్లుగా చేతితో మిశ్రమాన్ని తొలగించాలి.ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగాతయారవుతుంది. దీనిలో గంధం పొడి ఉపయోగిస్తే ఇంకా మంచి ఫలితం ఉంటుంది.

ఫిట్‌నెస్‌కి వయసు అడ్డంకి కాదు...



నలభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం అవసరం అంటోంది పుణే వాసి తరు మాటేటి. యాభై ఆరేళ్ల వయసులో భర్తతో కలిసి దక్షిణాఫ్రికా పర్వతాలలో జరిగిన కామ్రెడ్స్ మారథాన్‌లో పాల్గొని రికార్డు సృష్టించిన రెండవ భారతీయ జంటగా వార్తల్లో నిలిచారు. వందకు పైగా మారథాన్‌లలో పాల్గొన్న ఈ రన్నర్ మూడు అల్ట్రా మారథాన్‌లను నిర్వహించింది. స్వీయ శిక్షణ, కృషితో సాధించిన విజయాలు ఆమె మాటల్లోనే..



తరు మాటేటి

''పదేళ్లుగా జాతీయ అంతర్జాతీయ మారథాన్‌లలో పాల్గొంటున్నాను. 49వ ఏట పరుగు ప్రారంభించాను. ఆరేళ్ల తర్వాత నుంచి వందకు పైగా రేసుల్లో పరిగెత్తాను. ప్రభుత్వోద్యోగి కూతురిగా, ఆర్మీ అధికారి భార్యగా నాకు తెలిసిన ఒకే ఒక్క విషయం –' నెక్ట్స్ ఏంటి?' అనే ప్రశ్న. ఆ వెంటనే చేయాల్సిన పని పైన దృష్టి పెట్టడం. ఇదే నా విజయం.

ఉద్యోగాల మార్పు

ముప్పై ఏళ్ల క్రితం ఆర్మీ అధికారితో పెళ్లయ్యాక కొత్త ప్రదేశంలో నా సొంత జీవితాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని గ్రహించాను. మా వారికి అనుగుణంగా నేను ప్రతిసారీ ఉద్యోగాలు మార్చుకోవాల్సి వచ్చేది. సాధారణంగా ఆ రోజుల్లో స్త్రీ కోరుకునే ఏకైక ఉద్యోగం టీచర్ పోస్ట్. నేను ఇంజనీర్‌ని అయినప్పటికీ నా కుటుంబాన్ని ఒకేచోట ఉంచాలనే కోరికతో చాలా సంతోషంగా టీచర్ ఉద్యోగంలో చేరాను. కొత్త ఉద్యోగం ఎంచుకున్న ప్రతిసారి ఎంతో కష్టపడి పనిచేశాను. అందుకు తగిన ప్రతిఫలాన్ని పొందాను. టీచర్‌గా చేయడం వల్ల ఐటీ జాబ్‌లో ప్రత్యేక స్థానం లభించింది.

రోజూ వ్యాయామాలు

ఇండోర్ స్పోర్ట్స్‌లో బ్యాడ్మింటన్, ఏరోబిక్స్‌ని బాగా ఇష్టపడ్డాను. నా ఉద్యోగంతో పాటు వీటినీ బ్యాలెన్స్ చేశాను. దీంతో అదీ మొదటి ప్రాధాన్యతగా మిగిలిపోయింది. రన్నింగ్‌ను నేను ఎంచుకోలేదు. రన్నింగ్ నన్ను ఎన్నుకుంది. పూణేలో 10కె రన్‌లో పాల్గొనడానికి ఒకరోజు పరుగు కోసం బయటకు వెళ్లాను. నా ఏరోబిక్స్ స్టామినా వల్ల ఫస్ట్‌టైమ్ టెన్ కె రన్ పూర్తి చేశాను. ఔట్‌డోర్‌లో చేసిన మొదటి ప్రాక్టీస్‌కు మంచి గుర్తింపు లభించింది. మనదైన సొంత మార్గంలో ఒక స్వేచ్ఛ ఉంటుంది. రన్నింగ్ షూస్ ధరించినప్పుడు నాకు నేను వేరే వ్యక్తిగా అనిపిస్తాను. చాలా ఆనందంగా అనిపించింది. అంతే, ఇక అక్కణ్ణుంచి పరుగు ఆపలేదు. ఉద్యోగంలో ఉంటూనే మూడు అల్ట్రా మారథాన్‌లు నడిపాను. ఫిట్‌నెస్‌కు సంబంధం లేకుండా మారథాన్లలో పాల్గొన్నాను. అయితే, ఆరోగ్యం గురించి మరింత శ్రద్ధ తీసుకున్నాను. శారీరకంగా మెరుగ్గా ఉండటానికి యోగా శిక్షణ తీసుకున్నాను. అయినప్పటికీ ఒక ప్రమాదంలో గాయపడ్డాను. కోలుకోవడానికి ఆరు నెలల సమయం పట్టింది.

దుస్తుల అడ్డంకులు

సంప్రదాయ కుటుంబం కావడంతో మొదట షార్ట్స్, స్కర్ట్స్, రేసర్ బ్యాక్‌లు ధరించడానికి కొద్దిగా జంకు ఉండేది. కానీ, పరుగు మొదలయ్యాక సంకోచాలను పక్కన పెట్టేశాను. కుటుంబం నుంచి వ్యతిరేకత కూడా ఏమీ రాలేదు. రన్నింగ్‌లో ఏర్పడిన అడ్డంకులన్నీ ఒక్కొక్కటీ తొలగిపోయాయి. ప్రతి పరుగు కొత్తదనాన్ని నేర్పించింది. ఇతర మహిళల పట్ల నా సొంత దృక్పథాన్ని మార్చుకోవడం కూడా నేర్చుకున్నాను.



భర్త చందన్ మాటేటితో తరు మాటేటి

కష్టమైనా ఇష్టంగా..

అత్యంత కష్టమైనది సౌత్ ఆఫ్రికాలో జరిగిన కామ్రెడ్స్ మారథాన్. ఒక సంవత్సరంలో 87 కి.మీ 'అప్ రన్' మరుసటి ఏడాది 90 కిలోమీటర్ల 'డౌన్ రన్' ఉంది. ఒక పరుగును 12 గంటల్లో పూర్తి చేయాలి. నేను, నా భర్త ఈ రన్‌లో భారతదేశం నుంచి పాల్గొన్న రెండవ జంట. పదకొండు గంటలలోపే రన్ పూర్తి చేశాం. మా ఇద్దరికీ పతకాలు రావడంతో ఆనందంతో గెంతులేశాం. 2014లో బెంగళూరు ఫుల్ మారథాన్‌లో పరుగులు తీశాను. హైదరాబాద్ మారథాన్‌ను నడిపాను. బెంగుళూరు రన్ సమయంలో గాయపడ్డాను. ఇక రుతుక్రమ సమయంలో అయితే అకస్మాత్తుగా శరీరంలో వేడి సెగలు మొదలయ్యేవి. మూడ్ స్వింగ్స్ కూడా మారుతుండేవి. కానీ, నా దృష్టి కేవలం మారథాన్‌పైనే ఉండేది. ధైర్యాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. మన అభిరుచులకు తగిన విధంగా అన్ని పరిస్థితులు ఉండవు. అందుకు కృషితో పాటు ఓపిక కూడా ఉండాలి'' అని వివరిస్తుంది తరు మాటేటి.


'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 23

శనివారం 15-4-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

రాబోయే రాజ్యం మనదే!

125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో సీఎం కేసీఆర్

దేశంలో బీఆర్ఎస్‌కు కలలో కూడా ఊహించని ఆదరణ వస్తోంది

- తెలంగాణతోపాటు భారత్‌ను సరైన మార్గంలో పెట్టాలి
- ఇందుకోసం చివరి రక్తపు బొట్టు వరకు రాజీపడకుండా పోరాడుతా..
- అంబేడ్కర్ విగ్రహాన్ని ఎవరో డిమాండ్ చేస్తే ఏర్పాటు చేయలేదు
- అది ఆకారానికి ప్రతీక కాదు.. తెలంగాణ కలలను సాకారం చేసే చైతన్య దీపిక
- ఏటా జాతీయ, రాష్ట్రస్థాయిలలో అంబేడ్కర్ పేరిట అవార్డులు ఇస్తాం
- ఇందుకోసం రూ.51 కోట్లతో శాశ్వత నిధి ఏర్పాటు చేస్తాం
- దేశంలో అధికారంలోకి వస్తే ఏటా 25లక్షల మందికి 'దళిత బంధు'
- జాతీయ స్థాయిలో ఆశీస్సులు కోరుతున్నానని వెల్లడి

2లో

"నా మాటలు కొందరు శత్రువులకు మింగుడు పడకపోవచ్చు. ఆత్మవిశ్వాసంతో చెప్తున్నా.. 2024 పార్లమెంటు ఎన్నికల్లో భారతదేశంలో రాబోయే రాజ్యం మనదే. చిన్న మిరుగు (నిప్పురవ్వ) చాలు అంటుకునేందుకు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీకి నేను కలలో కూడా ఊహించని ఆదరణ లభిస్తోంది. రాబోయే రోజుల్లో యూపీ, బిహార్, పశ్చిమ బెంగాల్ సహా ప్రతిచోటా ఇదే ఆదరణ వస్తుంది. కేంద్రంలో కచ్చితంగా రాబోయే ప్రభుత్వం మనదే.. - సీఎం కేసీఆర్"

దేశంలో మార్పు కోసం యుద్ధం చేయాలి

- అంబేడ్కర్ మార్గంలో కేసీఆర్ ముందుకెళ్తున్నారు: ప్రకాశ్ అంబేడ్కర్
- దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్ ఉండాలి
- విగ్రహాన్ని ఆవిష్కరించిన అంబేడ్కర్ మనవడు

2లో


శుక్రవారం హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ తీరాన 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం సీఎం కేసీఆర్, ప్రజాప్రతినిధులతో కలసి గ్రూప్ ఫొటో దిగుతున్న అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, మంత్రులు కొప్పుల, వేముల, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బాల్క సుమన్, ఘంటా చక్రపాణి, బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ తదితరులు

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సీబీఐ సమన్లు



- లిక్కర్ స్కామ్‌లో ఆదివారం విచారణకు హాజరు కావాలని ఆదేశం.. సాక్షిగానే ప్రశ్నించనున్నట్లు వెల్లడి
- కేజ్రీవాల్‌ను కుట్రపూరితంగా విచారణకు పిలుస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపణ..

- వివరాలు 6లో




మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన కాంగ్రెస్ 'జైభారత్ సత్యాగ్రహ సభ'కు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న భట్టి

"సింగరేణి ఉద్యోగాల గని.. కానీ ప్రైవేటీకరణతో నష్టం చేస్తున్నారు. మేం అధికారంలోకి వస్తే ఒక్క బొగ్గు గనిని కూడా ప్రైవేటీకరణ చేయనీయబోం. కార్మికులకు అన్యాయం జరగనీయబోం. గిరిజనుల పోడు సమస్యను పరిష్కరిస్తాం. పట్టాలిస్తాం. - భట్టి"

విగ్రహాలు కాదు.. దళితులకు చేసిందేమిటి?

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫైర్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను మోసం చేస్తున్నాయి
- దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు ఏవి?
- వారికి కేటాయించిన నిధులెన్ని? ఖర్చు చేసినవెన్ని చెప్పగలరా?
- దేశంలో ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛకు ప్రమాదం
- బీజేపీ నేతలు దేశానికి చేసిన సేవ ఏమిటో చెప్పాలని నిలదీత
- దళిత బిడ్డలు కేసీఆర్‌ను క్షమించరు: రేవంత్
- 'తాడిచర్ల'లో రూ.10వేల కోట్ల అవినీతి: ఎంపీ కోమటిరెడ్డి
- ముందు దళితులకు ఏం చేశారో చెప్పాలి: ఉత్తమ్
- మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో కాంగ్రెస్ 'జైభారత్ సత్యాగ్రహ సభ'

- వివరాలు 13లో


కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని కొందరు విమర్శిస్తున్నారు. రాజ్యాంగ రచనలో అంబేడ్కర్‌తో కలసి నెహ్రూ పనిచేశారు. రాజ్యాంగ పరిరక్షణకు తోడ్పడ్డారు. నాడు కాంగ్రెస్ తెచ్చిన సంస్కరణలతోనే నేడు మోదీ ప్రధాని అయ్యారు. -ఖర్గే

టెన్త్ స్పాట్‌కు తిప్పలు!

- జవాబుపత్రాల వ్యాల్యూయేషన్‌కు ఇష్టపడని కొందరు టీచర్లు
- మెడికల్ సర్టిఫికెట్లు పెడుతూ తప్పించుకుంటున్న తీరు!
- హాజరుకాని వారికి నోటీసులు ఇస్తున్న అధికారులు
- సౌకర్యాలు లేనిచోట పని చేసేదెలాగని టీచర్ల ప్రశ్నలు
- 5 నిమిషాలు ఆలస్యమైనా గేటు దగ్గరే ఆపేస్తున్నారని మండిపాటు

8లో

ఖమ్మం జిల్లాలో 200 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు

కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి



- ఇన్నేళ్లుగా అంబేడ్కర్ జయంతిలో ఎందుకు పాల్గొనలేదు
- అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత కేసీఆర్‌కు లేదు
- బీజేపీ కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో బండి సంజయ్

- వివరాలు 13లో




అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించి, ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ప్రకాశ్ అంబేడ్కర్. చిత్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దానం నాగేందర్ తదితరులు



అంబేడ్కర్‌కు పూలతో నివాళి అర్పిస్తున్న కేసీఆర్



ప్రకాశ్ అంబేడ్కర్‌ను సత్కరిస్తున్న బౌద్ధ సన్యాసి

ప్రకాశ్ అంబేడ్కర్‌కు సీఎం ఆతిథ్యం

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గౌరవ అతిథిగా వచ్చిన బాబాసాహెబ్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్‌కు సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో ఆతిథ్యం ఇచ్చారు. ప్రగతి భవన్‌కు చేరుకున్న ప్రకాశ్ అంబేడ్కర్‌ని కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. శాలువాతో సత్కరించి మర్యాదపూర్వక భేటీ అయ్యారు. అనంతరం కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీలు సంతోష్ కుమార్, రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, శంకర్ అన్నా ధోంగే, సిద్దోజీరావు తదితరులున్నారు.



అంబేడ్కర్‌కు కేటీఆర్ నివాళి. చిత్రంలో మహమూద్ అలీ

దేశంలో రాబోయే రాజ్యం మనదే!

బీఆర్ఎస్‌కు కలలో కూడా ఊహించని ఆదరణ వస్తోంది

125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో సీఎం కేసీఆర్



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు హాజరైన ప్రజలు

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కు ఊహించని ఆదరణ వస్తోందని.. రాబోయే రోజుల్లో దేశంలో రాబోయేది తమ రాజ్యమేనని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. అంబేడ్కర్ చూపిన బాటలో తెలంగాణతోపాటు భారత్‌ను సరైన మార్గంలో పెట్టాలని.. దాని కోసం చివరి రక్తపు బొట్టు వరకు రాజీపడకుండా పోరాటం చేస్తానని ప్రకటించారు. ఏదో ఒరవడిలో, గాలికి కొట్టుకుపోకుండా.. నిజంగా పేదల కోసం పనిచేస్తున్న వారికి అండగా నిలవాలని, మనం చీలిపోతే దెబ్బతినే ప్రమాదం ఉంటుందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో హుస్సేన్‌సాగర్ తీరాన తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 125 అడుగుల భారీ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన మనవడు యశ్వంత్ ప్రకాశ్ అంబేడ్కర్ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"అంబేడ్కర్ విగ్రహాన్ని ఎవరో డిమాండ్ చేస్తే ఏర్పాటు చేయలేదు. విశ్వమానవుడి విశ్వరూపాన్ని మూర్తి రూపంలో ప్రతిష్ఠించుకున్నాం. రాష్ట్ర సెక్రటేరియట్‌కు కూడా అంబేడ్కర్ పేరు పెట్టుకున్నాం. సెక్రటేరియట్ ముందు అమరుల స్మారకం, అంబేడ్కర్ నమ్మిన బుద్ధుడి విగ్రహం కూడా ఉంది. సందేశాత్మక అద్భుత చిహ్నాలన్నీ ఒకేచోట ఉన్నాయి.

ఇది విగ్రహం కాదు.. విప్లవం..

అంబేడ్కర్ సిద్ధాంతంతో మనసు ప్రభావితం కావాలి. ఆయన మార్గాన్ని అనుసరించడంతో పాటు ఆయన సిద్ధాంతాలు, ఆచరణ అందరి కళ్లలో మెదలాలి. తమ జీవితాలను అర్పించి తెలంగాణ సాధించిన అమరులు కూడా ఆదర్శం కావాలనే ఉద్దేశంతోనే ఈ కాంప్లెక్స్‌కు రూపకల్పన చేశాం. ఆర్థికమంత్రి హరీశ్‌రావు చెప్పినట్టు ఇది విగ్రహం కాదు.. విప్లవం. కేవలం ఆకారానికి ప్రతీక కాదు.. ఇది తెలంగాణ కలలను సాకారం చేసే చైతన్య దీపిక.

ఇది దేశ చరిత్ర పుటల్లో నిలుస్తుంది: కొప్పుల ఈశ్వర్

రాష్ట్రంలో భారీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ దేశ చరిత్ర పుటల్లో నిలుస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. భవిష్యత్తు తరాలకు అంబేడ్కర్ స్ఫూర్తిని అందించే లక్ష్యంతో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని.. ఈ విషయంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ విగ్రహం పాలకులు, అధికారుల బాధ్యతను గుర్తుచేసేలా ఉందని చెప్పారు. దశాబ్దాలుగా చీకటి అలుముకున్న పేద దళితుల జీవితాల్లో దళితబంధు ద్వారా కేసీఆర్ వెలుగులు నింపారన్నారు.

ఆశయ సాధనకు కార్యాచరణ

దేశంలో 75 ఏళ్లుగా పార్టీలు, ప్రభుత్వాలు మారుతున్నా.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దళితులు ఇంకా నిరుపేదలుగానే ఉండటం సిగ్గుచేటు. ఈ పరిస్థితి మారాలంటే పార్టీలుకాకుండా ప్రజలు గెలిచే రాజకీయం రావాలని పదే పదే చెప్తున్నాం. ఈ దిశగా దళిత మేధావులు ఆలోచన చేయాలి. ఎక్కడా పెట్టని విధంగా ఈ నెల 30న బీఆర్ అంబేడ్కర్ పేరిట నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభిస్తున్నాం. వీటన్నింటినీ మించి శిఖరాయమానంగా ఆకాశమంత ఎత్తులో భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ఘనత తెలంగాణ రాష్ట్రానిది, అంబేడ్కర్ ప్రతిపాదించిన సిద్ధాంతం విశ్వజనీనం, సార్వజనీనం. దళిత మేధావులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ఆచరణాత్మక కృషి ప్రారంభించాలి. అనేక పార్టీలు గొడవలు, గందరగోళం సృష్టిస్తున్నాయి. అందువల్ల వాస్తవ దృక్పథంతో దళితులు ముందుకు సాగేలా కార్యాచరణ కావాలి. ఎవరి వైఖరి ఏమిటి? ఎవరి మార్గం ఏమిటో చూడాలి. బీఆర్ఎస్ ఎలా పనిచేస్తుందనేది చూస్తే చాలు. జాతీయ రాజకీయాల్లో మీ ఆశీస్సులు కోరుతున్నా"అని కేసీఆర్ పేర్కొన్నారు.

అంబేడ్కర్ పేరిట ఏటా అవార్డులు

అంబేడ్కర్ పేరిట ప్రత్యేక అవార్డు ఏర్పాటు చేయాలని కత్తి పద్మారావు పత్రికాముఖంగా సూచన చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న ఏటా జాతీయ, రాష్ట్రస్థాయిలలో ఉత్తమ సేవలు అందించే వారికి అవార్డులు అందజేస్తాం. దీనికోసం రూ.51 కోట్ల శాశ్వత నిధిని డిపాజిట్ చేయాలని తక్షణమే ఉత్తర్వులు ఇస్తున్నాం. ఈ నిధి ద్వారా ఏటా వచ్చే రూ.3 కోట్ల వడ్డీతో అంబేడ్కర్ పేరు ప్రతిష్ఠలు శాశ్వతంగా ఉండేలా అవార్డులు ఇస్తాం.

ఏటా 25లక్షల కుటుంబాలకు దళితబంధు

ప్రపంచంలో ఎక్కడా లేని రీతిలో దళితుల అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. మేం కేంద్రంలో అధికారంలోకి వస్తే.. తెలంగాణ తరహాలో దేశంలో ఏటా 25లక్షల కుటుంబాలకు దళితబంధు పథకం వర్తింప చేస్తాం. అన్ని రాష్ట్రాల్లో ఈ పథకం అందుబాటులోకి వస్తుంది. తెలంగాణలో ఇప్పటికే 50వేల కుటుంబాలకు దళితబంధు పథకం వర్తింపచేయగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 1.25 లక్షల మందికి దళితబంధు అందుతుంది. బీఆర్ఎస్ కంటే ముందు రాష్ట్రాన్ని పాలించిన పార్టీ దళిత సంక్షేమానికి రూ.16వేల కోట్లు ఖర్చు చేయగా.. మా ప్రభుత్వం రూ.1.25 లక్షల కోట్లు ఖర్చు చేసినట్టు కాగ్ రిపోర్టులే వెల్లడిస్తున్నాయి.

దేశంలో మార్పు కోసం యుద్ధం చేయాలి

అంబేడ్కర్ మార్గంలో కేసీఆర్ ముందుకెళ్తున్నారు: ప్రకాశ్ అంబేడ్కర్

- వాజ్‌పేయి తర్వాత దేశంలో జాతీయ నాయకులే లేరు
- దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్ ఉండాలి
- 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అంబేడ్కర్ మనవడు



ప్రకాశ్ అంబేడ్కర్‌కు బుద్ధుని ప్రతిమను అందిస్తున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రజల్లో, వ్యవస్థలో, దేశంలో మార్పు కోసం భారతీయులు యుద్ధం చేయాల్సిన అవసరం ఉందని బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్ పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక ఇబ్బందులపై ఎలా పోరాటం చేయాలో సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేస్తున్నారన్నారు. శుక్రవారం హుస్సేన్‌సాగర్ తీరాన 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రకాశ్ అంబేడ్కర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. "చదువుకోవడం, చదువుకున్న తర్వాత ఏకమై సమాజంలో మార్పుకోసం పోరాటం చేయాలని అంబేడ్కర్ ఉద్బోధించారు. దేశంలో ఆర్థిక అంతరాలు, ఆర్థిక దోపిడీల గురించి అప్పట్లోనే 'ప్రాబ్లెమ్ ఆఫ్ రూపీ' అనే పుస్తకం రాశారు. దళితబంధు పథకం ద్వారా రూపాయి రూపాన్ని మార్చేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. దేశ ఆర్థిక దుర్బలతపై ఎలా పోరాడాలో చెప్పడంతోపాటు దళిత బంధు ద్వారా పేదరిక నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం కొత్త దిశను ఇచ్చే ప్రయత్నం చేస్తోంది" అని ప్రకాశ్ పేర్కొన్నారు.

రాష్ట్రాల నుంచే జాతీయ నాయకత్వం

దేశంలో కేవలం మతపరమైన మైనారిటీలే కాకుండా కమ్యూనిటీ మైనారిటీలు కూడా ఉన్నారని అంబేడ్కర్ అప్పట్లోనే స్పష్టం చేశారని ప్రకాశ్ గుర్తుచేశారు. ధర్మం, జాతి పేరిట రాజకీయాలు జరిగే దేశంలో సహజ నాయకులు ఉండరని కూడా చెప్పారని వివరించారు. దేశంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి తర్వాత అసలైన జాతీయ నాయకుడెవరూ లేరని వ్యాఖ్యానించారు. రాష్ట్రాల నుంచే జాతీయ నాయకత్వం వస్తుందని తాను నమ్ముతున్నానని చెప్పారు. తెలంగాణ దేశానికి దిక్సూచిగా ఉందని, దేశానికి మోడల్‌గా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశానికి రక్షణపరంగా రెండో రాజధాని అవసరమని, అది హైదరాబాద్ అయితేనే బాగుంటుందని అంబేడ్కర్ చెప్పారని.. ఎప్పటి నుంచో ఈ డిమాండ్ ఉందని ప్రకాశ్ అంబేడ్కర్ చెప్పారు. ఈ డిమాండ్ నెరవేరాలని తాను కోరుకుంటున్నానని, తెలంగాణ ప్రభుత్వం కూడా కోరుకుంటుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

హెలికాప్టర్‌తో పూలవాన





అట్టహాసంగా భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమం

- బౌద్ధ భిక్షువుల ప్రత్యేక ప్రార్థనలు.. విగ్రహం దిగువన పీఠంలో ఫొటో ఎగ్జిబిషన్

సాక్షి, హైదరాబాద్: హుస్సేన్‌సాగర్ తీరాన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మధ్యాహ్నం 3.15కు ప్రగతిభవన్ నుంచి బయలుదేరిన సీఎం కేసీఆర్ 3.30 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఆయనతో పాటు అంబేడ్కర్ మనవడు, మాజీ ఎంపీ ప్రకాశ్ అంబేడ్కర్ కూడా అక్కడికి వచ్చారు. తొలుత బౌద్ధ భిక్షువులు సాంప్రదాయ పద్ధతిలో ప్రార్థనలు చేస్తూ వారికి ఆహ్వానం పలికారు. తర్వాత వారు అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక మీదుగా అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం పీఠం వద్ద ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని ప్రకాశ్ అంబేడ్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెలికాప్టర్‌తో అంబేడ్కర్ భారీ విగ్రహంపై గులాబీ రేకులు వెదజల్లారు. తర్వాత అంతా విగ్రహం వేదికపైకి చేరుకుని.. బౌద్ధ భిక్షువులు చేసిన ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్, వీడియోల ప్రదర్శనలు

విగ్రహావిష్కరణ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం దిగువన పీఠంగా ఏర్పాటు చేసిన భవనంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో సీఎం కేసీఆర్, ప్రకాశ్ అంబేడ్కర్‌తోపాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ఆడిటోరియంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'ఆత్మబంధువు అంబేడ్కరుడు'వీడియోను వీక్షించారు. తర్వాత అంతా సభా వేదికకు చేరుకున్నారు. హైదరాబాద్‌లో 'డిక్కీ'కార్యాలయం ఏర్పాటుకు రెండెకరాలను కేటాయిస్తూ.. సంబంధిత పత్రాలను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కలసి డిక్కీ జాతీయ అధ్యక్షుడు నర్రా రవికుమార్‌కు అందజేశారు. తర్వాత కేసీఆర్ ప్రకాశ్ అంబేడ్కర్‌తో కలసి 'దళిత బంధు విజయగాథ'సీడీని ఆవిష్కరించారు. కేసీఆర్, ప్రకాశ్ అంబేడ్కర్, కొప్పుల ఈశ్వర్ ప్రసంగించగా.. ఎమ్మెల్యే రసమయి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ ఆధ్వర్యంలో కళాకారుల ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాల్లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు మంత్రులు, ప్రభుత్వ చీఫ్ విప్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'దళితబంధు' దేశానికే మార్గదర్శి

- అంబేడ్కర్ మనవడు, వంచిత్ బహుజన్ అఘాడీ పార్టీ అధినేత ప్రకాశ్ అంబేడ్కర్
- మిగిలిన కులాలకు సైతం పథకం వర్తింపజేయాలి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దళితబంధు పథకం దేశానికే మార్గదర్శి అని, ఇతర రాష్ట్రాలు కూడా దీనిని అమలు చేయాలని అంబేడ్కర్ మనవడు, వంచిత్ బహుజన్ అఘాడీ పార్టీ అధినేత ప్రకాశ్ యశ్వంత్ అంబేడ్కర్ అన్నారు. జమ్మికుంట, హుజూరాబాద్‌లలో దళితబంధు పథకం యూనిట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, విప్ బాల్క సుమన్ ఉన్నారు. ముందుగా హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన హుజూరాబాద్ చేరుకున్న అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. దళితబంధు యూనిట్లను పరిశీలించిన అనంతరం హుజూరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం బాగుంది. ఇది దేశంలోనే సరికొత్త పథకం. ప్రజలకు విద్యతోపాటు ఆర్థిక సాయం అందించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. దళిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేయడం అభినందనీయం. మొన్నటిదాకా కూలీలుగా బతికిన వారంతా ఈ పథకం వల్ల ఇప్పుడు ఓనర్లుగా మారారు. లబ్ధిదారులతో మాట్లాడాను. ఇంత తక్కువ సమయంలో ఈ పథకం లబ్ధిదారులకు అందేలా శ్రమించిన సీఎం కేసీఆర్, జిల్లా అధికారులకు ధన్యవాదాలు. 70 ఏళ్లుగా దళితుల జీవన ప్రమాణాలు మెరుగుపడకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్న తీరును నేను స్వయంగా చూశాను. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ పథకం అమలు కావాలి. ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు కారణమైన ఈ పథకం దేశానికే మార్గదర్శిగా నిలిచింది. దేశంలో 30 శాతం వరకు ఉన్న అట్టడుగు వర్గాల వారికి సైతం ఈ పథకం వర్తింపజేయాలి. ఈ విషయాన్ని నేను సీఎం కేసీఆర్ వద్ద ప్రస్తావిస్తాను' అని అన్నారు.



హుజూరాబాద్‌లో దళితబంధు కింద ఏర్పాటైన జూట్‌బ్యాగ్‌ల మిషన్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ప్రకాష్ అంబేడ్కర్

ప్రకృతి సమతుల్యత కోసం అంబేడ్కర్ పరితపించారు

గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో మొక్కలు నాటిన ప్రకాశ్ అంబేడ్కర్

సాక్షి, హైదరాబాద్: తమ తాత, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనుషుల్లో సమానత్వం-ప్రకృతి సమతుల్యత కోసం పరితపించారని ప్రకాశ్ అంబేడ్కర్ అన్నారు. ఆయన జయంతి రోజున 'గ్రీన్ ఇండియా చాలెంజ్' కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 'గ్రీన్ ఇండియా చాలెంజ్'లో పాల్గొని బేగంపేటలో మొక్కలు నాటారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా అంబేడ్కర్ ఉన్నప్పుడు తనను కలిసేందుకు వచ్చే ప్రతీ ఒక్కరు ఒక మొక్కను నాటాకే తన వద్దకు రావాలని కోరుకున్నారని ఆయన మనుమడు ప్రకాశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తమ తాత అంబేడ్కర్‌కు మొక్కలు నాటడం పట్ల అమితమైన ఆసక్తి ఉండేదన్నారు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఆ స్ఫూర్తిని 'గ్రీన్ ఇండియా చాలెంజ్'లో చూస్తున్నామని పేర్కొన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తున్న 'గ్రీన్ ఇండియా చాలెంజ్'సృష్టికర్త ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ ఆశయం గొప్పదన్నారు. 'గ్రీన్ చాలెంజ్'లిమ్కాబుక్‌లో చేరడం తనకు ఆనందాన్ని కలిగించిందని, సంతోష్ కృషికి మరింత గుర్తింపు రావాలని ఆకాంక్షించారు. మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, గ్రీన్ చాలెంజ్ ప్రతినిధి సంజీవ రాఘవ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇదం జగత్



మళ్లీ ఎవరిపైనా మనోభావాలు దెబ్బతిని పరువు నష్టం దావా వేస్తారేమోనని.. ముందే సారీ చెప్పేస్తున్నారు!



అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎం కేసీఆర్, ప్రకాశ్ అంబేడ్కర్, మంత్రులు, సీఎస్ తదితరులు



'ఆత్మబంధువు అంబేడ్కరుడు' వీడియోను వీక్షిస్తున్న దృశ్యం



అంబేడ్కర్‌కు హరీశ్ నివాళి

క్లుప్తంగా...

ఘనంగా ఎయిర్‌ఫోర్స్ మార్షల్ అర్జన్ సింగ్ జయంతి

సాక్షి, హైదరాబాద్: భారత వాయుసేనలో విశిష్ట సేవలందించిన మార్షల్ అర్జన్ సింగ్ 104వ జయంతి వేడుకలను సికింద్రాబాద్ ఎయిర్‌వార్‌ఫేర్ కాలేజీలో శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. ఫైవ్‌స్టార్ ర్యాంక్ అధికారిగా ప్రత్యేక గుర్తింపు ఉన్న అర్జన్ సింగ్ భారత వాయుసేన చేపట్టిన కీలక ఆపరేషన్లలో పాల్గొన్నారు. అర్జన్ సింగ్ సేవలను ఈ సందర్భంగా సీనియర్ అధికారులు గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలు యువ అధికారులకు స్ఫూర్తిగా ఉంటాయని పేర్కొన్నారు.

'ప్రపంచ క్వాంటం డే' కు ట్రిపుల్ ఐటీ శాస్త్రవేత్తలు

రాయదుర్గం (హైదరాబాద్): అత్యంత ప్రతిష్టాత్మకంగా సాగే ప్రపంచ క్వాంటమ్ డే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ శాస్త్రవేత్తలకు కలిగింది. 2వ ప్రపంచ క్వాంటం దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి వీరు మన దేశానికి ప్రాతినిధ్యం వహించారు. క్వాంటం టెక్నాలజీని ఉపయోగించి చేస్తున్న పరిశోధనలకు గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 14ను ప్రపంచ క్వాంటం డేగా నిర్ణయించారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ (ఐఐటీహెచ్)లోని క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ అరుణ్ కె పాటికి కూడా ఈ అరుదైన అవకాశం లభించింది.

అంబేడ్కర్ లేనిదే తెలంగాణ లేదు

పార్లమెంట్‌కు కూడా అంబేడ్కర్ పేరు పెట్టాలి: మంత్రి కేటీఆర్

- పంజగుట్ట కూడలికి అంబేడ్కర్ పేరుపై త్వరలో నిర్ణయం
- విప్లవాత్మకమైన ఆలోచనలు ఉన్న నాయకుడు కేసీఆర్ అని వెల్లడి



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

పంజగుట్ట (హైదరాబాద్): అంబేడ్కర్ లేనిదే తెలంగాణ లేదని, ఆయన రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిందని, ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ చెప్పారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ప్రవచించిన విధంగా బోధించు, సమీకరించు, పోరాడు అనే తత్వాన్ని సంపూర్ణంగా వంటబట్టించుకున్న సీఎం కేసీఆర్.. లక్షల మందిని ఐక్యం చేసి పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని గుర్తుచేశారు. శుక్రవారం పంజగుట్ట కూడలిలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి కేటీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం కూడా ఖైరతాబాద్ నియోజకవర్గంలోనే ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పక్కనే ఉన్న సచివాలయంలో కూర్చునే ప్రతీ ఒక్కరికి దశాబ్దాలు, శతాబ్దాలపాటు దిశా నిర్దేశం చేసేలా ఆయన విగ్రహం ఉందని చెప్పారు. తెలంగాణ రాకముందు 270 గురుకులాలు ఉండేవని, ఇప్పుడు 1,001 గురుకులాలు ఉన్నాయని చెప్పారు. వీటిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీకి చెందిన ఆరు లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.1.20 లక్షలు ఖర్చుచేస్తూ ప్రపంచంతోనే పోటీపడే విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

కేసీఆర్‌తోనే సాధ్యం

దళితబంధు లాంటి గొప్ప పథకం తీసుకురావాలన్నా, దేశంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నా, సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టాలన్నా అది విప్లవాత్మకమైన ఆలోచనలు, దమ్మున్న నాయకుడు కేసీఆర్‌తోనే సాధ్యమని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ సచివాలయానికి అంబేడ్కర్ పేరుపెట్టిన విధంగా పార్లమెంట్‌కు కూడా అంబేడ్కర్ పేరుపెట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేద్దామని పిలుపునిచ్చారు. పంజగుట్ట కూడలికి అంబేడ్కర్ కూడలి అని నామకరణం చేయాలన్న డిమాండ్‌పై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ కలలు కన్న పాలన మన తెలంగాణలో సాగుతోందన్నారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎన్నో పథకాలు తెచ్చారని చెప్పారు. ఈ సంవత్సరం దళితబంధుకు రూ.17,700 కోట్లు విడుదల చేశారని, మరో లక్షకు పైగా లబ్ధిదారులకు ఈ పథకం అందుతుందన్నారు. ఈ పథకంతో రాష్ట్రంలోని ప్రతీ దళిత కుటుంబంలో వెలుగులు నిండుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దళితబంధు లబ్ధిదారులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, సైదిరెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

యునెస్కో గుర్తింపు లక్ష్యంగా మరిన్ని ప్రాంతాల అభివృద్ధి

జేఆర్సీలో ఐఐఐడీ–హెచ్‌ఆర్‌సీ డిజైన్ అవార్డ్స్–2022 ప్రదానంలో అరవింద్‌కుమార్



ఐఐఐడీ–హెచ్‌ఆర్‌సీ డిజైన్ అవార్డ్స్–2022 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అరవింద్‌కుమార్

రాయదుర్గం: దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ గుర్తింపు పొందిందని రాష్ట్ర మున్సిపల్ శాఖముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ వెల్లడించారు. రాష్ట్రంలో గోల్కొండ కోట, చార్మినార్‌లే కాకుండా మరిన్ని ప్రాంతాలు యునెస్కో గుర్తింపు పొందేలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ రీజనల్ చాప్టర్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో ఐఐఐడీ–హెచ్‌ఆర్‌సీ డిజైన్ అవార్డ్స్–2022 ప్రదానోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇటీవలే కూలింగ్ రూఫింగ్ విధానాన్ని ప్రకటించామని, 1,96,544 భవనాల ప్లాన్స్‌కు అనుమతించామని చెప్పారు. అనంతరం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇంటీరియర్ డిజైనర్లకు అవార్డులను అందజేశారు. కార్యక్రమాన్ని ఐఐఐడీ–హెచ్‌ఆర్‌సీ చైర్మన్ మనోజ్‌వాహి, గౌరవ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కన్వీనర్ రవిఅంచూరి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చీమలపాడు దుర్ఘటనలో మరొకరు మృతి

- నాలుగుకు చేరిన మృతుల సంఖ్య
- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న సందీప్ మృత్యువాత



సందీప్ (ఫైల్)



తమకు దిక్కెవరంటూ కొడుకును పట్టుకొని రోదిస్తున్న సందీప్ భార్య

కారేపల్లి: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడులో ఈ నెల 12న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా బాణాసంచా కాల్చే క్రమంలో సిలిండర్ పేలిన ఘటనలో మృతులసంఖ్య నాలుగుకు చేరింది. ఘటన జరిగిన రోజే ముగ్గురు మృతి చెందగా, రెండుకాళ్లు కోల్పోయి తీవ్రంగా గాయపడిన చిందివారి సందీప్(36) హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. అతడికి భార్య మమత అలియాస్ మొమీన్, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా సిందేయి తాలూకా మింగరి గ్రామానికి చెందిన చిందివారి సందీప్ బతుకుదెరువు కోసం పదిహేనేళ్ల క్రితం తెలంగాణకు వచ్చాడు. తల్లిదండ్రులు, సోదరి పోషణ బాధ్యతలు సందీప్ చూసు కుంటున్నాడు. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సందీప్ సుతారీ పనులు చేసే క్రమంలో ఒడిశా ప్రాంతానికి చెంది మొమీన్ పరిచయం కావటంతో ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి నాలుగేళ్ల కుమారుడు కృష్ణ ఉన్నాడు. ఏడాది క్రితం పొట్ట చేతపట్టుకొని కారేపల్లి మండలం చీమలపాడుకు సందీప్, మొమీన్ వచ్చారు. భార్య గ్రామంలో వ్యవసాయకూలీ పనులకు వెళ్తుండగా, సందీప్ సుతారీ పనులు చేసేవాడు. ఈ నెల 12న మొమీన్ మిర్చి తోటలో పనికి వెళ్లగా, గ్రామంలో జరిగిన బీఆర్‌ఎస్ సమావేశానికి సందీప్ హాజరయ్యాడు. ఆరోజు గుడిసె కాలి పోతుండటంతో అందరితోపాటు మంటలు ఆర్పే క్రమంలో సిలిండర్ శకలాలు దూసుకురావడంతో సందీప్ రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. తొలుత ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి, తర్వాత నిమ్స్‌కు తరలించగా శుక్రవారం మృతి చెందాడు. ఊరుగాని ఊరిలో భర్తను కోల్పోయిన మొమీన్ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

నిత్యము సంతుష్టుడై, యోగియై, మనో నిగ్రహం కలవాడై,
దృఢమైన నిశ్చయముతో, మనో బుద్ధులను నాకు అర్పించిన
భక్తుడు నాకు ప్రియుడు.
– భగవద్గీత

సాక్షి

శనివారం, 15 ఏప్రిల్ 2023

కర్ణాటకంలో కథానాయకుడెవరు?

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రోజుల క్రితం మొదలైన టికెట్ల పంపిణీ పర్వం ఎప్పటిలాగే ప్రధాన పక్షాల్లో ముసలం పుట్టిస్తోంది. సహజంగానే కాంగ్రెస్, జేడీ(ఎస్)ల కన్నా అధికార బీజేపీకే అసంతృప్తి తాకిడి ఎక్కువుంది. నాలుగేళ్లనాడు గోడదూకుళ్లతో అధికారంలోకొచ్చినందుకు ఇది ఆ పార్టీకి అనివార్యం. రాష్ట్రంలో తనవల్లే బీజేపీకి అధికారం సాధ్యమైందనుకునే పార్టీ నేతలు, ఫిరాయింపు నేతలు చాలామందే ఉండటం ఇందుకు కారణం. నాయకత్వం ఎంతో ఊగిసలాడి, ఎన్నికల్లో ఏమవుతుందోనన్న లెక్కలేసుకుని చివరకు 17 మంది ఫిరాయింపుదారుల్లో 14 మందికి టిక్కెట్లు ఇవ్వక తప్పలేదు. 224 అసెంబ్లీ స్థానాలుంటే బీజేపీ ఇంతవరకూ రెండు జాబితాల్లో 212 మందికి టిక్కెట్లిచ్చింది. ఈ రెండు జాబితాలతోనే దాదాపు 30 స్థానాల్లో తిరుగుబాటు జెండాలు పైకిలేచాయి. 18 మంది సిట్టింగ్‌లకూ, డజను మందికి మించి మాజీ ఎమ్మెల్యేలకూ ఈ జాబితాల్లో చోటు దక్కలేదు. మాజీ సీఎం జగదీశ్ షెట్టార్‌కు టికెట్ వస్తుందో రాదో ఇంకా తేలలేదు. సీనియర్ నేత, మాజీ సీఎం యడ్యూరప్ప ఆగ్రహంతో ఉన్నారని తొలుత వార్తలొచ్చినా బెంగళూరులో అడుగుపెట్టి అంతా బాగుందని ఆయన కితాబునివ్వటం బీజేపీకి ఉన్నంతలో ఊరటనిచ్చే అంశం. 'ఆయన ఫోన్ స్విచాఫ్ చేసుకున్నారంటే 50 స్థానాల్లో బీజేపీ కనుమరుగు కావటం ఖాయం' అని యడ్యూరప్ప శిబిరంలోని ఎమ్మెల్యే ఒకరు అంతక్రితం హెచ్చరించారు. యడ్యూరప్ప 1983 మొదలుకొని ఏడు దఫాలు ప్రాతినిధ్యంవహించిన శివమొగ్గ జిల్లాలోని షికారిపురా స్థానంలో ఈసారి ఆయన కుమారుడు విజయేంద్రకు చోటు దొరికింది. యడ్యూరప్ప సామాజిక వర్గమైన లింగాయత్‌లకు 51 స్థానాలు కేటాయించారు. మాజీ ఉపముఖ్యమంత్రి, యడ్యూరప్ప అనుచరుడు, లింగాయత్ నేతల్లో ముఖ్యుడైన లక్ష్మణ్ సవాది టికెట్ దక్కకపోవటంతో కాంగ్రెస్‌లో చేరటం పార్టీకి నష్టమే. ఇతర పార్టీలను కుటుంబ పార్టీలంటూ, కుల పార్టీలంటూ నిందించే బీజేపీ కుల సమీకరణాలూ, కుటుంబ సమీకరణాలూ చూసుకుని టిక్కెట్లు ఇవ్వక తప్పలేదు. దక్షిణాదిలో బలంగా ఉన్న ఏకైక రాష్ట్రం కర్ణాటకలో తిరిగి అధికారం చేజిక్కించుకోవటమే లక్ష్యంగా ఈ దఫా ఏలుబడిలో హిందూత్వ కార్డును బీజేపీ బలంగా ఉపయోగించింది. విద్యాసంస్థల్లో హిజాబ్ నిషేధం, ముస్లింలకున్న 4 శాతం కోటా రద్దు అందులో భాగమే. ముస్లింలకు రద్దుచేసిన కోటాను ప్రధాన కులాలైన లింగాయత్‌లకూ, వొక్కళిగలకూ చెరిసగం పంచారు. అందువల్ల ఆ రెండు ప్రధాన కులాల ఓట్లూ తనకే పడగలవని బీజేపీ విశ్వసిస్తోంది. కర్ణాటకలో యడ్యూరప్ప నుంచి పెద్దగా ఒత్తిళ్లు లేకుండా టిక్కెట్ల వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షించగలగటం అధిష్టానానికి ఇదే మొదటిసారి. అయితే పార్టీలో ఇన్నేళ్లుగా ప్రత్యామ్నాయ నాయకుడిని రూపొందించటంలో అధిష్టానం విఫలమైంది. బలమైన రాష్ట్రంలో ఈ పరిస్థితి ఏర్పడటం పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితే. ముఖ్యమంత్రి బసవ రాజ్ బొమ్మై యడ్యూరప్పతో సరితూగే నేత కాదన్నది పార్టీలో అందరికీ తెలుసు.

సమస్యలు వచ్చిపడినప్పుడు ఉద్యమించటానికి బదులు ఎన్నికలప్పుడు అధికార పక్షంపై విమర్శలు గుప్పించటం కర్ణాటకలోని పార్టీలకూ అంటింది. ముఖ్యంగా హిజాబ్ నిషేధం, ముస్లింల కోటా రద్దు అంశంలో కాంగ్రెస్, జేడీ(ఎస్)లు బలంగా తమ వాణి వినిపించలేకపోయాయి. ముస్లింలు అధికంగా ఉండే కోస్తా కర్ణాటకలోని 21 స్థానాల్లో కాంగ్రెస్, జేడీ(ఎస్)లపై దీని ప్రభావం ఎలావుంటుందో వేచిచూడాలి. గత నెలాఖరులో విడుదలైన సీ–ఓటర్ సర్వే అయితే కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందని జోస్యం చెప్పింది. కానీ కాంగ్రెస్ దాన్ని నిజం చేస్తుందా లేదా అన్నదే ప్రశ్న. పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, సిద్ధరామయ్యల మధ్య ఎప్పుడూ పొసగదు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సీఎం చేస్తే తనకు అభ్యంతరం లేదని శివకుమార్ ఇటీవల చెప్పటం సిద్ధరామయ్య శిబిరానికి ఆగ్రహం తెప్పించింది. జేడీ(ఎస్)ది మరో వ్యథ. సమస్యలపై పోరాడాల్సిన సమయంలో ఆ పార్టీ వారసత్వ పోరుతో కొట్టుమిట్టాడింది. వొక్కళిగలు అధికంగా ఉన్న మైసూర్ ప్రాంతంలో జేడీ(ఎస్) బలంగానే ఉండేది. ఈసారి బీజేపీ పాగా వేయాలని చూస్తోంది. నామినేషన్ల ఘట్టం పూర్తయ్యేనాటికైనా జేడీ(ఎస్) ఇంటిని చక్కదిద్దుకుంటుందో లేదో చూడాల్సివుంది.

తాము ఓట్లేసి గెలిపించిన పక్షమే అధికారంలోకొస్తుందన్న గ్యారెంటీ లేని స్థితిలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక ఈ జాడ్యం చాలా రాష్ట్రాలకు అంటినా కర్ణాటకది ప్రత్యేకమైన పరిస్థితి. అక్కడ స్వప్రయోజనాలు తప్ప సిద్ధాంత జంజాటం లేని నేతల సంఖ్య ఎక్కువే. కనుక అస్థిర రాజకీయాలు రివాజుగా మారాయి. ప్రజాభీష్టాన్ని తెలుసు కోవటమనే ప్రక్రియను విడనాడి, ప్రజాభీష్టాన్ని తయారు చేయటం కోసం ఎడతెగకుండా శ్రమించే పార్టీల హవాయే ప్రస్తుతం ఎక్కువగా నడుస్తోంది. ఎన్నికలు నిర్వహించటంతోనే ప్రజాస్వామ్య కర్తవ్యం పరిపూర్తయిందని భావించటంకాక, ప్రజానీకం ఆశలు ప్రతిఫలించేలా... వారిలో ప్రజా స్వామ్య స్ఫూర్తి ఇనుమడించేలా ఏలుబడి సాగించటం ముఖ్యమని అన్ని పార్టీలూ గ్రహించటం అవసరం. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యానికి అర్థం, పరమార్థం ఉంటుంది.

మనిషి కేంద్రంగానే ఆలోచనలన్నీ...

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

రెండువేల ఆరువందల సంవత్సరాల క్రితం మనిషి పుట్టుక, బతుకు, జీవితం, చావుల గురించి; మానవజాతి దుఃఖోపశమన మార్గాల గురించి ఆలోచించి, అన్వేషించి జ్ఞానోదయం పొందినవాడు బుద్ధుడు. ఆ కాలంలోనే 'బహుజన హితాయ బహుజన సుఖాయ' అన్నాడాయన. సర్వమానవ జాతి సుఖమయంగా జీవించడానికి అవసరమైన జీవన సత్యాలు, దుఃఖనివారణ మార్గాలు, ప్రకృతి సంరక్షణ... అహింసాయుత ప్రేమమయ సామాజిక స్థితులకు గల మూలాలు బౌద్ధధర్మంలో ఉన్నాయి. ఇది మనిషికేంద్రంగా చెప్పబడిన నైతిక ధర్మం.

బౌద్ధాన్ని హృదయానికి హత్తుకొని, బౌద్ధభిక్షువులుగా మారి, బౌద్ధధర్మ ప్రచారానికి తమను తాము అంకితం చేసుకున్నవాళ్ళు 2,500 ఏళ్ల కాలంలో చాలామందే ఉన్నారు. కాని బుద్ధుడు చెప్పిన నైతిక ధర్మాలను, బహుజన హితాన్ని, బహుజన సుఖాన్ని జీర్ణించుకొని దానికి ఆచరణశీలత కల్పించిన అపరబోధిసత్వుడు మాత్రం అంబేడ్కర్ ఒక్కడే. బౌద్ధధర్మాన్ని భారతీయాత్మకు సరిపోయేలా రాజ్యాంగంలోనూ, అనేక పుస్తకాల్లోనూ చొప్పించి బహుజనుల హితానికి ఎంతో మేలు చేశారు అంబేడ్కర్. కులం మెట్ల భారతీయ సమాజాన్ని సామాజిక అంతరాలు లేని సమసమాజంగా నిలబెట్ట డానికి... ఈ దేశపు అట్టడుగు వర్ణాల, వర్గాల, జాతుల పక్షాన నిలబడి తన జీవితాన్నే అంకితం చేసిన అపర బోధిసత్వుడు అంబేడ్కర్.

అంబేడ్కరిజం అంటేనే స్పష్టంగా చెప్పాలంటే బౌద్ధధర్మానికి ఆచరణశీల రూపం.

అంబేడ్కర్ కుల రహిత భారతాన్ని స్వప్నించారు. స్టేట్ సోషలి జాన్ని కోరుకున్నారు. కాని సాయుధ పోరాటం ద్వారా వచ్చే సోషలిస్టు వ్యవస్థను కాదు. మతాలన్నీ ఘనీభవించుకుపోవడం గమనించారు. అందుకే ఏ మతాన్నీ స్వీకరించలేదు. మతవాసనలు లేని నైతిక ధర్మ మైన బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి తాను మతాలకు అతీతుణ్ణని చాటి చెప్పారు. నైతికత, శాస్త్రీ యత, మనిషికి ప్రాము ఖ్యత నివ్వడం అపర బోధి సత్వుడికి బౌద్ధంలో నచ్చిన అంశాల్లో కొన్ని. మని షిని దృష్టిలో పెట్టుకునే పథ కాలు రూపొందించాలి. భౌతికపరమైన లౌకిక విష యాలకే మొదటి ప్రాధా న్యత ఇవ్వాలి. అంటే మనిషి బతకడానికి అవస రమైన కూడు, గూడు, గుడ్డ, వైద్యం, భూమి లాంటి వాటికి ప్రాధా న్యత నిచ్చి తీరాలి. వీటితోపాటు భావప్రకటనా స్వేచ్ఛ, మతస్వేచ్ఛ, ప్రతివాడికీ ఓటుహక్కు లాంటివి రాజ్యాంగంలో పొందుపరిచారు. ఈ ఓటు హక్కు ద్వారా ఎవరైనా సరే ఎన్నికల్లో ఓటువేయడం మాత్రమే కాదు, పోటీచేసి పాలకుడయ్యే అవకాశమూ ఉంది.

కాని సెక్యులరిజం అనే పదం కొన్ని రాజకీయ పార్టీలకు బూతు పదమైంది. భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మాత్రం సెక్యులర్ పదాన్ని సరైన అర్థంలోనే తన పాలనాకాలంలో ఉపయోగించారు. వీలైనంత వరకు మతాతీతంగానే, ప్రవర్తించారు. నెహ్రూకున్న ఆధునిక భావాలు, సెమీ సోషలిస్టు విధానాలు, సెక్యులర్ ధోరణి భారతదేశాన్ని నవభారతంగా మార్చే దిశగా నడిపించాయి. కాని క్రమక్రమంగా హిందుత్వశక్తులు బలపడు తున్నకొద్దీ నెహ్రూ తర్వాతి కాలంలో కాంగ్రెస్‌లోనూ హిందూ ఓటర్లను ఆకర్షించడానికి సెక్యులర్ పదానికి అర్థం మారింది. హిందుత్వశక్తులు కేంద్రంలో స్వబలంతో అధికారంలోకి రావడానికి మతం, మత సెంటిమెంట్లు బాగా ఉప యోగపడ్డాయి. ప్రియాంబుల్ నుంచి సెక్యులర్ పదాన్నే తీసివేయా లన్నంతగా, మనిషి కేంద్రంగా ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని మార్చి మతం, మనువాదం కేంద్రంగా రాజ్యాంగం ఉండాలనేంతగా ప్రచారం జరుగుతోంది.

అయితే ఇదే సమయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంటి నాయకులు అందరి విశ్వాసాలను గౌరవించడమే సెక్యులరిజంగా భావిస్తూ మనిషి కేంద్రంగా పాలన కొనసాగిస్తున్నారు. ఏ మత విశ్వాసాలనూ తక్కువ చేయకుండా, ఏ మత భావనలనూ ప్రోత్సహించకుండా... మతమనేది వ్యక్తిగత విశ్వాసంగా భావిస్తూ మానవాభి వృద్ధే ధ్యేయంగా పథకాలు కొనసాగిస్తున్నారు. విద్య, వైద్యం, వ్యవ సాయం, ఉద్యోగ కల్పనలపై దృష్టి కేంద్రీకరించి పాలన కొనసా గిస్తున్నారు. ఇలాంటి విషయాలు తెలుగుదేశం, జనసేన లాంటి పార్టీ నాయకులకు; బీజేపీకీ నచ్చడం లేదు. జగన్ సెక్యులర్ భావాలు వారికి మెజారిటీ ప్రజల మతానికి వ్యతిరేకమైనవిగా కనబడుతు న్నాయి. ఓట్ల రాజకీయాల నేపథ్యంలోఎలాగైనా సరే అధికారంలోకి రావాలన్న తపన తప్ప వీరికి ప్రజలంటే ప్రేమ లేదు. ప్రజలకు ఉపయోగపడే ప్రాపంచిక దృక్పథమూ లేదు. భారత రాజ్యాంగం సురక్షితంగా ఉండాలన్నా, అంబేడ్కర్ చెప్పినట్లు అభివృద్ధి ఫలాలు కుల, మత, వర్గ ప్రాంతాలకు అతీతంగా అందరికీ సమానంగా అందాలన్నా... జగన్‌లాంటి నాయకుల పాలన అవసర మన్నది చరిత్ర చెబుతున్న సత్యం.

వ్యాసకర్త కథా రచయిత । 91829 18567

కప్పిపుచ్చడమే..
అసలైన కుట్ర!

- హత్యాయత్నం జరిగిన నాడు... నిందితుడికి నేరచరిత్ర లేదని రాసేసిన 'రామోజీ'
- నేరచరిత్ర ఉందని ఆ మరుసటిరోజు చెప్పిన విశాఖ పోలీస్ కమిషనర్
- అలా రాయాలంటూ 'ఈనాడు'కు చెప్పిందెవరో తేలాలి కదా?
- అప్పటికి కొద్ది రోజులుగా ఎయిర్‌పోర్టులో పనిచేయని సిసి కెమెరాలు
- అంతకు ముందే 'ఆపరేషన్ గరుడ' అంటూ నటుడు శివాజీ డ్రామా
- దాన్ని ప్రస్తావిస్తూ... హత్యాయత్నం జరిగిన నాడే చంద్రబాబు అనుమానాలు
- వీటన్నిటినీ తన స్టేట్‌మెంట్లో ప్రస్తావించిన నాటి విపక్ష నేత వైఎస్ జగన్
- కాలం గడుస్తున్నా తేల్చలేదు కనక... దర్యాప్తు వేగవంతానికి తాజా పిటిషన్

మొదటి నుంచీ అంతే!!. 2018 అక్టోబర్లో అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో హత్యాయత్నం జరిగిన రోజునే... అటు 'ఈనాడు' గానీ... ఇటు తెలుగుదేశం పార్టీ గానీ సిగ్గూ ఎగ్గూ వదిలేశాయి. హత్యాయత్నం చేసిన నిందితుడు శ్రీనివాసరావుపై తన స్వస్థలం ముమ్మిడివరంలో ఎలాంటి కేసులూ లేవంటూ రామోజీరావు తొలిరోజునే సర్టిఫికెట్ ఇచ్చేశారు. కానీ రెండవరోజున అప్పటి వైజాగ్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నిందితుడిపై ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్లో నమోదైన రెండు కేసుల్ని వివరించారు. తప్పనిసరై దాన్ని కూడా ప్రచురించింది 'ఈనాడు'. ఇక్కడ గమనించాల్సింది... ప్రశ్నించాల్సింది ఒక్కటే. తొలిరోజున ఏ పోలీస్ అధికారీ చెప్పకుండానే... 'ఈనాడు' తనంతట తానుగా నిందితుడు శ్రీనివాసరావుపై ఎలాంటి కేసులూ లేవని ఎలా ప్రచురించింది? అసలెందుకు ప్రచురించిందీ వార్త? ఎందుకంటే ఇదంతా రామోజీ, చంద్రబాబు కలిసి ఆడించిన కుట్ర కాబట్టి!. తాజాగా ఎన్ఐఏ వేసిన కౌంటర్‌కు తన సొంత భాష్యం చెబుతూ శుక్రవారం 'ఈనాడు' రాసిన వార్త... ఈ కుట్రను మరోసారి స్పష్టంగా బయటపెట్టింది.అంతే!.

7. It is submitted that on 28.01.2018 a police clearance certificate was issued to the respondent No. 2/accused herein without due diligence with regard to pendency of any FIR registered against the above. The said fact can be conspicuously seen from the police clearance certificate which was issued with regard to no FIR crime being registered against the accused herein in the limits of Visakhapatnam Airport Police, but the fact remains that no due diligence was adhered towith regard to enquiry of crime registered in Crime No. 48 of 2017 dated 02.03.20217 under Sections 323 and 506 of IPC, 1860had been registered against Janipalli Srinivasa Rao @ Chanti (A1) at Mummidivaram Police Station, East Godavari District, Andhra Pradesh. It is evident that this important fact was dishonestly concealed by accused at the time of applying for his airport pass.

కోర్టుకు ఎన్ఐఏ సమర్పించిన అఫిడవిట్‌లో జనిపల్లి శ్రీనివాసరావుపై ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో 2017 మార్చి నెలలో కేసు నమోదు అయినట్లు పేర్కొన్న భాగం

ఈనాడు, కాకినాడ– ముమ్మిడివరం, న్యూస్‌టుడే: జగన్‌పై దాడి చేసిన జనిపల్లి శ్రీనివాసరావు మానసిక కుంగుబాటులో నాలుగేళ్ల కిందట ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడని స్థానికులు తెలిపారు. కుటుంబీకులు, స్థానికులు సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పిందని వివరించారు. తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంకకు చెందిన శ్రీనివాసరావు.. జగన్‌కు వీరాభిమాని. జగన్ పుట్టిన రోజు, పాదయాత్ర సందర్భంగా స్థానికంగా బాగా హడావుడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. జగన్ ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేశాడు. శ్రీనివాసరావుకు కోడి పందేలంటే పిచ్చి. ముమ్మిడివరం మండలం ఠాణేలంక సమీపంలోని రాజుపాలెంలో కోడిపందేల బరి ఉంది. ఏటా సంక్రాంతి సందర్భంగా కోడిపందేల్లో పాల్గొనేవాడు. జగన్‌పై దాడికి పాల్పడిన కత్తిని కూడా కోడిపందేల సందర్భంగా సేకరించిందేనన్న వాదన ఉంది. శ్రీనివాసరావుపై ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులు, ఫిర్యాదులు నమోదు కాలేదు.

జనిపల్లి శ్రీనివాసరావుపై ముమ్మిడివరం స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసు నమోదు కాలేదు అంటూ హత్యాయత్నం జరిగిన నాడే 'ఈనాడు' రాసిన వార్త.. (ఫైల్)

వాస్తవానికి సంఘటన జరిగిననాడే 'ఈనాడు' ఏడెనిమిది వార్తలు వేసింది. అందులో ఒక్కటి మాత్రమే దాడికి సంబంధించినది. మిగిలినవన్నీ ఆ దాడితో తెలుగుదేశానికి సంబంధం లేదంటూ ఎదురుదాడి చేసినవే. ఆ రోజు మొదలు... ప్రతిరోజూ ఈ కేసును తప్పుదోవ పట్టించే వార్తలే. కాకపోతే ఈ కేసును దర్యాప్తు చేసిన 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్ఐఏ) 2019 జనవరి 23న దీనిపై ఛార్జిషీట్ వేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యకు ప్రయత్నించటం వెనక కుట్ర కోణం ఉన్నట్లు ఎన్ఐఏ ఆ ఛార్జిషీట్లో స్పష్టంగా పేర్కొంది. ఆ దిశగా దర్యాప్తు చేయాల్సి ఉందని చెప్పింది. ఇలాంటి సమయంలో న్యాయస్థానాలు అయితే ఆ ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుని అభియోగాలు నమోదు చేయటం ... లేకపోతే తదుపరి దర్యాప్తు కొనసాగించి తుది ఛార్జిషీటు వేయాలని చెప్పటం చేస్తాయి. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేసి తుది ఛార్జిషీటు వేయాలని ఎన్ఐఏకు కోర్టు చెప్పింది. కాకపోతే ఏళ్లు గడుస్తున్నా... ఎన్ఐఏ తుది ఛార్జిషీటు వేయలేదు. ఈ కేసులో కుట్ర కోణం దాగి ఉందని తన తొలి ఛార్జిషీట్లో చెప్పింది కాబట్టి... ఆ కోణాన్ని త్వరగా విచారించి తుది ఛార్జిషీటు వేయాల్సిందిగా ఎన్ఐఏను ఆదేశించాలంటూ పిటిషనర్ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

ఆనాడే.. తన స్టేట్‌మెంట్లో.. వివరంగా

తనపై హత్యాయత్నానికి సంబంధించి 2019 జనవరి 17న నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దర్యాప్తు అధికారులకు వాంగ్మూలమిచ్చారు. తనపై హత్యాయత్నం వెనక ఉన్న కుట్ర కోణాన్ని ఆయన బలంగా వినిపించారు. ''నిందితుడెవరో నాకు తెలియదు. కానీ తనను వైఎస్సార్ సీపీ అభిమానిగా చూపించటం, దానికి మద్దతుగా ఒక ఫ్లెక్సీని సృష్టించటం ఇదంతా ఓ పెద్ద కుట్రలో భాగం. ఇదంతా తమకు సంబంధం లేని వ్యవహారంగా చిత్రించడానికి టీడీపీ చేస్తున్న కుట్ర. నా పాదయాత్ర విశాఖలో అడుగుపెట్టిన నాటి నుంచీ హత్యాయత్నం జరిగిన రోజు వరకూ ఎయిర్‌పోర్టులో సీసీ టీవీ కెమెరాలు పనిచేయలేదని నాకు తెలిసింది. పైపెచ్చు నిందితుడికి ఎయిర్‌పోర్టులోని తన ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్లో ఉద్యోగమిచ్చిన హర్షవర్ధన్ చౌదరి టీడీపీ నాయకుడు. 2014లో గాజువాక టిక్కెట్ కూడా ఆశించారు. నిందితుడు శ్రీనివాసరావుపై ఎలాంటి కేసులూ లేవని అబద్ధపు డిక్లరేషన్ ఇచ్చి మరీ తనను పనిలో పెట్టుకున్నాడు. 'ఆపరేషన్ గరుడ' పేరిట టీడీపీ సానుభూతిపరుడైన ఓ నటుడు(శివాజీ) ఇచ్చిన స్టేట్‌మెంట్ కూడా ఈ కుట్రలో భాగమేననిపిస్తోంది. వీళ్లు చేసే హత్యాయత్నం ఫలిస్తే వీళ్లనుకున్నది జరుగుతుంది. ఒకవేళ బెడిసికొడితే.. గరుడలో చెప్పిందే జరిగిందని వీళ్లే ఎదురుదాడి చేయాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది'' అంటూ అప్పట్లో తన స్టేట్‌మెంట్లో వివరంగా చెప్పారు జగన్‌మోహన్ రెడ్డి. మరి దీన్ని ఎన్ఐఏ ఎందుకు సమగ్రంగా విచారించటం లేదు? ఇదే ఇప్పుడు ప్రశ్న.

ఇది కుట్ర కాదనగలమా?

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం చేసిన జానిపల్లి శ్రీనివాసరావు విశాఖపట్నం విమానాశ్రయంలోని

ఏది నిజం?

రెస్టారెంట్ ఫ్యూజన్ ఫుడ్స్‌లో ఉద్యోగంలో చేరడమే ఈ కుట్రకు నాంది. తదనంతరం జరిగిన పరిణామాలు కుట్రను స్పష్టంగా బయటపెట్టేలా ఉన్నా... ఎన్ఐఏ ఉదాసీనంగా ఉండటమే ఇక్కడ విస్మయం కలిగించే అంశం. ఎందుకంటే జె.శ్రీనివాసరావుకు తన రెస్టారెంట్లో ఉద్యోగమిచ్చేందుకు దాని యజమాని హర్షవర్ధన్ చౌదరి అన్ని నిబంధనలనూ తుంగలో తొక్కారు. కట్టుదిట్టమైన భద్రతా వలయంలో ఉండే విమానాశ్రయాల్లో ప్రైవేటు సిబ్బంది నియామకానికి కచ్చితమైన మార్గదర్శకాలున్నాయి. రెస్టారెంట్, ట్రావెల్ ఏజెన్సీల డెస్కులు మొదలైన వాటిలో ప్రైవేటు వ్యక్తులే పని చేస్తారు. అందుకోసమే డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించింది. ఆ మార్గదర్శకాల ప్రకారం విమానాశ్రయంలో పనిచేసే వారికి ఎలాంటి నేర చరిత్ర ఉండకూడదు. ఆ విషయాన్ని నిర్ధారిస్తూ నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) ఇస్తేనే ఉద్యోగంలో చేర్చుకోవాలి. నిజానికి జె.శ్రీనివాసరావుపై 2017లో నాటి తూర్పుగోదావరి జిల్లాలోని ముమ్మిడివరంలో ఓ కేసు నమోదైంది. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతోపాటు పోలీసులు చార్జిషీట్ కూడా వేశారు. అంటే అతనికి నేర చరిత్ర ఉన్నట్టే. కానీ అతనిపై ఎలాంటి కేసులూ లేవని ఫ్యూజన్ ఫుడ్స్ యజమాని హర్షవర్ధన్ చౌదరి డిక్లరేషన్ ఇవ్వటం గమనార్హం. ఇంకా శ్రీనివాసరావుపై తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులూ లేవని, స్వస్థలంలో ఉన్నాయేమో చూడాలని విశాఖ ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్‌వోసీ ఇచ్చారు. కానీ స్వస్థలంలో కేసుల గురించి కనుక్కునే ప్రయత్నం ఎవ్వరూ చేయలేదు. దానికితోడు శ్రీనివాసరావుపై ఎలాంటి కేసులూ లేవంటూ హర్షవర్ధన్ చౌదరి తన సొంత ఎన్ఓసీ ఇచ్చేశారు. హత్యాయత్నం జరిగిన రోజున రామోజీరావు కూడా శ్రీనివాసరావుపై ఎలాంటి కేసులూ లేవంటూ 'ఈనాడు' ద్వారా ఎన్ఓసీ ఇచ్చేశారు. ఇంతటి కీలకమైన అంశంపై ఎన్ఐఏ దృష్టిసారించకపోవటమే పలు అనుమానాలకు తావిస్తోంది.

సీసీ టీవీ రికార్డింగులు ఎందుకు కోర్టుకు సమర్పించలేదు


ఈ కేసులో విమానాశ్రయంలో సీసీ టీవీ కెమెరాల ఫుటేజీ అత్యంత కీలకం. ఎందుకంటే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే విమానాశ్రయంలోకి జె.శ్రీనివాసరావు హత్యాయత్నం చేయడానికి వాడిన కత్తిని ఎలా తీసుకువెళ్లారన్నది కీలకం. హత్యాయత్నానికి కంటే కొన్ని రోజుల ముందటి సీసీ టీవీ కెమెరాల రికార్డులను ఎన్ఐఏ ఆ కెమెరాల తయారీదారైన తోషిబా కంపెనీకి పంపించి విశ్లేషించింది. విమానాశ్రయం కిచెన్‌లో ఓ వంటపాత్రలో ఆ కత్తిని వేడిచేస్తున్నట్టుగా ఆ వీడియో క్లిప్పింగుల్లో ఉందని వెల్లడైంది. జె.శ్రీనివాసరావే ఆ కత్తిని వేడినీటిలో మరిగిస్తున్నట్టుగా వీడియో క్లిప్పింగుల్లో ఉంది. మరి ఆ విషయాన్ని ఎన్ఐఏ ఎందుకు కౌంటర్ అఫిడవిట్‌లో ప్రస్తావించలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. అంతటి కీలకమైన వీడియో క్లిప్పింగులను న్యాయస్థానానికి కూడా సమర్పించకపోవడం గమనార్హం.

నిందితుడి లేఖను కూడా సమర్పించనే లేదు...

ఈ కేసులో నిందితుడు జె.శ్రీనివాసరావు రాసిన లేఖ, ఇతర కాపీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఎన్ఐఏకు అప్పగించారు. తనకు ఏమైనా అయితే తన శరీర అవయవాలను దానం చేయాలని అతను రాసినట్టుగా ఉంది. తనకు ఏదైనా అవుతుందని జె.శ్రీనివాసరావు ముందే ఎలా ఊహిస్తారు... ! అంటే ఇదేమీ యాదృచ్ఛికంగానో అప్పటికప్పుడు హఠాత్తుగానో జరిగింది కాదన్నది సుస్పష్టం. ముందస్తుగానే కొందరితో కలిసి పన్నిన కుట్ర ప్రకారమే అంతా జరిగిందని... ప్లాన్‌తోనే ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని వెల్లడి కావటంలేదా? మరి అంతటి కుట్ర వెనుక ఎవరున్నారన్నది తెలుసుకోవాల్సిన అవసరం లేదా?

దర్యాప్తు ముగియనే లేదు కదా...!
అంత ఆత్రుత ఎందుకు రామోజీ?

హత్యాయత్నం వెనక ఉన్న కుట్రకోణాన్ని త్వరగా దర్యాప్తు చేసి తుది ఛార్జిషీటు వేయాల్సిందిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వేసిన పిటిషన్‌పై ప్రస్తుతం కోర్టు విచారణ జరుగుతోంది. ఈ విచారణలో భాగంగా ఎన్ఐఏను సమాధానమివ్వాలని కోర్టు కోరగా... దీనిపై ఎన్ఐఏ కౌంటర్ వేసింది. ఇది కౌంటర్ మాత్రమే తప్ప తుది ఛార్జిషీటు కాదు. తమ దర్యాప్తు ముగిసిందని కూడా చెప్పలేదు. ఈ కేసులో బాధితుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తావించిన అంశాలను కౌంటర్లో ప్రస్తావించింది. దర్యాప్తు కొనసాగుతోందని చెప్పింది. కానీ దర్యాప్తు ముగిసిపోయినట్లు... ఇక దర్యాప్తు చేసేందుకు ఏమీ లేదని అన్నట్టుగా టీడీపీ అనుకూల పచ్చ మీడియా తెగ హడావుడి చేస్తోంది. నిందితుడు శ్రీనివాసరావు హత్యాయత్నం చేసినట్లు ఎన్ఐఏ ఎప్పుడో చెప్పింది. దానికి కారణాలు తేలాలి. ఆ దిశగా దర్యాప్తు సాగుతోంది. కారణాలు తెలిస్తే కుట్ర కోణమూ బయటపడుతుంది. కాకపోతే దర్యాప్తు కొనసాగుతుండగానే... ఇక కుట్ర కోణమేదీ లేదని ఎల్లో మీడియా తేల్చేసింది. ఎన్నాళ్లగానో తాము చేస్తున్న ప్రయత్నం ఫలించినట్లుగా... ఎన్ఐఏ కౌంటర్‌ను చూసి ఎల్లో మీడియా తెగ సంబరపడిపోయింది. ఎందుకింత ఆత్రం? దర్యాప్తు పూర్తికాకుండానే ఎందుకంత తొందర రామోజీ?




ఎల్లో సిండికేట్ తీరే అంత...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో ప్రజల్ని తప్పుదారి పట్టించడమే లక్ష్యంగా ఎల్లో సిండికేట్ మొదటి నుంచీ వ్యవహరిస్తూ వస్తోంది. ఈ ఘటన జరిగిన వెంటనే అప్పటి డీజీపీగా ఉన్న ఆర్పీ ఠాకూర్ హడావుడిగా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి నిందితుడు జె.శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ అభిమాని అని ప్రకటించేశారు. కేవలం సానుభూతి కోసమే ఈ హత్యాయత్నానికిపాల్పడ్డారని బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న డీజీపీ ఏకపక్షంగా ప్రకటించడం అప్పట్లో అందరినీ నివ్వెరపరిచింది. నిజానిజాలు వెలికితీస్తాం అని ప్రకటించాల్సిన ఆయన... చంద్రబాబు డైరెక్షన్ మేరకు అడ్డగోలు అబద్ధాలు చెప్పారు. ఈ కేసు దర్యాప్తు చేసే కింది స్థాయి పోలీసు అధికారులను ప్రభావితం చేసేందుకే ఆయన అలా ప్రకటించారన్నది సుస్పష్టం.

వైఎస్ జగన్‌కు తీవ్రమైన గాయం అయ్యింది. ఆ కత్తి మెడలో దిగి ఉండే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చేదని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు న్యాయస్థానానికి సమర్పించిన నివేదికలో కూడా అదే విషయాన్ని పేర్కొన్నారు. కానీ గాయం చిన్నదే అని నాటి డీజీపీ, చంద్రబాబు, 'ఈనాడు' కట్టగట్టుకుని ప్రచారం చెయ్యడాన్ని ఏమనుకోవాలి?

మళ్లీ అదే తతంగం


ఇక తాజాగా ఎన్ఐఏ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాల విషయంలోనూ ఎల్లో మీడియా ఇదే పంథా ఎంచుకుంది. హత్యాయత్నం వెనక ఎలాంటి రాజకీయ కుట్ర లేదని నిర్ధారణ అయినట్టుగా కథనాలు ప్రచురించి తన దుర్బుద్ధిని చాటుకుంది. ఎన్ఐఏ కౌంటర్ అఫిడవిట్‌లోని అంశాలను సవాల్ చేస్తూ బాధితుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. అందుకోసం న్యాయస్థానం గడువు ఇస్తూ కేసు విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది. జగన్ తరఫు న్యాయవాది వేసే కౌంటర్లోని అంశాలను న్యాయస్థానం పరిగణలోకి తీసుకున్నాక విచారణ ప్రక్రియ సాగుతుంది. మరోవైపు ఎన్ఐఏ దర్యాప్తు కూడా ఇంకా పూర్తి కాలేదు. తుది నివేదిక రావాలి. ఇవేవీ పట్టించుకోకుండా కేసు దర్యాప్తు ముగిసినట్టే అనే భ్రాంతి కలిగించేలా పచ్చ మీడియా హడావుడి చేస్తుండటమే అసలైన కుట్ర!!.



01/2019/NIA/HYD — Date: 17.01.2019

...atement of Shri Y. S. Jagan Mohan Reddy, Aged 47 years S/o Late Shri Y. S. Rajashekhar Reddy, R/o- Plot No.3/4, Opposite Lotus Pond, HUDA Heights, MLA Colony, Road No.12, Banjara Hills, Hyderabad U/s 161 of CrPC, recorded at above mentioned address.

హర్షవర్ధన్ చౌదరి పాత్రను, తెలుగుదేశంతో ఆయన సంబంధాలను, ఈ కుట్రపై దర్యాప్తు జరగాల్సిన అవసరాన్ని పేర్కొంటూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం.



CHARGE SHEET

RC-01/2019/NIA/HYD

[JAGAN MOHAN REDDY CASE]

17.9. Accused wearing the uniform of Fusion Foods Restaurant entered the VIP lounge with a water bottle in his hand to avoid being stopped by the security personnel at the entrance of the Lounge. He stood on the left hand side of Shri Y.S. Jagan Mohan Reddy. The accused waited for the opportune moment and attacked Shri Y.S. Jagan Mohan Reddy and attempted to stab him on his neck with a sharp knife with intention to kill him and in the

నిందితుడు శ్రీనివాసరావు ఫ్యూజన్ ఫుడ్స్ యూనిఫామ్ వేసుకుని, వాటర్ బాటిల్‌తో వీఐపీ లాంజ్‌లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పక్కన నిల్చుని అవకాశం కోసం చూశాడని, అవకాశం దొరికిన వెంటనే పదునైన కత్తితో హతమార్చుదామని అనుకున్నాడని.. ఈ క్రమంలోనే జగన్‌మోహన్‌రెడ్డి వేగంగా పక్కకు తప్పకోవటంతో భుజానికి గాయం అయిందని ఛార్జిషీట్లో పేర్కొన్న ఎన్ఐఏ.

18.4 Investigation into conspiracy and abetment, if any, relating to attack on Shri Y.S.Jagan Mohan Reddy continues under section 173(8) of CrPC.

ఈ కేసులో కుట్ర కోణాన్ని, నిందితుడిని ప్రేరేపించిన పరిస్థితులుంటే వాటిని కూడా దర్యాప్తు చేస్తామని తొలి ఛార్జిషీట్లో కోర్టుకు చెప్పిన ఎన్ఐఏ.



శుక్రవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న తర్వాత ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర రెడ్డి

ప్రాణం తీసిన ఈత సరదా

- చెరువులో మునిగి ముగ్గురు పిల్లల మృతి
- పెద్దపల్లి జిల్లాలో విషాదం



ఉమామహేశ్వర్



మామిడి విక్రం



మేకల సాయిచరణ్

గోదావరిఖని(రామగుండం): ఆడుకునే వయసు.. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లారు. సెలవురోజు కావడంతో పిల్లల దృష్టి ఈత సరదావైపు మళ్లింది. సమీపంలో ఉన్న చెరువుకు వెళ్లారు. నీటిలో దిగారు. అయితే ఈత రాకపోవడంతో ముగ్గురు పిల్లలు మృతిచెందారు. మూడు కుటుంబాల్లో విషాదం నింపిన ఈ ఘటన పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ న్యూపోరట్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సోయం ఉమామహేశ్వర్ (12), మామిడి విక్రం (13), మేకల సాయిచరణ్ (13) నీటిలో మునిగి చనిపోయారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం సెలవురోజు కావడంతో న్యూపోరట్‌పల్లికి చెందిన నలుగురు స్నేహితులు సమీపంలోని మేడిపల్లి శివారులో పెద్దచెరువు వద్దకు ఈతకు వెళ్లారు. ఇందులో ఉమా మహేశ్, మామిడి విక్రం, మేకల సాయిచరణ్ చెరువులోకి దిగారు. వీరితోపాటు వచ్చిన ఇల్లుటం శశి చెరువు సమీపంలో ఉన్న తన తాత దగ్గరకు వెళ్లాడు. అతను తిరిగి వచ్చేసరికి వారి దుస్తులు చెరువు కట్టపై ఉండగా.. స్నేహితులు అప్పటికే నీటిలో మునిగిపోయారని గమనించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు ఆరెందుల చంద్రయ్య, కారెంగుల మల్లేశ్, కాళ్ల శ్రీనివాస్ వెంటనే చెరువులోకి దూకి పిల్లలను రక్షించే ప్రయత్నం చేశారు. ముగ్గురిని ఒడ్డుకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే పిల్లలు మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలకు గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఏసీపీ గిరి ప్రసాద్, ఎన్టీపీసీ సీఐ చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు మృతుల కుటుంబాలను ఓదార్చారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిని మింగిన కొత్త బావి

- పూజ కోసం వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిన తండ్రి
- కాపాడేందుకు బావిలో దూకిన కుమారుడు
- నీట మునిగి ఇద్దరూ మృతి
- ఆదిలాబాద్ జిల్లా పోచంపల్లిలో ఘటన



సోనేరావ్ మృతదేహం



సూర్యభాన్ మృతదేహం

సిరికొండ (బోథ్): వ్యవసాయం కోసం చేనులో తవ్వుకున్న బావి తమకే మృత్యుకుహరం అవుతుందని ఊహించలేదు ఆ కుటుంబం. కొత్తగా తవ్వుకున్న బావి పూజ కోసం వెళ్లి అందులో ప్రమాదవశాత్తుపడి తండ్రీ కొడుకులిద్దరూ మృత్యువాత పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని పోచంపల్లి గ్రామంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఇంటి పెద్దతో పాటు కుమారుడు సైతం దూరం కావడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాడావి సోనేరావ్ (46) తన చేనులో కొద్ది రోజుల క్రితం బావిని తవ్వించాడు. అందులో నీళ్లు పుష్కలంగా రావడంతో సంతోషపడ్డాడు. శుక్రవారం తన చిన్న కూతురు శైలజతో కలసి పూజ చేద్దామని బావి వద్దకు వెళ్లాడు. నీళ్లు తెచ్చేందుకు ఓ చెంబుతో బావిలోకి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడ్డాడు. ఇది గమనించిన కూతురు వెంటనే గ్రామంలోని ఇంటి వద్దకు వెళ్లి తన రెండో అన్న సూర్యభాన్ (20)కు ఈ విషయం చెప్పింది. వెంటనే అతడు అక్కడికి వచ్చి తండ్రిని కాపాడేందుకు బావిలోకి దూకాడు. నీళ్లు ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ మునిగిపోయారు. గ్రామస్తులు వచ్చి వారిని బయటకు తీసేసరికి అప్పటికే మృతి చెందారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. సోనేరావ్‌కు ముగ్గురు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వీరిలో ఒక కూతురుకే వివాహం అయింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు.

పోలీస్ కస్టడీకి పేపర్ లీక్ నిందితులు

చంచల్‌గూడ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీక్ కేసులో అరెస్ట్ అయిన నిందితులు లౌకిక్, సుస్మితలను కోర్టు ఆదేశాల మేరకు పోలీస్ కస్టడీలోకి తీసుకున్నారు. చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వీరిని శుక్రవారం సిట్ పోలీసులు చంచల్‌గూడ జైలు నుంచి పోలీసు కస్టడీకి తరలించారు.

రాష్ట్రంలో భారీగా కరోనా కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. జ్వరాలు, ఇన్‌ఫ్లుయెంజా కేసులు పెరగటం తదితర కారణాలతో కరోనా కూడా పెరుగుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. శుక్రవారం 5,368 మందికి పరీక్షలు నిర్వహించగా..వారిలో 43 మంది కరోనా బారిన పడ్డారు. ఒక్క హైదరాబాదులోనే 19 కేసులు నమోదు కావడంతో ఆందోళన కలిగిస్తుంది. ప్రస్తుతం 247 మంది లేదా ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు టీటీడీ పాలక మండలి సమావేశం

తిరుమల: టీటీడీ పాలక మండలి సమావేశం శనివారం జరగనుంది. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలో తిరుమలలోని అన్నమయ్య భవన్లో జరిగే ఈ సమావేశంలో పలు కీలకమైన అంశాలను బోర్డు సభ్యులు చర్చించనున్నారు. కాగా, తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. గురువారం అర్ధరాత్రి వరకు 67,687 మంది స్వామివారిని దర్శించుకున్నారు.

పడకేసిన సాగు యాంత్రీకరణ

- మూడేళ్లుగా నిలిచిన సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాల సరఫరా
- ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించినా మీనమేషాలు లెక్కిస్తున్న వ్యవసాయ శాఖ
- యంత్రాల ధరల నిర్ధారణ, మార్గదర్శకాలపై 'ఆగ్రోస్'కు ప్రతిపాదనలూ పంపని వైనం
- ఖరీదైన పనిముట్లను రైతులు బహిరంగ మార్కెట్‌లో కొనాల్సిన పరిస్థితి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ ప్రక్రియ మూడేళ్లుగా మూలనపడింది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లలో రూ. వందల కోట్లు కేటాయించినా ఆ మేరకు పరికరాలు కొనుగోలు చేసి రైతులకు అందించడంలో వ్యవసాయ శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. యంత్రాల ధరల నిర్ధారణకు ముందు వాటి మార్గదర్శకాలపై ప్రతిపాదనలను పంపాలని 'ఆగ్రోస్' విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు స్పందించలేదు. మరో రెండు నెలల తర్వాత వానాకాలం సీజన్ మొదలు కాబోతున్నా కనీసం దుక్కు యంత్రాలు, తైవాన్ స్ప్రేయర్ వంటివి కూడా రైతులకు సబ్సిడీపై ఇచ్చే పరిస్థితి లేకపోవడంపై రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2021-22 బడ్జెట్‌లో యంత్రాల సబ్సిడీకి రూ. 1,500 కోట్లు, 2022-23 బడ్జెట్‌లో రూ. 500 కోట్లు, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించినా వ్యవసాయ యంత్రాలు రైతులకు సరఫరా కావడం లేదు. వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం కారణంగా రైతులు ఖరీదైన పనిముట్లను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

2018 వరకు ట్రాక్టర్లు సరఫరా: తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టిసారించింది. అంతే కాదు.. వాటిపై రైతులకు పెద్ద ఎత్తున సబ్సిడీలు ప్రకటించింది. 2018 వరకు భారీగా ట్రాక్టర్లు సహా వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై ఇచ్చింది. వ్యవసాయ యంత్రాలు తీసుకొనే ఎస్సీ, ఎస్టీలకు ట్రాక్టర్లు సహా కొన్నింటిపై 95 శాతం, ఇతరులకు 50 శాతం సబ్సిడీతో సరఫరా చేసింది. ఒకేసారి గ్రూపునకు లేదా వ్యక్తిగతంగా కూడా వాటిని అందించింది. దాదాపు 8 వేల వరకు ట్రాక్టర్లను వ్యవసాయశాఖ రైతులకు సబ్సిడీపై అందజేసింది. సబ్సిడీ నేపథ్యంలో గ్రామాల్లో వ్యవసాయ యాంత్రీకరణ విప్లవం ఏర్పడింది. తెలంగాణ ఏర్పడక ముందు, ఆ తర్వాత రైతులకు యంత్రాల పంపిణీ చూస్తే దాదాపు రెండింతలైంది. దీంతో వ్యవసాయం ఆధునికత సంతరించుకుంది. ఒకవైపు సాగు నీటి ప్రాజెక్టులతో కొత్త ఆయకట్టు పెరగడం, మరోవైపు యాంత్రీకరణ జరగడంతో పంటల ఉత్పత్తి, ఉత్పాదకత కూడా గణనీయంగా పెరిగింది.

నిలిచిన ప్రక్రియ...

2018 తర్వాత యంత్రాల సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం ట్రాక్టర్ల బదులు వరి నాటు యంత్రాలతోపాటు కొన్ని చిన్నచిన్న పరికరాలను రైతులకు ఇవ్వాలని భావించిన వ్యవసాయ శాఖ ఆ ప్రక్రియ అమల్లో మాత్రం తీవ్ర జాప్యం చేస్తోంది. ఒక్కో వరి నాటు యంత్రం ధర కంపెనీలను బట్టి రూ. 7 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఉండగా దాదాపు 5 వేల యంత్రాలను సరఫరా చేయాల్సి రావొచ్చని ఆ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. కానీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంలో మాత్రం విఫలమైంది. రెండేళ్లకోసారి యంత్రాల ధరలను నిర్ణయించి ఖరారు చేయాల్సి ఉండగా వాటి నిర్ధారణ ప్రతిపాదనలు కూడా పంపలేదు.

కస్టమ్ హైరింగ్ సెంటర్లూ లేవు

ఓలా, ఉబర్ మాదిరి వ్యవసాయానికి సంబంధించి భారీ కోత, నాటు మెషీన్లు బుక్ చేసుకుంటే అద్దెకు పంపించేలా కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని గతంలో వ్య వసాయశాఖ చెప్పింది. అయితే ఇంతవరకు ఆ సెంటర్లు ఎలా ఉండాలి? ఎవరి ఆధ్వర్యంలో నడిపించాలనే దానిపై స్పష్టత లేదు.

రాయితో కొట్టి.. కత్తితో గొంతు కోసి..

- నడిరోడ్డుపై భార్యను హత్య చేసిన భర్త
- కుమార్తె కళ్లెదుటే దారుణం
- హైదరాబాద్ శివారులో ఘటన



అంబిక



ఒంటినిండా రక్తం మరకలతో నరేందర్‌గౌడ్

మియాపూర్: కలిసి చదువుకున్నారు..ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నారు.. కొన్నాళ్లకు భర్త తాగుడుకు బానిసై భార్యను వేధించసాగాడు.. వేగలేక వేరుగా ఉంటున్న భార్యపై అతడు కక్ష పెంచుకున్నాడు. నడిరోడ్డుపై బండరాయితో కొట్టి, కత్తితో గొంతులో పొడిచి హత్య చేశాడు. ఈ సంఘటన హైదరాబాద్ శివారులోని చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ క్యాస్ట్రో తెలిపిన ప్రకారం వివరాలు... వికారాబాద్ జిల్లా తాండూర్ సమీపంలో అల్లాపూర్ గ్రామానికి చెందిన నరేందర్ గౌడ్(27) తాండూర్ గాంధీనగర్‌కు చెందిన అంబిక (26) స్థానికంగా ఓ పాఠశాలలో కలిసి చదువుకున్నారు. అప్పటి నుంచి ఒకరికొకరు ఇష్టపడి ప్రే మించుకొని ఎనిమిదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. తాండూర్‌లో నివాసమున్నారు. వీరికి ఐదేళ్ల కూతురు ఉంది. నరేందర్‌గౌడ్ ఏ పని చేయకపోవడమే కాకుండా మద్యానికి బాని సయ్యాడు. కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో అంబిక, నరేందర్‌గౌడ్ మధ్య తర చూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో అంబిక ఐదేళ్ల నుంచి కూతురుతో కలిసి శేరిలింగంపల్లిలోని నల్లగండ్లలో వేరుగా ఉంటోంది. ఓ డెంటల్ క్లినిక్‌లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, ఓ బొటిక్‌లో 11.30 నుంచి రాత్రి 8 వరకు పనిచేస్తోంది.నరేందర్‌గౌడ్ మియాపూర్‌లోని ఓ వైన్స్ షాపులో పనిచేస్తున్నాడు.

ఫిర్యాదు చేసిందని కక్ష పెంచుకొని...: నరేందర్‌గౌడ్ తరచూ అంబికకు ఫోన్ చేసి తనతో కలిసి జీవించాలని వేధించేవాడు. దీంతో ఆమె వికారాబాద్‌లోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పటి నుంచి అంబికపై అతడు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో నరేందర్‌గౌడ్ శుక్రవారం ఉదయం లింగంపల్లికి వచ్చి కూతురుతో మాట్లాడించాలని అంబికతో ఫోన్‌లో గొడవకు దిగాడు. 11.30 గంటల సమయంలో బొటిక్ షాపునకు వచ్చి బండరాయితో ఆమెపై దాడి చేశాడు. ఆమె భయపడి పరుగులు తీయగా వెంబడించి పట్టుకొని వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి, పొడిచి హత్య చేశాడు. రక్తపు మడుగులో ఉన్న అంబిక అక్కడికక్కడే మృతి చెందింది. తల్లిని చంపుతుండగా కూతురు భయంతో అరవగా స్థానికులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. అతడు కొంతదూరం పారిపోగా వెంబడించి పట్టుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు చందానగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నరేందర్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా...

కేజ్రీవాల్‌కు సీబీఐ సమన్లు

లిక్కర్ స్కామ్‌లో ఆదివారం విచారణకు హాజరు కావాలని ఆదేశం



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించి ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు సీబీఐ శుక్రవారం సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ఆదివారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరవాలని ఆదేశించింది. సాక్షిగా ఆయన్ను ప్రశ్నించనున్నట్లు సీబీఐ అధికారులు తెలియజేశారు. ఈ కేసులో కేజ్రీవాల్ సాక్షేనా, నిందితుడా అనేది చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాతే నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను సీబీఐ ఇప్పటికే అరెస్టు చేయడం తెలిసిందే. ఆదివారం కేజ్రీవాల్ విచారణకు హాజరవుతారని ఆప్ వెల్లడించింది. ఆయనను కుట్రపూరితంగానే విచారణకు పిలుస్తున్నారని ఆరోపించింది. సిసోడియా సెల్‌ఫోన్లు ధ్వంసం చేశారంటూ కోర్టుకు ఈడీ అబద్ధాలు చెబుతోందని ఆప్ నేత సంజయ్ సింగ్ ఆరోపించారు. ఆయన ఏ ఫోన్‌ను ధ్వంసం చేయలేదన్నారు. ఈడీ పేర్కొంటున్న 14 ఫోన్లూ పనిచేస్తుండగా వాటిలో 5 ఫోన్లు ఈడీ, సీబీఐ స్వాధీనంలోనే ఉన్నాయని చెప్పారు. దర్యాప్తును ఈడీ అపహాస్యం చేస్తోందని విమర్శించారు. సిసోడియా ఫోన్లను ధ్వంసం చేశారని ఆరోపిస్తున్న బీజేపీ నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆయుధాలు అమ్మబోం: చైనా

బీజింగ్: ఏడాదికి పైగా యుద్ధంలో తలమునకలైన రష్యా, ఉక్రెయిన్లలో ఎవరికీ ఆయుధాలు విక్రయించబోమని చైనా ప్రకటించింది. చైనా మిత్ర దేశమైన రష్యా యుద్ధం కారణంగా సాయుధ సంపత్తిని భారీగా కోల్పోవడం తెలిసిందే. దాంతో రష్యాకు చైనా భారీగా ఆయుధాలు సరఫరా చేయవచ్చని పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. అలాంటి ఉద్దేశమేమీ తమకు లేదని చైనా విదేశాంగ మంత్రి క్విన్ కాంగ్ శుక్రవారం ప్రకటన చేశారు. పౌర, సైనిక వాడకం రెండింటికీ పనికొచ్చే వస్తువులను రష్యాకు ఎగుమతి చేయడంపైనా నియంత్రణ విధిస్తామన్నారు. యుద్ధంలో తమది తటస్థ పాత్ర అని ఆయన స్పష్టం చేశారు. కాకపోతే యుద్ధం మొదలైనప్పటి నుంచీ రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా రష్యాకు చైనా మద్దతుగానే నిలుస్తూ వస్తోంది. పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆంక్షల నేపథ్యంలో చైనా దన్ను రష్యాకు ఎంతగానో ఆసరా అయింది. అదే క్రమంలో రష్యాకు ఆయుధాలు కూడా సమకూర్చేందుకు చైనా సన్నద్ధమవుతున్నట్టు తమకు నిఘా సమాచారముందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఇటీవల పేర్కొనడం తెలిసిందే.



ఎస్.రాజమహేంద్రారెడ్డి

సచిన్ పైలట్‌కు హఠాత్తుగా కోపం వచ్చింది. నాలుగున్నరేళ్లుగా లోలోపల రగిలిపోతున్న అసంతృప్తిని ఒకే ఒక్క చర్యతో బలంగా బహిర్గతం చేశారు. ఎంత బలంగా అంటే, కాంగ్రెస్ అధిష్టానం కంగుతినేంతగా! రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్ ఉక్కిరిబిక్కిరయ్యేంతగా! మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజె అవినీతిపై విచారణకు ఆదేశించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారంటూ గహ్లోత్ తీరును బాహాటంగానే దుయ్యబట్టిన పైలట్ ఈ నెల 11న ఏకంగా ఒక రోజు నిరసన దీక్షకు కూడా కూర్చున్నారు! అధిష్టానం హెచ్చరించినా, బుజ్జగించినా ఆయన ససేమిరా అన్నారు. దీన్ని ఏమీ పట్టించుకోనట్టుగా గహ్లోత్ పైకి గాంభీర్యం ప్రదర్శించినా లోలోపల తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. స్వపక్షీయుడే అయిన మాజీ కేంద్ర మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం అయిన పైలట్ ప్రతిపక్షంలా తనపైనే దాడికి దిగడం గహ్లోత్‌కు అసలు మింగుడు పడలేదు. ఎవరేమనుకున్నా ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముఖ్యమంత్రి కావాలన్న తన లక్ష్యాన్ని పైలట్ కాస్త గట్టిగానే వినిపించారు. ఒకవిధంగా ఒకే దెబ్బకు రెండు పిట్టల్ని కొట్టారన్నమాట! సీఎం పదవిపై ఉన్న కాంక్షను వెలిబుచ్చడం ఒకటైతే, ప్రస్తుత ముఖ్యమంత్రి గహ్లోత్, మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజెల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాన్ని వేలెత్తిచూపడంరెండోది. అంతా బాగుందనుకున్న రాజస్తాన్ కాంగ్రెస్‌లో ఇది సరికొత్త ముసలం...!

సచిన్ పైలట్ కాగలడా!

ఎన్నికల వేళ 'సీఎం' ఆకాంక్షలకు పదును ● రాజస్తాన్ కాంగ్రెస్‌లో ముదురుతున్న ఇంటిపోరు

➤ గహ్లోత్-పైలట్ తలనొప్పిని ఎలా పరిష్కరించాలో తెలియక కాంగ్రెస్ అధిష్టానం తలపట్టుకు కూర్చుంది. ఇలాంటి అంతర్గత విభేదాలను పరిష్కరించడంలో ఆరితేరిన కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సైతం ఎవరినీ ఏమీ అనలేక, మధ్యేమార్గంగా 'మేజర్ సర్జరీ'తో వివాదం సద్దుమణిగేలా చేస్తామన్నారు. అయితే ఆ శస్త్రచికిత్స ఎప్పుడు, ఎలా అన్నది మాత్రం దాటవేశారు. బహుశా సోనియా, రాహుల్‌గాంధీల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్టుంది. పైలట్‌లో ఈ రీతిన అసంతృప్తి పేరుకుపోవడానికి అధిష్టానం వైఖరే కారణం. రాజస్తాన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా 2018లో పార్టీని విజయపథాన నడిపించిన పైలట్‌కు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టినట్టే పెట్టి, గహ్లోత్ చాణక్యానికి తలవంచడం అసంతృప్తిని రాజేసింది. బీజేపీ నుంచి అధికారాన్ని చేజిక్కించుకున్న ఆనందం ఆవిరవకుండా పైలట్‌ను బుజ్జగించి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి మమ అనిపించారు. సందర్భాన్ని బట్టి అప్పట్లో ఆ పదవితో పైలట్ సంతృప్తి పడినట్టు కనిపించినా రెండేళ్ల తిరిగేసరికి తనను తాను సర్దిబుచ్చుకోలేక రాజీనామా చేసి అసంతృప్తిని వెళ్లగక్కారు. తాజాగా దీక్షకు దిగి గహ్లోత్‌తోనూ, అధిష్టానంతోనూ అమీతుమీకే సిద్ధమయ్యానన్న సంకేతాలను పంపగలిగారు. క్రమశిక్షణ చర్యలు తప్పవని రాజస్తాన్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఎస్.ఎస్.రణ్‌ధవా నేరుగానే హెచ్చరించారు. అయితే పైలట్ మాత్రం ఇవన్నీ పట్టించుకునే స్థితిలో ఉన్నట్టు లేదు. ఈసారి సీఎం పదవి చేజారితే మరో ఐదున్నరేళ్లు ఎదురు చూడాల్సి వస్తుందని ఆయన భయం. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ గహ్లోత్‌నే సీఎంగా చూడటం పైలట్‌కు సుతరామూ ఇష్టం లేదు. మరోవైపు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగుతున్న రాజస్తాన్ పడవ వివాదాల సుడిగుండంలో చిక్కుకుని మునిగిపోవడం కాంగ్రెస్ అధిష్టానానికి రుచించడం లేదు. గహ్లోత్‌ను మళ్లీ సీఎం పదవి నుంచి తప్పించడానికి అధిష్టానం విముఖంగా ఉంది. ఎన్నికల ముందు సీఎంను మార్చి ఓటర్లను గందరగోళంలో పడేయడం తప్పుడు సంకేతాలను పంపినట్టవుతుందని భావిస్తోంది. గహ్లోత్‌పై పైలట్ చేసిన ఆరోపణలకు బలం చేకూర్చడం కూడా కాంగ్రెస్‌కు సుతరామూ ఇష్టం లేదు. పంజాబ్‌లో సిద్ధూ ఉదంతం అక్కడి ఎన్నికల్లో ఎలాంటి ఫలితాన్నిచ్చిందో కాంగ్రెస్‌కు అనుభవమే కాబట్టి మరోసారి అదే తప్పును పునరావృతం చేయడానికి సాహసించడం లేదు. అయితే ఈ సాకులన్నీ తనను మోసగించడానికేనని పైలట్ గట్టిగా నమ్ముతున్నారు. మరోవైపు కాంగ్రెస్ అంతర్గత పోరును తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ తన ప్రయత్నాలను ముమ్మరం చేయడం గమనార్హం. ఇప్పటికిప్పుడు బీజేపీ పరిస్థితి అమాంతం మెరుగయ్యేలా లేకపోయినా కులం కార్డు తమకు ఈసారి లాభిస్తుందని కమలనాథుల ఆశ. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సీపీ జోషి (బ్రాహ్మణ్), బీజేపీ పక్ష నాయకుడిగా రాథోడ్ (రాజ్‌పుత్), ఉప నాయకుడిగా సతీశ్ పునియా (జాట్)లను నియమించడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

పథకాలను నమ్ముకున్న గహ్లోత్



2018 నుంచి ఇప్పటిదాకా తను ప్రవేశపెట్టిన ప్రజాకర్షక పథకాలు 2023లో మరోసారి విజయం అందిస్తాయని గహ్లోత్ దృఢంగా నమ్ముతున్నారు. పార్టీలకు అతీతంగా ఇతర నాయకులతో తనకున్న సత్సంబంధాలు కూడా విజయావకాశాలను ప్రభావితం చేస్తాయని విశ్వసిస్తున్నారు. ఇటీవలే వందేభారత్ రైలు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఒక అడుగు ముందుకేసి గహ్లోత్ గుణగణాలను ప్రశంసించడం గమనార్హం. అయితే మరో ఆరేడు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలంటే గహ్లోత్-పైలట్ తమ విభేదాలను పక్కన పెట్టి సామరస్యంగా పనులు చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఇదే కోరుకుంటోంది. కానీ వారు బహిరంగంగానే సై అంటే సై అనుకోవడం కాంగ్రెస్‌పై ఓటర్లకున్న విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉంది. వివాదాలను తెగేదాకా లాగడం కాంగ్రెస్ అధిష్టానానికి అలవాటుగా మారింది. సెప్టెంబరులోనే అధికార మార్పిడికి ఒకసారి విఫలయత్నం చేసి చేతులెత్తేసిన గాంధీలు మరోసారి అలాంటి సాహసానికి దిగే ప్రయత్నం ఎట్టి పరిస్థితుల్లోనూ చేయరు. ఖర్గే కూడా గాంధీల మార్గంలోనే పయనిస్తున్నారు. ఉన్నపళంగా పైలట్‌ను సీఎం చేసే దుస్సాహసానికి ఒడిగట్టే స్థితిలో ఆయన కూడా లేరు. పైలట్ కూడా ఇప్పటికిప్పుడు సీఎం పీఠం అధిష్టించాలన్న ఆలోచనలో లేరు. తాను వచ్చే ప్రభుత్వానికి 'పైలట్' కావాలని మాత్రమే కోరుకుంటున్నారు. 2020లో తిరుగుబాటు చేసినప్పుడు తగినంత మంది ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకోవడంలో పైలట్ విఫలమై ఉన్న డిప్యూటీ సీఎం పదవి కూడా వదులుకున్నారాయన. ప్రస్తుతం ఆయన ముందున్న లక్ష్యం మరోసారి ఎన్నికల ముందు పార్టీ అధ్యక్షునిగా ఎంపికై తన మద్దతుదార్లకు ఎక్కువ టికెట్లు ఇప్పించుకోవడం ఒక్కటే! అదీ అధిష్టానం అనుకూలంగా ఉంటేనే సాధ్యమవుతుంది. కానీ తాజా దీక్షతో ఆ అవకాశం కూడా పైలట్ చేజారినట్టు కన్పిస్తోంది!

ఇక పైలట్‌కు మిగిలింది...

➤ చిన్న పార్టీలైన హనుమాన్ బెనీవాల్ పార్టీ, బీఎస్పీ, ఎన్సీపీలతో జతకట్టి స్వతంత్రంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడం.
➤ సొంతంగా ప్రాంతీయ పార్టీ స్థాపించి భావసారూప్యం గల వారిని చేర్చుకోవడం.
➤ పైలట్ గుజ్జర్ వర్గానికి చెందిన వారు కాబట్టి గుజ్జర్ల ఓట్లతో గెలవగలిగిన మొత్తం 30 అసెంబ్లీ సీట్లపైనా పూర్తిగా పట్టు బిగించడం.
➤ ఆమ్ ఆద్మీ పార్టీలో చేరి ఎన్నికల్లో పోటీ చేయడం. అయితే రాజకీయాల్లో తనకన్నా జూనియర్ అయిన కేజ్రీవాల్‌తో కూడటం ఆయనకు రుచించకపోవచ్చు.
➤ కాంగ్రెస్‌లోనే ఉంటూ పోరాటం కొనసాగిస్తూనే తన అదృష్టాన్ని పరీక్షించుకోవడం.

కొసమెరుపు..

రాజస్తాన్ ప్రభుత్వాన్ని పైలట్‌గా ముందుండి నడిపించాలన్న సచిన్ ఆశ నెరవేరుతుందో లేదో ఇప్పటికిప్పుడే చెప్పలేం. కానీ ఒకటి మాత్రం నిజం. కాంగ్రెస్ గనక ఈసారి ఆయన లేకుండా ఎన్నికల బరిలోకి దిగితే 2013లో వచ్చిన 21 సీట్లు కూడా రాకపోవచ్చనేది విశ్లేషకుల అంచనా. అంటే సచిన్ కాస్త కష్టపడితే రాష్ట్రానికి 'పైలట్' అవుతారనే కదా!!

పదేళ్లలో మరో మహమ్మారి!

కోవిడ్–19 తరహాలో దాడి చేసే అవకాశం



లండన్: కోవిడ్–19.. ప్రపంచవ్యాప్తంగా అల్లకల్లోలం సృష్టించిన మహమ్మారి. లక్షలాది మందిని పొట్టనపెట్టుకుంది. నియంత్రణ చర్యలతోపాటు ఔషధాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ చాలా దేశాల్లో వైరస్ వ్యాప్తి కొనసాగుతూనే ఉంది. మరో పదేళ్లలో కోవిడ్–19 లాంటి భీకరమైన మహమ్మారి పంజా విసిరే అవకాశాలు ఉన్నాయని లండన్‌లోని ప్రెడిక్టివ్ హెల్త్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ సంస్థ 'ఎయిర్‌ఫినిటీ' వెల్లడించింది. వచ్చే పదేళ్లలో కొత్త మహమ్మారి తలెత్తడానికి 27.5 శాతం అవకాశాలు ఉన్నట్లు స్పష్టంచేసింది. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న వైరస్‌లతోపాటు వాతావరణ మార్పులు, జంతువుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందే వ్యాధుల ఆధారంగా ఈ సంస్థ అంచనాలు వెలువరిస్తూ ఉంటుంది. తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది. మనుషుల నుంచి మనుషులకు వ్యాపించే కొత్త వైరస్ యూకేలో ఒక్కరోజులో 15,000 మందిని అంతం చేయగలదని తెలియజేసింది. ఏవియన్ ఫ్లూ తరహాలోనే ఇది మార్పులు చెందుతూ ఉంటుందని పేర్కొంది. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకోవడం, నియంత్రణ చర్యలను వేగవంతం చేయడం, 100 రోజుల్లో వ్యాక్సిన్లు అభివృద్ధి చేసుకోవడం ద్వారా కొత్త వైరస్ ముప్పు 27.5 శాతం నుంచి క్రమంగా 8.1 శాతానికి తగ్గిపోతుందని అభిప్రాయపడింది. ప్రపంచవ్యాప్తంగా మహమ్మారులను ఎదుర్కొనేందుకు అవసరమైన సన్నద్ధత అధ్వాన్నంగా ఉందని, ఈ పరిస్థితి చాలా మెరుగుపడాలని ఎయిర్‌ఫినిటీ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు రాస్మస్ బెచ్ హన్‌సెన్ స్పష్టం చేశారు.

కేఐఐటీ డీయూలో వై20 కన్సల్టేషన్స్

భువనేశ్వర్: జీ20 సదస్సులో భాగంగా ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ(కేఐఐటీ డీయూ)లో 'వై20 కన్సల్టేషన్స్' శుక్రవారం ప్రారంభమైంది. ఒడిశా రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని 21వ శతాబ్దంలో మన దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సౌభాగ్యాలను నెలకొల్పడంలో యువత పాత్ర అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. వై20 కన్సల్టేషన్స్‌కు కేఐఐటీ వ్యవస్థాపకులు డాక్టర్ అచ్యుత సమంత అధ్యక్షత వహించారు.

విపక్ష కూటమి తథ్యం: అఖిలేశ్



ఇండోర్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని సమైక్యంగా ఎదుర్కొనేందుకు విపక్షాలమి సాకారమవుతుందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆశాభావం వెలిబుచ్చారు. ఇప్పటికే కేసీఆర్, మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్ వంటి ముఖ్యమంత్రులు ఇందుకు ప్రయత్నాలు చేస్తున్నారని గుర్తు చేశారు. ''విపక్షాలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో వాటికి దన్నుగా నిలిచేందుకు కాంగ్రెస్ ముందుకు రావాలని శుక్రవారం పిలుపునిచ్చారు. తద్వారా విపక్ష కూటమి బలోపేతానికి ఊతమిచ్చినట్టు అవుతుందన్నారు. తప్పుడు ఎన్‌కౌంటర్లపై కోర్టులు తమంత తాము విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తమవారిని బూటకపు ఎన్‌కౌంటర్లలో హత మార్చారని భావిస్తున్న వాళ్లు ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

కర్ణాటక బీజేపీకి మరో నేత గుడ్ బై



బెంగళూరు: కర్ణాటక బీజేపీలో టికెట్ల లొల్లి కొనసాగుతోంది. రానున్న ఎన్నికల్లో అధిష్టానం టికెట్ నిరాకరించిందనే ఆగ్రహంతో మాజీ డిప్యూటీ సీఎం లక్ష్మణ్ సావది కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ చీఫ్ డీకే శివకుమార్, ముఖ్యనేత సిద్ధరామయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి రణదీప్ సూర్జేవాలా సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ పరిణామంపై సీఎం బసవరాజ్ బొమ్మై విచారం వ్యక్తం చేశారు. లింగాయత్ వర్గానికి చెందిన సావది బెళగావి జిల్లా అథనీ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. ఈసారి సిట్టింగ్ ఎమ్మెల్యే మహేశ్ కుమతల్లికి టికెట్ ఇవ్వడం సావది అసంతృప్తికి కారణమైంది. తాజాగా, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అథనీ టికెట్‌పై ఆయనకు హామీ ఇచ్చినట్లు సమాచారం.

50 మందితో జేడీ(ఎస్) రెండో జాబితా

దేవెగౌడ కోడలు భవానీ రేవణ్ణకు మొండిచెయ్యి

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రతిపక్ష జేడీ(ఎస్) 50 మంది అభ్యర్థులతో శుక్రవారం రెండో జాబితాను విడుదల చేసింది. కీలకమైన హసన్ స్థానంలో హెచ్.పి.స్వరూప్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. ఈ స్థానం నుంచి టికెట్ ఆశించిన జేడీ(ఎస్) అగ్రనేత, మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవెగౌడ కోడలు భవానీ రేవణ్ణకు నిరాశే ఎదురయ్యింది. ఆమెకు తన భర్త రేవణ్ణ, కుమారులు ప్రజ్వల్ రేవణ్ణ, సూరజ్ రేవణ్ణ మద్దతుగా నిలిచినప్పటికీ జాబితాలో పేరు లేకపోవడం గమనార్హం. దేవెగౌడ పెద్ద కుమారుడు రేవణ్ణ భార్య అయిన భవానీ గతంలో హసన్ జిల్లా పంచాయతీ సభ్యురాలిగా పనిచేశారు. రేవణ్ణ, భవానీ అంగీకారంతో, దేవెగౌడ ఆశీస్సులతో హసన్ స్థానం నుంచి స్వరూప్‌ను పోటీకి దింపబోతున్నట్లు జేడీ(ఎస్) నేత హెచ్.డి.కుమారస్వామి ప్రకటించారు. తన సోదరుడు కుమారస్వామి ముఖ్యమంత్రి కావాలని తాను కోరుకుంటున్నానని రేవణ్ణ చెప్పారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. దేవెగౌడ సొంత జిల్లా అయిన హసన్‌లో ఆయన కుటుంబానికి మంచి ఆదరణ ఉంది. దివంగత ఎమ్మెల్యే హెచ్.ఎస్.ప్రకాశ్ తనయుడైన హెచ్.పి.స్వరూప్ గతంలో హసన్‌జిల్లా పంచాయతీ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

అంబేడ్కర్‌కు రాష్ట్రపతి, ప్రధాని నివాళులు

న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత, సామాజిక సంస్కర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో నిరుపేద, అణగారిన వర్గాల అభ్యున్నతికోసం అంబేడ్కర్ తన జీవితాన్ని అంకితం చేశారని మోదీ కొనియాడారు. పార్లమెంట్ ప్రాంగణంలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నేలంతా ఘనంగా నివాళులర్పించారు.



అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో సోనియా, ఖర్గే, ధన్‌ఖడ్, ముర్ము, నడ్డా, మోదీ తదితరులు

వ్యవస్థలపై వికృత దాడి: సోనియా

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని జాతి వ్యతిరేకిగా మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అభివర్ణించారు. తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడటమే గాక రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ తన తాబేదార్లుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం ఓ పత్రికకు ఆమె వ్యాసం రాశారు. రాజ్యాంగ విజయం పాలకుల ప్రవర్తనపైనే ఆధారపడుతుందని అంబేడ్కర్ పదేపదే హెచ్చరించేవారని గుర్తు చేశారు. మోదీ సర్కారు దెబ్బకు దేశంలో స్వేచ్ఛ పూర్తిగా ప్రమాదంలో పడిందని ఆరోపించారు. ''చట్టాలను ప్రజల హక్కుల పరిరక్షణకు బదులుగా వారిని వేధించేందుకు ఉపయోగిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే విద్వేష వాతావరణం సృష్టించి సమాజంలో సౌభ్రాతృత్వాన్ని మంటగలుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలే నడుం బిగించాలి'' అని పిలుపునిచ్చారు.

ప్రమాదకర ధోరణి: ఖర్గే

ప్రత్యర్థులపై జాతి వ్యతిరేక ముద్ర వేయడం, బలవంతంగా నోరు మూయించడం వంటి ప్రమాదకర ధోరణులు పాలకుల్లో నానాటికీ పెరిగిపోతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆందోళన వెలిబుచ్చారు. ఇది అంతిమంగా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నాశనం చేస్తుందన్నారు. పార్లమెంటు చర్చా వేదికను కూడా అధికార బీజేపీ పోరాటస్థలిగా మార్చిందని దుయ్యబట్టారు. ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఖర్గే, కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వద్రా తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. రాజ్యాంగ విలువలపై వ్యవస్థీకృత దాడి జరుగుతోందంటూ ప్రియాంక ట్వీట్ చేశారు.

ఘన ఇంధన బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించాం

ఉత్తరకొరియా ప్రకటన



సియోల్: మొట్టమొదటిసారిగా ఘన ఇంధనాన్ని వినియోగించి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించినట్లు ఉత్తరకొరియా శుక్రవారం ప్రకటించింది. వేగంగా ప్రయాణించే కొత్త రకం క్షిపణిని ఆ దేశం గురువారం ప్రయోగించినట్లు దక్షిణకొరియా, జపాన్ పేర్కొనడం తెలిసిందే. రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపంలోని అటవీ ప్రాంతంలోని వేదికపై నుంచి చేపట్టిన ఈ ప్రయోగాన్ని అధ్యక్షుడు కిమ్, ఆయన భార్య, కుమార్తె, సోదరి తిలకించినట్లు అధికార వార్తా సంస్థ కేసీఎన్ఏ తెలిపింది. ఈ క్షిపణి మూడు దశలుగా ప్రయాణించి, లక్ష్యాన్ని ఛేదించినట్లు వివరించింది. ఇప్పటి వరకు ద్రవ ఇంధనంతో పనిచేసే క్షిపణులను పరీక్షించిన ఉత్తరకొరియా తాజాగా ఘన ఇంధనం వాడినట్లు ప్రకటించడం ముందడుగేనని నిపుణులంటున్నారు. అమెరికాను నేరుగా భయపెట్టే అణ్వాయుధాలను సమకూర్చుకోవాలనే లక్ష్యంలో ఇది పురోగతిగా అభివర్ణిస్తున్నారు. అయితే ఈ తాజా క్షిపణి సామర్థ్యంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అది ప్రయాణించిన దూరం, ఎత్తు, తిరిగి భూ వాతావరణంలోకి ప్రవేశించి లక్ష్యాన్ని ఎలా ఛేదించింది, వార్ హెడ్ అమరిక వంటి వివరాలను వెల్లడించకపోవడాన్ని ప్రస్తావిస్తున్నారు.

అధికార నివాసం ఖాళీ చేస్తున్న రాహుల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత, వయనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ ఢిల్లీలోని అధికార నివాసాన్ని ఖాళీ చేస్తున్నారు. తుగ్లక్ లేన్‌లోని 12వ నంబర్ బంగ్లాలోని సామగ్రిని తన తల్లి సోనియా గాంధీ నివాసానికి తరలిస్తున్నారు. శుక్రవారం రాహుల్ నివాసం వెలుపల రెండు ట్రక్కులు కనిపించినట్లు పీటీఐ తెలిపింది. ఈ నెల 22లోగా నివాసాన్ని ఖాళీ చేయాలంటూ లోక్‌సభ సెక్రటేరియట్ నోటీసులివ్వడం తెలిసిందే. సోనియా నివాసం 10, జనపథ్‌లోనే ఉండేందుకు రాహుల్ నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సామగ్రి తరలింపు మొదలైనట్లు సమాచారం.

యథాతథంగానే విశాఖ ఉక్కు డిజిన్వెస్ట్‌మెంట్

కేంద్ర ఉక్కు శాఖ స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ ఉక్కు (ఆర్ఐఎన్ఎల్)లో పెట్టుబడుల ఉపసంహరణ యథాతథంగా కొనసాగుతుందని కేంద్ర ఉక్కు శాఖ స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ పురోగతిలోనే ఉందని తెలిపింది. పనితీరును మెరుగుపర్చుకునేందుకు కంపెనీ ప్రయత్నాలు చేస్తోందని శుక్రవారం ఒక ప్రకటనలో వివరించింది. వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణ ప్రక్రియను ప్రభుత్వం ప్రస్తుతానికి నిలిపివేస్తోందంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో కేంద్ర ఉక్కు శాఖ ఈ మేరకు వివరణ ఇచ్చింది. వైజాగ్ స్టీల్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 7 మిలియన్ టన్నులు. కంపెనీలో ప్రభుత్వానికి ఉన్న 100 శాతం వాటాలను విక్రయించే ప్రతిపాదనకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) 2021 జనవరి 27న ఆమోదముద్ర వేసింది.

ఈశాన్యంలో వైద్య సదుపాయాలు బలోపేతం

- ఎయిమ్స్–గువాహటి జాతికి అంకితం
- బిహూ నృత్యోత్సవంలో పాల్గొన్న ప్రధాని

గువాహటి: ఈశాన్య రాష్ట్రాల్లో నూతన ఆసుపత్రులు, వైద్య కళాశాలల రాకతో వైద్య రంగంలో మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కాబోతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఈశాన్య భారతంలో సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం తొమ్మిదేళ్లుగా శ్రమిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు ఈశాన్య ప్రాంతాన్ని ఆమడ దూరంలో ఉంచాయని, తమ ప్రభుత్వం దగ్గరికి చేర్చుకుంటోందని వివరించారు. ఈశాన్య భారతదేశంలో నిర్మించిన తొలి అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను మోదీ శుక్రవారం జాతికి అంకితం చేశారు. అస్సాం రాజధాని గువాహటిలో రూ.1,123 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించారు. అలాగే నల్బారీ, నాంగావ్, కోక్రాజార్‌లో మెడికల్ కాలేజీలను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.546 కోట్లతో నిర్మించే అస్సాం అడ్వాన్స్‌డ్ హెల్త్ కేర్ ఇన్నోవేషన్ ఇనిస్టిట్యూట్ (ఏఏహెచ్ఐఐ)కు పునాది రాయి వేశారు. దీన్ని అస్సాం ప్రభుత్వం, ఐఐటీ–గువాహటి సంయుక్తంగా నిర్మించనున్నాయి. 1.1 కోట్ల ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. విపక్షాలు దేశాన్ని అప్రతిష్టపాలు చేయడమే పనిగా పెట్టుకున్నాయని మండిపడ్డారు.



శుక్రవారం గువాహటిలో ప్రధాని మోదీ రోడ్ షో

రైల్వే ప్రాజెక్టులు ప్రారంభించిన మోదీ

గువాహటిలోని ఇందిరాగాంధీ అథ్లెటిక్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో రూ.7,300 కోట్లతో కూడిన ఐదు రైల్వే ప్రాజెక్టులను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. బ్రహ్మపుత్ర నదిపై రూ.3,200 కోట్లతో పలాస్‌బారీ–సువాల్‌కుచీ బ్రిడ్జి నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేశారు. దిబ్రూగఢ్‌లో రూ.1,709 కోట్లతో నిర్మించిన మిథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అస్సాంలో సంప్రదాయ బిహూ నృత్యోత్సవంలో మోదీ పాల్గొన్నారు. 11,000 మందికిపైగా నృత్యకారులు, కళాకారులు అలరించారు. ఇక్కడ గురువారం నిర్వహించిన బిహూ నృత్యం రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సృష్టించడం తెలిసిందే.

సాంకేతికతతో సత్వర న్యాయం

గౌహతి హైకోర్టు వార్షికోత్సవంలో మోదీ

న్యాయసేవలు అందించే వ్యవస్థను మరింత వేగవంతం చేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. టెక్నాలజీతో సత్వర న్యాయం అందించవచ్చని, దీనివల్ల ఈశాన్య రాష్ట్రాల వంటి మూరుమూల ప్రాంతాల ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. శుక్రవారం అస్సాంలో గౌహతి హైకోర్టు 70వ వార్షికోత్సవ ముగింపు సభలో మోదీ ప్రసంగించారు. నూతన టెక్నాలజీతో ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. లక్షలాది మంది పౌరులకు ప్రాపర్టీ కార్డులు జారీ చేశామని ప్రధాని మోదీ వివరించారు. దానివల్ల ఆస్తుల సంబంధిత కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు.

జూలై ఒకటి నుంచి అమర్‌నాథ్ యాత్ర

జమ్మూ: హిమాలయాల్లో కొలువైన అమర్‌నాథ్ ఆలయ వార్షిక యాత్ర జూలై ఒకటో తేదీ నుంచి మొదలుకానుంది. ఆగస్ట్ 31 దాకా కొనసాగనుంది. ఈ నెల 17వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుంది. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అధ్యక్షతన ఆలయ బోర్డు భేటీలో ఈ మేరకు నిర్ణయించినట్టు అధికారులు చెప్పారు. యాత్రకు వివరాల కోసం గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

తీహార్ జైలులో గ్యాంగ్‌వార్

లారెన్స్ బిష్ణోయి అనుచరుడు మృతి

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని తీహార్ జైలులో శుక్రవారం ఖైదీల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయి ముఠా సభ్యుడు ప్రిన్స్ తేవాతియా మృతిచెందాడు. సాయంత్రం 5 గంటలకు జైలులో ఇరు వర్గాల మధ్య గ్యాంగ్‌వార్ జరిగినట్లు తెలిసింది. తేవాతియా కత్తిపోట్లకు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని దీన్‌దయాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఘర్షణలో గాయపడిన మరో ఐదుగురు ఖైదీలను అధికారులు ఆసుపత్రికి తరలించారు.



బైసాఖి పర్వదినం సందర్భంగా ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ వద్ద గంగానదిలో భక్తుల పుణ్యస్నానాలు

ఇబ్రహీంపట్నం రూపురేఖలు

మారిపోయాయి!



తూర్పు హైదరాబాద్‌లో శర వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాసిత ప్రాంతం ఇబ్రహీంపట్నం. ఐటీ, ఏరోస్పేస్ హబ్‌గా పేరొందిన ఆదిభట్ల, ప్రభుత్వ కార్యాలయాలకు కేంద్రమైన కొంగరకలాన్ ప్రాంతాలకు కూతవేటు దూరంలో ఉండటంతో ఇబ్రహీంపట్నానికి డిమాండ్ పెరిగింది. అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలే కాకుండా వాణిజ్య సముదాయాలు, మల్టీప్లెక్స్‌ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రోడ్లు, విద్యుత్ వంటి మెరుగైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, అందుబాటు ధరలు ఇబ్రహీంపట్నం అభివృద్ధి చోదకాలు.

సాక్షి, హైదరాబాద్: స్థిరాస్తి రంగంలో పెట్టుబడుల స్వరూపం మారిపోయింది. సొంతంగా ఉండేందుకు విస్తీర్ణమైన ఇళ్లు కొనుగోలు చేశాక.. రెండో పెట్టుబడి వాణిజ్య సముదాయంలోనే చేయాలనే భావన కొనుగోలుదారులలో పెరిగిపోయింది. దీంతో ఇన్నాళ్లు ప్రధాన నగరంలోనే కేంద్రీకృతమైన గ్రేడ్-ఏ కమర్షియల్ ప్రాపర్టీలు... క్రమంగా ద్వితీయ శ్రేణి పట్టణాలకూ విస్తరించాయి. ప్రధానంగా హైదరాబాద్‌కు అనుసంధానమై ఉన్న ఇబ్రహీంపట్నంలో షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్‌లకు డిమాండ్ ఏర్పడిందని టీఎస్ఆర్ గ్రూప్ ఎండీ టీ నర్సింహా రావు తెలిపారు.

- ఇప్పటివరకు షాపింగ్ మాల్స్‌లలో రిటైల్ స్థలం కొనాలంటే పెద్ద ప్రహసనమే. ధర, డిమాండ్, అగ్రిమెంట్, నిర్మాణం వంటి చాలా అంశాలలో పరిజ్ఞానం ఉండాలి. దీంతో విద్యావంతులైన పెట్టుబడిదారులే ఈ తరహా ప్రాపర్టీలను ఎంచుకునేవారు. సామాన్య, మధ్యతరగతి కూడా గ్రేడ్-ఏ కమర్షియల్ ప్రాపర్టీలలో పెట్టుబడులు పెట్టే విధంగా అత్యంత సులువు చేస్తున్నాయి పలు నిర్మాణ సంస్థలు. నిర్మాణ రంగంలో అనుభవం, నమ్మకమైన నిర్మాణ సంస్థ చేపట్టే వాణిజ్య సముదాయాలైతే ధైర్యంగా నిర్ణయం తీసుకోవచ్చు.
- ఓటీటీ, యాప్‌లు వచ్చాక ప్రధాన నగరంలో థియేటర్‌కు వెళ్లి సినిమా చూసే వాళ్ల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. అయితే ఈ సంస్కృతి ద్వితీయ శ్రేణి పట్టణాలలో ఇంకా రాలేదు. ఇలాంటి తరుణంలో ఇబ్రహీంపట్నంలో మల్టీప్లెక్స్ కం షాపింగ్ మాల్స్‌కు నిర్మించాలని నిర్ణయించామని టీఎస్ఆర్ గ్రూప్ డైరెక్టర్ టీ విక్రమ్ కుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నం, కర్మన్‌ఘాట్‌లలో 8 లక్షల చ.అ.లలో రెండు షాపింగ్ మాల్స్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. ఇబ్రహీంపట్నంలో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో టీఎస్ఆర్ జగదాంబ, కర్మన్‌ఘాట్‌లో మూడున్నర ఎకరాలలో టీఎస్ఆర్ ప్రిస్టన్ మాల్‌ను నిర్మిస్తున్నాం. జగదాంబలో ఏడు స్క్రీన్లు, ప్రిస్టన్‌లో 11 స్క్రీన్ల మల్టీప్లెక్స్‌లు ఉంటాయి. దీంతో పాటు ఫుడ్ కోర్టులు, గేమింగ్ జోన్‌లు, ప్రముఖ బ్రాండ్లకు చెందిన రిటైల్ దుకాణాలుంటాయి. జగదాంబ షాపింగ్ మాల్‌లో రెంటల్ ఇన్‌కం స్కీమ్‌ను ప్రారంభించాం. 100 చ.అ. రిటైల్ స్పేస్‌ను రూ.12 లక్షలకు అందిస్తున్నాం. దీంతో కొనుగోలుదారులకు నెలకు రూ.6 వేలు అద్దె కంపెనీ చెల్లిస్తుంది. ఇరవై ఏళ్ల గ్యారంటీ లీజు ఉంటుంది.
- విద్యా సంస్థలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు, బ్యాంకులు, వంటి అన్ని రకాల వ్యాపార సముదాయాలు ఇబ్రహీంపట్నంలో ఉన్నాయి. ఇక్కడ అపార్ట్‌మెంట్ల ధరలు రూ.40 లక్షల నుంచి ఉన్నాయి. ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఇబ్రహీంపట్నం మీదుగా భువనగిరి, చౌటుప్పల్ ప్రాంతాలను అనుసంధానిస్తుంది. కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ కంపెనీకి ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే ప్రభుత్వంతో తుది దశ చర్చలు ముగిశాయి కూడా. కొంగరకాన్ - రావిర్యాలలో ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది.

ఏ దిక్కులో ఎంత వృద్ధి?

సాక్షి, హైదరాబాద్: గృహ కొనుగోలు నిర్ణయంలో ధర, ప్రాంతం, వసతులతో పాటు వాస్తు కూడా ప్రధానమైనదే. భారతీయ గృహ కొనుగోలుదారులైతే వాస్తు తర్వాతే మిగతా అంశాలను ఎంపిక చేస్తుంటారు. అయితే హైదరాబాద్‌లోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ జోన్‌లలో ఏ దిక్కున ఎంత అభివృద్ధి చెందుతుంది? ఏడాది కాలంలో నగరంలో గృహ కొనుగోళ్ల విలువ, ధరల వృద్ధి తదితర అంశాలపై నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదికను వెలువరించింది.

- గత నెలలో హైదరాబాద్‌లో రూ.3,352 కోట్ల విలువ చేసే ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్ జరిగాయి. అంతకుముందు నెలతో పోలిస్తే మార్చిలో నగరంలో 12 శాతం వృద్ధి రేటుతో 6,414 అపార్ట్‌మెంట్లు రిజిస్ట్రేషన్స్ అయ్యాయి.
- ఇందులో 53 శాతం ప్రాపర్టీలు రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య ధర ఉన్న గృహాలే రిజిస్ట్రేషన్స్ కాగా.. 70 శాతం 1,000 నుంచి 2,000 చ.అ. ప్రాపర్టీలే ఉండటం గమనార్హం.



సెంట్రల్..
- సరఫరా అయిన గృహాల విలువ: 2,200 కోట్లు
- ఏడాది నగటున విక్రయమయ్యే ఇళ్ల విలువ: 180 కోట్లు
- ప్రాపర్టీ ధరల వృద్ధి: 20%
- మైక్రో మార్కెట్లు: అమీర్‌పేట, ఖైరతాబాద్, సోమాజిగూడ, హిమాయత్‌నగర్, మెహిదీపట్నం

పశ్చిమం..
- సరఫరా అయిన గృహాల విలువ: 85 వేల కోట్లు
- ఏడాది నగటున విక్రయమయ్యే ఇళ్ల విలువ: 7,700 కోట్లు
- ప్రాపర్టీ ధరల వృద్ధి: 19 %
- టాప్-5 మైక్రో మార్కెట్లు: తెల్లాపూర్, కొండాపూర్, మణికొండ, గచ్చిబౌలి, నార్సింగి

దక్షిణం..
- సరఫరా అయిన గృహాల విలువ: 3,400 కోట్లు
- ఏడాది నగటున విక్రయమయ్యే ఇళ్ల విలువ: 310 కోట్లు
- ప్రాపర్టీ ధరల వృద్ధి: 20 శాతం
- టాప్-5 మైక్రో మార్కెట్లు: రాజేంద్రనగర్, మహేశ్వరం, శంషాబాద్, ఆదిభట్ల, షాద్‌నగర్

ఉత్తరం..
- సరఫరా అయిన గృహాల విలువ: 26 వేల కోట్లు
- ఏడాది నగటున విక్రయమయ్యే ఇళ్ల విలువ: 1,900 కోట్లు
- ప్రాపర్టీ ధరల వృద్ధి: 22 శాతం
- టాప్-5 మైక్రో మార్కెట్లు: కొంపల్లి, సైనిక్‌పురి, బోచారం, బాచుపల్లి, మియాపూర్

తూర్పు..
- సరఫరా అయిన గృహాల విలువ: 3,200 కోట్లు
- ఏడాది నగటున విక్రయమయ్యే ఇళ్ల విలువ: 230 కోట్లు
- ప్రాపర్టీ ధరల వృద్ధి: 20 శాతం
- టాప్-5 మైక్రో మార్కెట్లు: ఉప్పల్, ఘట్‌కేసర్, హబ్సిగూడ, నాగోల్, ఎల్బీనగర్

కోకాపేటలో ఏలీసియా



సాక్షి, హైదరాబాద్: హైరైజ్ డెవలపర్స్ కోకాపేటలో ఏలీసియా ప్రీమియం ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. 4 ఎకరాలలో జీ+9 అంతస్తులలో మూడు టవర్లలో కలిపి 371 యూనిట్లుంటాయి. 1,265 చ.అ. నుంచి 3,380 చ.అ. మధ్య రెండు, మూడు పడక గదుల నిర్మాణాలుంటాయి. రెండు క్లబ్ హౌస్‌లు, 3 స్విమ్మింగ్ పూల్స్, ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ వంటి అన్ని రకాల ఆధునిక వసతులు ఉంటాయని కంపెనీ తెలిపింది. ఇటీవల ప్రాజెక్ట్‌ను బ్రోచర్ లాంచింగ్ కార్యక్రమం నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. ఇది ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసి) ప్రీ సర్టిఫైడ్ గోల్డ్ రేటెడ్ ప్రాజెక్ట్. జాగింగ్, సైక్లింగ్ ట్రాక్, టెన్నిస్ కోర్ట్, బాస్కెట్ బాల్ కోర్ట్, క్రికెట్ పిచ్, మల్టీ పర్పస్ లాన్, బాంక్వెట్ హాల్, బార్బెక్యూ డెక్స్ వంటి నేటి జీవనశైలికి అవసరమైన అన్ని రకాల హంగులను ప్రాజెక్ట్‌లో ఏర్పాటు చేస్తున్నామని హైరైజ్ డెవలపర్స్ సీఈవో ఎస్.శైలేందర్ రెడ్డి తెలిపారు.





నేడు, రేపు కొన్నిచోట్ల వడగండ్ల వానలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు డిగ్రీల మేర అధికంగా నమోదవుతున్నాయి. శని, ఆదివారాల్లో పలుచోట్ల 41 డిగ్రీ సెల్సీయస్ నుంచి 43 డిగ్రీ సెల్సీయస్ మధ్యన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. శుక్రవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 42 డిగ్రీ సెల్సీయస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 20.3 డిగ్రీ సెల్సీయస్‌గా నమోదైంది. వాతావరణంలో నెలకొంటున్న మార్పులతో కొన్నిచోట్ల వడగండ్ల వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడా వడగండ్ల వర్షాలు కురుస్తాయని సూచించింది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.6	27.3
ఏలూరు	43.0	27.0
రాజమహేంద్రవరం	43.0	26.0
విజయవాడ	42.0	27.0
ఆదిలాబాద్	42.0	24.7
భద్రాచలం	41.0	27.5
నల్లగొండ	41.0	23.0
ఖమ్మం	40.2	25.4
మహబూబ్‌నగర్	40.0	28.8
నిజామాబాద్	40.0	27.4
మెదక్	39.7	23.8
రామగుండం	39.6	25.5
హనుమకొండ	38.5	25.5
హైదరాబాద్	36.5	20.3
దుండిగల్	36.3	23.0
హకీంపేట్	36.0	23.6

క్లుప్తంగా...

త్వరలో ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ



అంబేడ్కర్ జయంతి ఉత్సవంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు త్వరలో పీఆర్సీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ఆర్టీసీ కళ్యాణ మండపంలో శుక్రవారం భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ...ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఈ విషయంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కూడా సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రత విషయంలో సంస్థ అన్ని రకాల చర్యలు చేపడుతుందన్నారు. రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్లు అమలు కాకుండా కొంతమంది కుట్ర చేస్తున్నారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ జాయింట్ డైరెక్టర్ సంగ్రామ్‌సింగ్ పాటిల్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ జి.రవీందర్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.కృష్ణ, గడ్డం శ్రీనివాస్, ఈడీ మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య కిట్ బకాయిలు ఎందుకు చెల్లించలేదు?'


సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణకు సంబంధించి దాఖలైన కేసులో పాఠశాల విద్యాశాఖ అధికారులకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. బకాయి పడిన నిధులు ఎందుకు చెల్లించలేదో వివరణ ఇవ్వాలని, నిధులు చెల్లింపునకు కేసు విచారణ అడ్డంకికాదని స్పష్టం చేసింది. ప్రభుత్వహాస్టళ్లకు ఆరోగ్యకిట్లు పంపిణీ చేసినా తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో మాయార్స్ అండ్ ఫైబర్స్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి 9% వడ్డీతో బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేశారు. ఈ తీర్పును ప్రభుత్వం డివిజన్ బెంచ్ వద్ద సవాల్ చేసింది. విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం ఆ వడ్డీని 6 శాతానికి తగ్గిస్తూ ఆదేశాలు జారీచేసింది. మూడు వారాల్లో చెల్లించాలని ఆదేశిస్తూ గత ఫిబ్రవరిలో తీర్పునిచ్చింది. అయితే 2 నెలలు కావొస్తున్నా బకాయిలు చెల్లించకపోవడంతో సదరు సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. విచారణను జూన్ 9కి వాయిదా వేసింది.

నేడు భూ నిర్వాసితుల సదస్సు

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితుల సమస్యలపైన సదస్సు నిర్వహించనున్నట్లు మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, ఉమ్మడి రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్.జీవన్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో జరిగే ఈ సదస్సులో బాధిత రైతు కుటుంబాలు పాల్గొంటాయని పేర్కొన్నారు.

దడపుట్టిస్తున్న 'అనానిమస్ సూడాన్'

- దేశంలో కొత్త మాల్‌వేర్ స్వైర విహారం
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులే లక్ష్యంగా ఈ-దాడులు
- వాటి సర్వర్లను క్రాష్ చేస్తున్న ఎటాకర్స్
- ఆయా వెబ్‌సైట్లకు ఒకేసారి కొన్ని లక్షల హిట్స్ వచ్చేలా ప్లాన్
- జాబితాలో హైదరాబాద్‌కు చెందిన అనేక సంస్థలు



➤ ఎలాంటి డిమాండ్లు చేయట్లేదు... ఏ ప్రతిఫలం ఆశించట్లేదు... కేవలం ఉనికి చాటుకోవడానికే దాడులు చేస్తున్నారు! ఏ రోజు, ఎక్కడ, ఎవరిపై దాడి చేసేది ట్విట్టర్ ద్వారా ముందే ప్రకటించి మరీ దెబ్బతీస్తున్నారు!! ప్రభుత్వరంగ, ప్రైవేటు సంస్థలతోపాటు కార్పొరేట్ ఆస్పత్రులే లక్ష్యంగా సైబర్ యుద్ధం చేస్తున్నారు!! గతవారం రోజులుగా దేశవ్యాప్తంగా హడలెత్తిస్తున్న 'అనానిమస్ సూడాన్'వ్యవహారమిది. ఈ దాడులకు గురైన వాటిలో హైదరాబాద్‌కు చెందిన అనేక సంస్థలు సైతం ఉన్నాయి.

'అజ్ఞాత' శత్రువు..!

సాక్షి, హైదరాబాద్: అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక సైబర్ సెక్యూరిటీ సంస్థ రెడ్‌వేర్ సేకరించిన ఆధారాల ప్రకారం సూడాన్‌కు చెందిన కొందరు హ్యాకర్లు 'అనానిమస్ సూడాన్'గ్రూప్ నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ముస్లింలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా తాము ఈ-ఎటాక్స్ చేస్తున్నామని ఈ గ్యాంగ్ ప్రచారం చేసుకుంటోంది. కేవలం తమ ఉనికిని చాటుకోవడానికి, యావత్ ప్రపంచానికి సైబర్ సవాల్ విసరడానికే తమ 'ఆపరేషన్స్'అని చెప్పుకుంటోంది. గత నెల నుంచే ఎటాక్స్ మొదలుపెట్టిన ఈ హ్యాకర్లు... తొలుత ఫ్రాన్స్‌ను టార్గెట్ చేశారు. అక్కడి ఆస్పత్రులు, యూనివర్సిటీలు, విమానాశ్రయాల వెబ్‌సైట్లపై విరుచుకుపడ్డారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా సైబర్ రంగంలో వారి పేరు మారుమోగిపోయింది.

ట్విట్టర్ ద్వారా ప్రకటించి మరీ...

➤ అనానిమస్ సూడాన్ గ్యాంగ్ తాము ఏ దేశాన్ని టార్గెట్ చేస్తున్నామో ముందే ప్రకటిస్తుండటం గమనార్హం. ఈ నెల 6న తమ ట్విట్టర్ ఖాతా హ్యాష్‌ట్యాగ్ అనానిమస్ సూడాన్‌లో 'ఆఫ్టర్ ఫ్రైడే.. ఇండియా విల్ బీ ది నెక్స్ట్ టార్గెట్'(శుక్రవారం తర్వాత భారతదేశమే మా లక్ష్యం) అంటూ ప్రకటించారు. ఆ తర్వాతి రోజే కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయం వెబ్‌సైట్‌పై సైబర్ దాడి జరిగింది. అప్పటి నుంచి వరుసబెట్టి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పాటు ఢిల్లీ, ముంబై, గోవా, హైదరాబాద్‌లలోని విమానాశ్రయాలు, ఆస్పత్రుల వెబ్‌సైట్లపై ఈ-ఎటాక్స్ జరిగాయి. అయితే ఈ-దాడులు పోలీసు, సైబర్‌క్రైమ్ అధికారుల రికార్డుల్లోకి వెళ్లకపోయినా ఈ బాధిత సంస్థల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



➤ సాధారణంగా సైబర్ ఎటాక్స్ చేసే హ్యాకర్లు అనేక డిమాండ్లు చేస్తారు. వీలైనంత మేర బిట్‌కాయిన్ల రూపంలో సొమ్ము చేజిక్కించుకోవాలని, డేటా తస్కరించాలని చూస్తుంటారు. సంస్థలు, వ్యవస్థల్ని హడలెత్తిస్తున్న ర్యాన్సమ్‌వేర్ ఎటాక్స్ తీరుతెన్నులే దీనికి ఉదాహరణ. అయితే అనానిమస్ సూడాన్ ఎటాకర్స్ మాత్రం

నో డిమాండ్స్... కేవలం సవాళ్లే

ఎలాంటి డిమాండ్లు చేయట్లేదు. చివరకు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను ఎటాక్ చేయడానికి సిద్ధమైన ఈ హ్యాకర్లు... కేవలం తమ ఉనికి చాటుకోవడం, సైబర్ ప్రపంచాన్ని సవాల్ చేయడం కోసమే వరుసపెట్టి దాడులు చేస్తున్నారు. కొవిడ్ తర్వాత కాలంలో హాస్పిటల్స్, వాటి రికార్డులు కీలకంగా మారిన నేపథ్యంలో ప్రధానంగా వాటిపైనే అనానిమస్ సూడాన్ హ్యాకర్లు విరుచుకుపడుతున్నారు.

డీ డాక్స్ ఎటాక్స్‌తో సర్వర్లు క్రాష్

➤ ఇతర మాల్‌వేర్స్, హాకర్ల ఎటాక్స్‌కు భిన్నంగా అనానిమస్ సూడాన్ ఎటాక్స్ ఉంటున్నాయి. డీ డాక్స్‌గా పిలిచే డిస్ట్రిబ్యూటెడ్ డినైయెల్ ఆఫ్ సర్వీసెస్ విధానంలో వారు దాడి చేస్తుంటారు. ప్రతి సంస్థకు చెందిన వెబ్‌సైట్‌కు దాని సర్వర్‌ను బట్టి సామర్థ్యం ఉంటుంది. ఆ స్థాయి ట్రాఫిక్‌ను మాత్రమే అది తట్టుకోగలుగుతుంది. అంతకు మించిన హిట్స్ వస్తే కుప్పకూలిపోతుంది. పరీక్షల రిజల్ట్స్ వచ్చినప్పుడు ఆయా బోర్డులకు చెందిన వెబ్‌సైట్లు మొరాయించడానికి ఇదే కారణం. అనానిమస్ సూడాన్ ఎటాకర్స్ దీన్నే ఆధారంగా చేసుకున్నారు. టార్గెట్ చేసిన వెబ్‌సైట్లకు ప్రత్యేక ప్రొగ్రామింగ్ ద్వారా ఒకేసారి కొన్ని లక్షల హిట్స్, క్వైరీస్ వచ్చేలా చేస్తున్నారు. దీంతో ఆ ట్రాఫిక్‌ను తట్టుకోలేని సర్వర్ ఒక్కసారిగా కుప్పకూలిపోతోంది. ఈ కారణంగా నిజమైన వినియోగదారులు ఆ వెబ్‌సైట్‌ను సాంకేతిక నిపుణులు మళ్లీ సరిచేసే వరకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఉమ్మడిగా పని చేస్తే కట్టడి

అనానిమస్ సూడాన్ ఎటాక్స్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాటి వల్ల నష్టం తగ్గించడానికి పోలీసులతోపాటు సైబర్ నిపుణులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కలసి పనిచేయాల్సి ఉంటుంది. హ్యాకర్ల టార్గెట్‌లో ఉన్న సంస్థలను అప్రమత్తం చేయడం, అవసరమైన స్థాయిలో ఫైర్ వాల్స్ అభివృద్ధి చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఈ ప్రపంచంలో ఏ ఒక్క వ్యవస్థకూ పూర్తిస్థాయిలో సైబర్ భద్రత ఉండదు. అయితే కొత్త సవాళ్లకు తగ్గట్లు ఎప్పటికప్పుడు మార్పుచేర్పులు చేసుకోవాలి.

– రాజేంద్రకుమార్, సైబర్ నిపుణుడు

ప్రపంచవ్యాప్తంగా 'అనానిమస్ సూడాన్'ఎటాక్స్ ఓవైపు కలకలం సృష్టిస్తుంటే మరోవైపు 'హ్యాక్టివిస్ట్ ఇండోనేసియా' అనే హాకర్ల గ్రూప్ సైతం దేశంలోని వివిధ కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల వెబ్‌సైట్లను టార్గెట్ చేసినట్లు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)

'హ్యాక్టివిస్ట్ ఇండోనేసియా'తోనూ ముప్పు

తాజాగా ప్రకటించింది. ఐ4సీ పరిధిలోని సైబర్ థ్రెట్ ఇంటెలిజెన్స్ వింగ్ హాకర్ల కుట్రను బయటపెట్టింది. డినైయెల్ ఆఫ్ సర్వీస్ (డీఓఎస్), డిస్ట్రిబ్యూటెడ్ డినైయెల్ ఆఫ్ సర్వీసెస్ (డీ-డాక్స్) విధానాల్లో ఈ హ్యాకర్లు ఆయా వెబ్‌సైట్స్ సర్వర్లు కుప్పకూలేలా చేయనున్నారని అప్రమత్తం చేసింది. దాదాపు 12 వేల వెబ్‌సైట్లు వారి టార్గెట్ లిస్టులో ఉన్నట్లు అంచనా వేసింది. గతేడాది ఢిల్లీ ఎయిమ్స్‌ జరిగిన సైబర్ దాడి ఈ తరహాకు చెందినదే అని, దేశంలోనే అతిపెద్ద సైబర్ ఎటాక్‌గా ఈ గ్రూప్ మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు సైబర్ దాడులు, హెచ్చరికల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల వెబ్‌సైట్లను సైబర్ దాడుల నుంచి ఎలా కాపాడుకోవాలో కీలక సూచనలు చేసింది.



రోగి కాళ్లు పట్టి లాక్కెళ్లారు..

స్ట్రెచర్ లేక రోగి సహాయకుల అవస్థ



ఆస్పత్రిలో రోగి కాళ్లు పట్టుకుని లాక్కెళ్తున్న బంధువులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో దారుణం జరిగింది. అనారోగ్య సమస్యతో నడవలేని స్థితిలో ఓ రోగి ఆస్పత్రికి వచ్చాడు. స్ట్రెచర్ అందుబాటులో లేక.. ఆస్పత్రి సిబ్బంది పట్టించుకోక.. బంధువులే అతని కాళ్లు పట్టుకుని వైద్యుని దగ్గరకు లాక్కెళ్లారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన వివరాలిలా ఉన్నాయి. గత నెల 31న సాయంత్రం జబ్బు పడిన ఓ వ్యక్తిని అతని బంధువులు ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఓపీకి కొద్ది దూరంలో కూర్చోబెట్టారు. ఓపీ మధ్యాహ్నం వరకే ఉండటంతో అతను ఆ రాత్రంతా అక్కడే ఉండిపోయాడు. మరుసటి రోజు ఏప్రిల్ 1న ఉదయం ఓపీ ప్రారంభమైన తరువాత... అతడితో వచ్చిన వారు ఓపీలో రిజిస్టర్ చేయించారు. వారు అతడిని రెండో అంతస్తులో వైద్యుడి వద్దకు వెళ్లాలని ఓపీ రాసిచ్చారు. అనంతరం ఆ వ్యక్తిని లిఫ్ట్ వరకు తీసుకెళ్లడానికి స్ట్రెచర్ అవసరం పడింది. అక్కడ స్ట్రెచర్ లేకపోవటంతో బంధువులు అతని కాళ్లు పట్టి లాక్కెళ్లారు. అక్కడ ఉన్నవారు అది చూసి ఆశ్చర్యపోయారు. రోగి కాళ్లు పట్టి లాగుతున్నా అక్కడి వైద్య సిబ్బంది పట్టించుకోక పోవటం గమనార్హం. అతడిని రెండో అంతస్తుకు చేర్చాక అక్కడ కూడ స్ట్రెచర్, వీల్ చైర్ అందుబాటులో లేకపోవటంతో అక్కడి నుంచి కూడా వైద్యుడి గది వరకు కాళ్లు పట్టి లాక్కెళ్లారు. స్ట్రెచర్, వీల్‌చైర్ లేకపోవడం, లాక్కెళుతున్నా సిబ్బంది పట్టించుకోకపోవటంపై విమర్శలు వస్తున్నాయి.

మానవ వనరుల అభివృద్ధిలో భారత్ నం.1

- చిన్నారుల వ్యాక్సిన్‌లలో 65 శాతం ఇండియాలో తయారైనవే..
- ఐఐటీహెచ్ ఆవిర్భావ వేడుకల్లో భారత్ బయోటెక్ వ్యవస్థాపక చైర్మన్ కృష్ణ ఎల్ల



మాట్లాడుతున్న కృష్ణ ఎల్ల

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ప్రపంచ వ్యాప్తంగా చిన్న పిల్లలకు ఇస్తున్న వ్యాక్సిన్‌లలో 65 శాతం ఇండియాలో ఉత్పత్తి అయిన వ్యాక్సిన్‌లే ఉన్నాయని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, భారత్ బయోటెక్ వ్యవస్థాపక చైర్మన్ కృష్ణ ఎల్ల వెల్లడించారు. శుక్రవారం జరిగిన హైదరాబాద్ ఐఐటీ ఆవిర్భావ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. మానవ వనరుల అభివృద్ధిలో భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇండియాలో డిజిటల్ ఎకానమీ 34 శాతం ఉంటే అభివృద్ధి చెందిన అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాల్లో 8 శాతం లోపే ఉందని పేర్కొన్నారు. వ్యాక్సినేషన్, ఫార్మా తదితర రంగాలను ప్రపంచ రాజకీయాలు ఎంతో ప్రభావితం చేస్తున్నాయని కృష్ణ అభిప్రాయపడ్డారు. కొన్ని దేశాలు వ్యాక్సిన్ ఎగుమతి చేసి, బదులుగా ఆయా దేశాల నుంచి విలువైన ఖనిజాలను దిగుమతి చేసుకుంటున్నాయని వివరించారు. వ్యవసాయరంగం అభివృద్ధితో పాటు నూతన ఆవిష్కరణలు దేశాన్ని ఆర్థికాభివృద్ధి వైపు నడిపిస్తాయన్నారు. ఇంగ్లిష్ పెద్దగా తెలియని చైనా నూతన ఆవిష్కరణల్లో ముందంజలో ఉందన్నారు.

వైరస్‌ల పట్ల అలసత్వం వద్దు

వైరస్‌ల కారణంగా పుట్టుకొస్తున్న వ్యాధుల పట్ల అలసత్వం వద్దని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాధుల మూలాలను ఎప్పటికప్పుడు గుర్తించి ఎక్కడికక్కడ సరైన వైద్యం చేసి కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మడగాస్కర్‌లో పుట్టిన చికున్‌గున్యా ఇండియాకు విస్తరించిందనీ ఆఫ్రికా దేశాల్లో పుట్టిన జికా వైరస్ బ్రెజిల్ వంటి దేశాలకు విస్తరించిందని తెలిపారు. ఐఐటీహెచ్‌లోని వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ పాలకవర్గం చైర్మన్ బీవీజీ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సై తుది రాత పరీక్ష ప్రాథమిక కీ నేడు విడుదల

అభ్యంతరాలు తెలిపేందుకు ఈనెల 17 వరకు గడువు

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా ఈనెల 8, 9 తేదీల్లో ఎస్సై, తత్సమాన పోస్టులకు నిర్వహించిన తుది రాత పరీక్ష ప్రాథమిక 'కీ'శనివారం ఉదయం నుంచి అందుబాటులో ఉండనుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. సివిల్ ఎస్సై, కమ్యూనికేషన్ ఎస్సై, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఎస్సై, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టులకు తుది రాత పరీక్ష పూర్తయిన విషయం తెలిసిందే. వీటికి సంబంధించిన ప్రిలిమినరీ కీ లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 17సాయంత్రం 5 గంటల తెలియజేయవచ్చని శ్రీనివాసరావు తెలిపారు. www.tslprb.in వెబ్‌సైట్‌లో సూచించిన టెంప్లేట్ల విధానంలోనే ప్రతి ప్రశ్నకు వేర్వేరుగా అభ్యంతరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సపోర్టింగ్ డాక్యుమెంట్లు, మెటీరియల్‌ను పీడీఎఫ్ లేదా జేపీఈజీ విధానంలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రాతపూర్వకంగా పంపే అభ్యంతరాలను స్వీకరించమని పేర్కొన్నారు.

గత నిబంధనలే అనుసరించాం

- ఐసీడీఎస్ టెండర్లపై 'విజయ పాలకు ఎసరు'శీర్షికతో సాక్షిలో కథనం
- కథనంపై స్త్రీ శిశు సంక్షేమశాఖ స్పందన

సాక్షి, హైదరాబాద్: 'విజయ పాలకు ఎసరు'శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై స్త్రీ శిశు సంక్షేమశాఖ వివరణ ఇచ్చింది. ప్రస్తుత టెండర్‌లో కూడా గతేడాది టెండర్‌లో పాటించిన నిబంధనలనే అనుసరించామని తెలిపింది. అయితే.. సహకార డెయిరీ సంస్థలను మాత్రమే టెండర్‌కు పిలిచినట్టు అధికారులు వివరణ ఇచ్చారు. గత టెండర్‌లో 3 లక్షల లీటర్ల పాల సామర్థ్యం, ఏదో ఒక ఏడాదిలో 1.5 కోట్ల లీటర్ల టెట్రా ప్యాక్ సరఫరా చేసిన అనుభవం ఉండాలన్న నిబంధనలు పొందుపరిచారు. ఆ నిబంధనలు కర్ణాటక, గుజరాత్‌లకు చెందిన రెండు సహకార సంస్థలను ప్రోత్సహించేవిగా ఉన్నాయన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నిబంధనల వల్ల గతేడాది కూడా విజయ డెయిరీ టెండర్లలో అర్హత పొందలేదు. మళ్లీ ఈ ఏడాదీ అవే నిబంధనలను అనుసరించారు. రెండేళ్లుగా ఇవే నిబంధనలతో టెండర్ ప్రక్రియ చేపడుతున్నామన్న స్త్రీశిశు సంక్షేమశాఖ, ఆ నిబంధనలు 2018 ప్రభుత్వ జీవో ప్రకారం లేవనే విషయాన్ని పట్టించుకోవడం లేదని, ఈసారైనా మార్చాలి కదాని విజయ డెయిరీ వర్గాలు అంటున్నాయి. పాల సరఫరా, వాటి రవాణాకు సంబంధించిన టెండర్లను విడివిడిగా వేయకుండా, రెండు ఒక సంస్థకే దక్కేలా చేయడమేంటని, టెండర్లకు హాకాకు బదులుగా స్త్రీశిశు సంక్షేమశాఖ ఎందుకు వెళ్లిందనే విషయంపైనా ఆరోపణలు వస్తున్నాయి. అయితే వీటన్నింటిపై ఆ శాఖ నోరుమెదపడంలేదు.

అప్రమత్తంగా ఉండాలి

పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సమీక్షలో డీజీపీ అంజనీకుమార్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీజీపీ అంజనీకుమార్, పోలీసు ఉన్నతాధికారులు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల వాతావరణం సమీపిస్తున్నందున శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని డీజీపీ అంజనీకుమార్ పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఆదేశించారు. ప్రతి పోలీస్ ఉన్నతాధికారి వారి పరిధిలోని గ్రామాల సందర్శన కొనసాగించాలని సూచించారు. నగరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తు విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో డీజీపీ తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా హాట్‌స్పాట్ల గుర్తింపు, పోలీసుల ప్రవర్తన తదితర అంశాలపై డీజీపీ చర్చించారు. శాంతిభద్రతల అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి పలు సూచనలు చేశారు. ప్రతీ పోలీస్ స్టేషన్ నుంచి పదిమంది పోలీస్ అధికారులకు సైబర్ క్రైమ్ నివారణలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటానికి డీజీపీ నివాళులర్పించారు.

200 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు

టెన్త్ స్పాట్‌వాల్యూయేషన్‌కు హాజరుకాలేదని...

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలో జరుగుతున్న టెన్త్ స్పాట్ వాల్యూయేషన్‌కు విధులు కేటాయించినా హాజరుకాని 200మంది ఉపాధ్యాయులపై విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఇందులో ప్రధానంగా తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలిసింది. అనారోగ్యం, వివిధ కారణాలరీత్యా విధులు రద్దు చేయాలని దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోకుండా నోటీసులు ఎలా ఇస్తారని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది స్పాట్ వాల్యూయేషన్ రెమ్యూనరేషన్ ఇప్పటివరకు చెల్లించలేదని ఇంగ్లిష్ టీచర్ల ఫోరం తరఫున శనివారం ఆందోళనలు చేయనున్నట్లు తెలిసింది.

టెన్త్ స్పాట్‌కు తిప్పలు!



- జవాబుపత్రాల వాల్యూయేషన్‌కు ఇష్టపడని కొందరు టీచర్లు
- మెడికల్ సర్టిఫికెట్లు పెడుతూ తప్పించుకుంటున్న తీరు!
- హాజరుకాని వారికి నోటీసులు ఇస్తున్న అధికారులు
- సౌకర్యాలు లేనిచోట పని చేసేదెలాగని టీచర్ల ప్రశ్నలు

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనానికి తిప్పలు తప్పడం లేదు. ఓవైపు ఇబ్బందులు, మరోవైపు టీచర్ల అనాసక్తి కారణంగా జవాబు పత్రాలను దిద్ది మార్కులు వేసే ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. కొందరు టీచర్లు అనారోగ్యమనో, మరో అత్యవసర కారణమో చూపుతూ స్పాట్ వ్యాల్యూయేషన్‌ను తప్పించుకుంటున్నారని.. మరికొందరు చెప్పకుండానే హాజరుకావడం లేదని అధికారులు చెప్తున్నారు. మరోవైపు స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి సౌకర్యాలూ ఉండటం లేదని, అసలే వేసవి కావడంతో తీవ్రంగా అవస్థలు పడుతున్నామని టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్యూటీ వేసినా కూడా..

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవలే టెన్త్ పరీక్షలు ముగిశాయి. స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియను గురువారం నుంచి మొదలు పెట్టారు. గతంలో మూల్యాంకన కేంద్రాలు 12 ఉంటే, ఈసారి 18కి పెంచారు. జిల్లా లవారీగా సబ్జెక్టు, లాంగ్వేజ్ నిపుణులను మూల్యాంకన విధులకు తీసుకున్నారు. సాధారణంగా విద్యాశాఖ అధికారులు మూల్యాంకన ప్రక్రియ మొదలవడానికి కేవలం రెండు రోజుల ముందుగా టీచర్లకు విధులు వేస్తుంటారు. ఈసారి కూడా అలాగే చేశారు. అయితే డ్యూటీ వేశారని తెలియడంతోనే కొందరు టీచర్లు నేరుగా వైద్యులను సంప్రదించి, ఏదో ఒక అనారోగ్యంతో బాధపడుతున్నట్టు మెడికల్ సర్టిఫికెట్ తీసుకొచ్చి.. మూల్యాంకనం విధుల నుంచి తప్పించాలని కోరారు. మరికొందరు తొలిరోజు విధులకు హాజరవ్వలేదు. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువ మంది ఇలా డుమ్మా కొట్టడంతో అధికారులు వారికి నోటీసులు జారీ చేశారు.

కఠినంగా వ్యవహరించాల్సిందే..

మూల్యాంకన విధులకు హాజరవని టీచర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. బలమైన కారణాలుంటే తప్ప, మెడికల్ సర్టిఫికెట్లను అనుమతించకూడదని స్పష్టం చేసినట్టు తెలిసింది. అయితే కొన్ని సంఘాల నేతలు తమ వారిని విధుల నుంచి తప్పించాలని ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఆన్‌లైన్ మూల్యాంకన విధానం చేపడితే ఈ తిప్పలు ఉండవని.. విద్యాశాఖ ఆ దిశగా ఎందుకు ఆలోచించడం లేదని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. మొత్తంగా 30 లక్షలకు పైగా సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉండగా.. వివిధ సమస్యలతో ఈ ఏడాది స్పాట్ వాల్యూయేషన్ ఆలస్యమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది టెన్త్ ఫలితాల వెల్లడిపైనా ప్రభావం చూపుతుందని అంటున్నారు. ఈ విషయమై పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేనను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

టీచర్లు చెప్తున్న ఇబ్బందులేమిటి?

- మూల్యాంకనం చేసే జవాబుపత్రాలకు ఒక్కో దానికి రూ.10 చెప్పున టీచర్లకు చెల్లిస్తారు. ఒక్కో టీచర్ రోజుకు 36 కన్నా ఎక్కువ సమాధాన పత్రాలను దిద్దలేరు. దూరప్రాంతాల నుంచి వచ్చే టీచర్లకు టీఏ, డీఏలేమీ ఇవ్వడం లేదు. పైగా మూల్యాంకన కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉండాలి. శ్రమ ఎక్కువ, ఫలితం తక్కువ అని కొందరు టీచర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
- మూల్యాంకన కేంద్రాలను ఎక్కువగా ప్రైవేటు స్కూళ్లలో ఏర్పాటు చేశారు. అక్కడ విద్యార్థులు కూర్చునే చిన్న బల్లలు ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వాటిపై కూర్చుని పేపర్లు దిద్దడం కష్టంగా ఉంటోందని, వెన్నునొప్పి వస్తోందని టీచర్లు అంటున్నారు.
- ఈసారి ఆరు పేపర్లతోనే టెన్త్ పరీక్షలు నిర్వహించారు. గతంలో మొత్తంగా 11 పేపర్లు ఉండేవి. దీనితో ఎక్కువ పేపర్లు మూల్యాంకనం చేసే అవకాశం ఉండటం లేదని అంటున్నారు.
- స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాలకు టీచర్లు కచ్చితంగా ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలి. ఐదు నిమిషాలు ఆలస్యమైనా క్యాంపు ఆఫీసర్లు గేటు వద్దే ఆపేస్తున్నారు. దీన్ని టీచర్లు అవమానంగా భావిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న తమ కష్టాలు చూడకుండా నిలిపివేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

మొగిలయ్య వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ వెల్లడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మొగిలయ్యను పరామర్శిస్తున్న మంత్రి ఎర్రబెల్లి తదితరులు

లక్డీకాపూల్: మొగిలయ్య వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. బలగం సినిమాలో..'నా తోడుగా నా తోడు ఉండి'అనే పాటతో ఫేమస్ అయిన బుడగ జంగాల కళాకారుడు మొగిలయ్య కిడ్నీ సంబంధ సమస్యలతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కాగా, శుక్రవారం మొగిలయ్యను మంత్రి ఎర్రబెల్లి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ నిమ్స్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడారు. మొగిలయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నానని, ఆయనకు మంచి వైద్యం అందించాలని నిమ్స్ డాక్టర్లను ఆదేశించానని మంత్రి తెలిపారు.



ఐస్‌క్రీమ్ కంపెనీ సీజ్

కల్తీ ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం చందానగర్, జవహర్‌నగర్ రోడ్డులో ఉన్న బెస్ట్ ఐస్‌క్రీమ్ కంపెనీపై దాడి చేశారు. -10లో

20 నిమిషాల్లో స్నాచర్లను పట్టేశారు



గొలుసు దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు 20 నిమిషాల్లోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో స్నాచింగ్ ఘటన జరిగింది. -10లో



సిక్కుల పండుగ వైశాఖి ఫెస్టివల్ సందర్భంగా శుక్రవారం అమీర్‌పేటలో గురుద్వారా సాహెబ్ నుంచి గురుగ్రంథ్ సాహిబ్‌జీని ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా యువతీ యువకులు విన్యాసాలు ప్రదర్శించారు.



అద్భుతం.. ఆవిష్కృతం

- ఆవిష్కరించిన సీఎం కేసీఆర్
- తరలివచ్చిన అభిమానులు
- హెలికాప్టర్ నుంచి పూల వర్షం

సాగర తీరంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం





125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్న జనం..

ఖైరతాబాద్: ఒకప్పుడు హైదరాబాద్ అనగానే చార్మినార్..బిర్లామందిర్..గోల్కొండ కోట తదితరాలను చెప్పుకునే వాళ్లం. ఇప్పుడు వీటి సరసన శుక్రవారం ఆవిష్కరణ జరుపుకున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం కూడా చేరింది. దేశంలోనే అత్యంత ఎత్తులో ఆవిష్కృతమైన అంబేడ్కర్ విగ్రహాన్ని...అంబేడ్కర్ జయంతి రోజున సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించే అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా అంబేడ్కర్ అభిమానులు భారీగా తరలివచ్చారు. జై భీం..బాబా సాహెబ్ అంబేడ్కర్ నినాదాలతో ఆ ప్రాంగణం మారుమోగింది.

- ముఖ్యమంత్రి కేసీఆర్, అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్, మంత్రులతో కలిసి మధ్యాహ్నం 3.30 నిమిషాలకు చేరుకున్న అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆడిటోరియం ప్రధాన భవనం లిఫ్ట్ ద్వారా అంబేడ్కర్ విగ్రహ పాదాల వద్దకు చేరుకొని అక్కడ 20 మంది బౌద్ధ గురువులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించగా.. ఆ సమయంలో హెలికాప్టర్ ద్వారా పూల వర్షం కురిపించారు.
- పీఠం లోపల అంబేడ్కర్ జీవిత ఘట్టాలకు చెందిన ఛాయాచిత్రాలతో పాటు ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాల నుంచి తరలివచ్చిన 50 వేల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు.
- అంబేడ్కర్ విగ్రహాన్ని మొబైల్స్‌లో ఫొటోలు తీసేందుకు జనం పోటీ పడ్డారు.
- ఖైరతాబాద్, నెక్లెస్ రోడ్డు, తెలుగుతల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో వాహనదారులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- భారీగా జనం తరలి రావడంతో నెక్లెస్‌రోడ్డు, ఎన్టీఆర్‌మార్గ్, ఖైరతాబాద్, లక్డీకాపూల్ ప్రాంతాలన్నీ కిక్కిరిశాయి.



మాసాబ్‌ట్యాంకు రూట్లో ట్రాఫిక్ జామ్



మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతలను ప్రకాష్ అంబేడ్కర్‌కు పరిచయం చేస్తున్న సీఎం కేసీఆర్



ట్యాంక్‌బండ్ వద్ద జైభీమ్ యూత్ సందడి



ఎన్టీఆర్ మార్గ్‌లో రద్దీ..

న్యూస్‌రీల్

నూతన విద్యా విధానంపై సంఘటిత పోరు



జార్జిరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

హిమాయత్‌నగర్: జార్జిరెడ్డి స్ఫూర్తితో నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పీడీఎస్‌యూ జాతీయ యూనివర్సిటీల కన్వీనర్ ఎస్.నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ పిలుపునిచ్చారు. విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి వర్ధతిని పురస్కరించుకుని శుక్రవారం నారాయణగూడలోని సిమెంట్రీలో ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, ఆజాద్ మాట్లాడుతూ..యూనివర్సిటీలను ధ్వంసం చేస్తూ..మతోన్మాదాన్ని పెంచుతూ, విద్యార్థుల ఆలోచనలను ప్రభావితం చేసేలా పాఠ్యాంశాలను మారుస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విద్యను ధ్వంసం చేసి, కార్పొరేట్, ప్రైవేట్ విద్యను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో పేదలకు విద్యను అందని ద్రాక్షగా మారుస్తున్న కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత ప్రగతిశీల విద్యార్థులపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎల్.పద్మ, కె.ఎస్.ప్రదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు స్వాతి, ప్రవీణ్, రాష్ట్ర నాయకులు వెంకటేష్, గణేష్, సుమంత్, రాకేష్, జార్జ్ తిరుపతి, అఖర్, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆశల వల.. రూ.42 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: నగరానికి చెందిన ఇద్దరు యువకులకు సైబర్ నేరగాళ్లు ఆశ చూపించారు. తక్కువ రోజుల్లో తక్కువ పెట్టుబడి పేరుతో కోటీశ్వరులు కావొచ్చంటూ వల వేశారు. వారి మాయ మాటల్ని నమ్మిన ఆ ఇద్దరూ వేర్వేరుగా లక్షల రూపాయిలు వెచ్చించి మోసపోయారు. తమ డబ్బు తమకివ్వమని వేడుకున్నా ఇవ్వట్లేదని వారిపై చర్యలు తీసుకోవాలంటూ సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తాము ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో ఉన్నామని, కోటీశ్వరులు అయ్యామని నగరానికి చెందిన ఓ వ్యక్తికి చెప్పారు. చాలా తక్కువ పెట్టుబడి పెడితే కోట్లు వచ్చే ప్లాన్ రూపొందిస్తామన్నారు. తొలి రోజుల్లో రెండు రెట్లు లాభాలు ఇచ్చి నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. ఆ తర్వాత ఒకటేసారి రూ.27 లక్షలు పెట్టుబడి పెట్టించి ఒక్క రూపాయి లాభం ఇవ్వలేదు. మరొక వ్యక్తికి పార్ట్‌టైం జాబ్ ఇస్తామన్నారు. ఆ జాబ్ ద్వారా ఇన్వెస్ట్‌మెంట్ కూడా చేయొచ్చన్నారు. పలు దఫాలుగా రూ.15 లక్షలు ఇచ్చారు. ఇలా ఒక్క రూపాయి లాభం ఇవ్వకపోగా టాస్క్‌ల పేరుతో మరిన్ని లక్షలు కావాలని వేధిస్తున్నారు. దీంతో ఆ ఇద్దరూ వేర్వేరుగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ చెప్పారు.

అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియం ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ట్రక్ పార్కులో సరికొత్తగా ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియం ఎక్స్‌పోను శనివారం చిన్నారులచే ప్రారంభించారు. ఈ ఎక్స్‌పోలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అమ్యూజ్‌మెంట్లతో పాటు 500 రకాల సముద్ర చేపలతో అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియంను ఏర్పాటు చేశారు. ఎక్స్‌పోలో 200కు పైగా హ్యాండీ క్రాఫ్ట్స్, చేనేత విభాగాలకు చెందిన ప్రత్యేక స్టాళ్లను సైతం ఏర్పాటు చేశారు. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని సుమారు 66 రోజుల పాటు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియం ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న చిన్నారులు, నిర్వాహకులు

లీచెట్ జలాలకు చెక్

రూ.250 కోట్లతో ట్రీట్‌మెంట్ ప్లాంట్

- జవహర్‌నగర్‌లో నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- తీరనున్న చెరువుల కాలుష్య సమస్యలు



సాక్షి, సిటీబ్యూరో: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న లీచెట్ (హానికర వ్యర్థజలాలు)తో అల్లాడుతున్న పరిసర గ్రామాల ప్రజల సమస్యకు ఇక మోక్షం లభించనుంది. ఏళ్లతరబడి ఇక్కడ చెత్త కారణంగా వెలువడుతున్న లీచెట్ వల్ల పరిసర ప్రాంతాల్లోని చెరువులు, ఇతర జలాశయాలు కాలుష్యకాసారాలుగా మారాయి. దీంతో సమస్యకు చెక్ చెప్పేందుకు..లీచెట్ నిర్వహణ, శుద్ధికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్లాంట్ శనివారం ప్రారంభం కానుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూ.250 కోట్లతో రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను మునిసిపల్, ఐటీ శాఖల మంత్రి కె.తారక రామారావు శనివారం ప్రారంభించనున్నారు.

వర్షాలొస్తే ఎన్ని సమస్యలో...

జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తగుట్టల కారణంగా వర్షాలొచ్చినప్పుడు చెత్తనుంచి కారే లీచెట్ పరిసరాల్లోని మల్కారం తదితర చెరువుల్లో చేరేది. దాంతో స్థానిక ప్రజలు తీవ్ర సమస్యలతో అల్లాడేవారు. వర్షాల సమయంలో చెరువులు నిండి ఓవర్‌ఫ్లో అయ్యేవి. ఈ సమస్యను తగ్గించేందుకు కొన్ని కత్రిమ చెరువుల్ని తవ్వి లీచెట్‌ను వాటిల్లోకి పంపించారు. లీచెట్‌ను ట్రీట్‌మెంట్ చేసేందుకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ 2017 నుంచి మొదటిస్థాయి ట్రీట్‌మెంట్ పనులు చేసింది. రివర్స్ ఆస్మోసిస్ ప్లాంట్ ద్వారా రోజుకు 2 వేల కిలోలీటర్ల సామర్థ్యంతో పనులు ప్రారంభించి, అనంతరం 4 వేల కిలోలీటర్ల సామర్థ్యంతో 2021 ఏప్రిల్ వరకు ఆ పనులు చేసింది. మల్కారం చెరువులో చేరిన లీచెట్‌లో 11.67 లక్షల కిలో లీటర్లను అలా శుద్ధి చేసినట్లు పేర్కొంది. పై చెరువుల నుంచి వరదనీరు మల్కారం చెరువులో చేరకుండా డైవర్షన్ చానల్ నిర్మించారు. 2020లో చెత్తగుట్ట క్యాపింగ్ పనులు చివరి దశకు చేరుకోవడంతో పూర్తిస్థాయిలో లీచెట్ ట్రీట్‌మెంట్, శుద్ధి పనుల్ని చేసేందుకు జీహెచ్‌ఎంసీ టెండర్లు పిలిచింది. టెండరు దక్కించుకున్న రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ ఆధునిక సాంకేతికతతో పనిచేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. టెండరు ఒప్పందం మేరకు మల్కారం చెరువుతోపాటు పరిసరాల్లోని ఇతర చెరువులు, కృత్రిమ చెరువుల్లోని లీచెట్‌ను రెండేళ్లలో శుద్ధి చేయాలి. ఘనవ్యర్థాల నిర్వహణ రూల్స్–2016 మేరకు ఈ పనులు చేయాలి. అనంతరం మూడేళ్లు చెరువుల్ని సాధారణ చెరువులుగా (లీచెట్, ఇతరత్రా కాలుష్య కారకాలు లేకుండా) పునరుద్ధరించాలి. ఒక వేళ మూడేళ్లలో సాధారణ పరిస్థితికి చేరుకోని పక్షంలో సాధారణ స్థితికి వచ్చేంత వరకు పదేళ్ల దాకా ట్రీట్‌మెంట్ పనులు, నిర్వహణ చేయాల్సి ఉంటుంది. డంపింగ్ యార్డు, పరిసరాల్లో దాదాపు 8,49,780 కిలోలీటర్ల లీచెట్ ఉన్నట్లు అంచనా. కొత్త ప్లాంట్ ట్రీట్‌మెంట్ సామర్థ్యం రోజుకు 2 వేల కిలో లీటర్లు. లీచెట్ మొత్తం ట్రీట్ చేశాక మిగిలే కొద్దిశాతం స్లడ్జ్‌ను ల్యాండ్‌ఫిల్ చేస్తారని జీహెచ్‌ఎంసీ పేర్కొంది. మల్కం చెరువు శుద్ధిని ప్రాధాన్యతగా తీసుకున్న జీహెచ్‌ఎంసీ దాన్ని మూడు దశల్లో పూర్తిచేయనుంది.

సమ్మర్ టూర్.. వెరీ 'హాట్' గురూ!



ఫ్లైట్ చార్జీలు పైపైకి...

- గోవా, జైపూర్, బ్యాంకాక్, మాల్దీవులకు ఎక్కువ డిమాండ్
- రైళ్లలోనూ భారీగా పెరిగిన రద్దీ
- మరో రెండు నెలల పాటు ఇదే పరిస్థితి

సాక్షి, సిటీబ్యూరో: వేసవి వచ్చిందంటే చాలు మండే ఎండలతో పాటు టూర్‌లు కూడా ఎక్కువే. ఇంటిల్లిపాది కలిసి..నచ్చిన ప్రాంతాల్లో పర్యటించేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతారు. కొద్ది రోజులుగా హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు పర్యాటకుల రద్దీ పెరిగింది. కొంతమంది సిటీ టూరిస్టులు ఇప్పటికే 'డెస్టినేషన్ సెర్చింగ్'లో మునిగిపోయారు. నచ్చిన చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లో గడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో రైళ్లు, విమానాలకు భారీగా డిమాండ్ నెలకొంది.

హైదరాబాద్ నుంచి గోవా, విశాఖ, బెంగళూరు, ఢిల్లీ, జైపూర్ తదితర ప్రాంతాలకు రద్దీకనుగుణంగా విమాన చార్జీలు సైతం పెరుగుతున్నాయి. మరో 2 నెలల పాటు ఏ రోజుకు ఆ రోజు చార్జీల్లో గణనీయమైన మార్పులు ఉండే అవకాశం ఉన్నట్లు నగరానికి చెందిన ట్రావెల్ ఏజెన్సీల నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. కుటుంబమంతా కలిసి జైపూర్ వంటి చారిత్రక నగరాలను, ఊటీ, సిమ్లా వంటి చల్లటి ప్రాంతాలను ఎంపిక చేసుకుంటుండగా, కుర్రకారు మాత్రం మాల్దీవులు, బ్యాంకాక్ వంటి అంతర్జాతీయ డెస్టినేషన్లకు ఫ్లైటెక్కేస్తున్నారు. సోలో టూరిస్టుల సంఖ్య కూడా ఇటీవల కాలంలో బాగా పెరిగినట్లు అంచనా. దీంతో కొద్ది రోజులుగా కేరళ, తమిళనాడులోని పర్యాటక ప్రాంతాలకు, సింగపూర్, దుబాయ్ తదితర దేశాలకు సైతం బుకింగ్‌లు భారీ సంఖ్యలోనే ఉన్నాయి. పర్యాటకుల రద్దీని సొమ్ము చేసుకొనేందుకు ఎయిర్‌లైన్స్ సంస్థలు చార్జీలను పెంచేశాయి.

టికెట్ల రేట్లు పైపైకి...

కొద్ది రోజులుగా గోవాలో పర్యాటకుల సందడి పెరిగింది. వేసవి సెలవులను సరదాగా గడిపేందుకు చాలా మంది గోవాను ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతి రోజు సుమారు 50 వేల మంది డొమెస్టిక్ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా వారిలో 8 వేల మందికి పైగా గోవా టూరిస్టులే ఉన్నట్లు అంచనా. విమానాల్లోనూ, రోడ్డు, రైలు మార్గాల్లోనూ సిటీ టూరిస్టులు గోవాకు తరలి వెళ్తున్నారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి గోవాకు ఫ్లైట్ చార్జీ రూ.5000 వరకు ఉంటే ప్రస్తుతం రూ.7500 వరకు చేరింది. మరికొద్ది రోజుల్లో ఈ చార్జీలు మరింత పెరిగి రూ.10 వేలకు చేరుకున్నా ఆశ్చర్యం లేదని ట్రావెల్స్ సంస్థలు పేర్కొంటున్నాయి. ఇక ఇంటిల్లిపాది కలిసి వెళ్లే టూర్‌లలో ఎక్కువగా జైపూర్. కేరళ, తమిళనాడు పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.

అంతర్జాతీయ పర్యటనలు పెరిగాయ్...

హైదరాబాద్ నుంచి సింగపూర్, మలేసియా, దుబాయ్, మాల్దీవులకు కూడా టూరిస్టుల రద్దీ పెరిగింది. గోవా తరువాత చాలామంది కుర్రాళ్లు బ్యాంకాక్ వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో చార్జీలు పెరుగుతూనే ఉన్నాయి. గతంలో బ్యాంకాక్‌కు రూ.25000 వరకు రౌండాఫ్ ఉంటే ఇప్పుడు రూ.40 వేలకు చేరినట్లు ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు ఒకరు తెలిపారు. భారీగా పెరిగిన విమాన చార్జీల దృష్ట్యా ఐఆర్‌సీటీసీ ఫ్లైట్ ప్యాకేజీలను తగ్గించి ఎక్కువగా రైల్‌టూర్‌లనే నిర్వహిస్తోంది.

రైళ్లలో రద్దీ..

ఇక హైదరాబాద్ నుంచి విజయవాడ, వైజాగ్, తిరుపతి, బెంగళూరు, గోవా, ఢిల్లీ, ముంబై, షిరిడీ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే రైళ్లలోనూ రద్దీ పెరిగింది. జూన్ నెలాఖరు వరకు పలు రైళ్లలో వెయిటింగ్ లిస్టు దర్శనమిస్తోంది. వేసవి దృష్ట్యా ఏసీ బెర్తులకు డిమాండ్ పెరగడంతో థర్డ్ ఏసీ, సెకెండ్ ఏసీ బోగీల్లో బెర్తు లభించడం అసాధ్యమే.

వాటర్..'లో ప్రెషర్'

నగరంలోని మలక్‌పేట్ అఫ్జల్‌నగర్‌లో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటాయి. ఇళ్లలోని బోర్లన్నీ ఎండిపోయాయి. దీంతో కొందరు నల్లాలకు మోటార్లు బిగించి నీటిని తోడుకుంటున్నారు. ఫలితంగా మిగతా నల్లాలకు తక్కువ ఒత్తిడి (లో ప్రెషర్)తో నీటి సరఫరా జరుగుతోంది. దీంతో నివాసాలకు ఏమూలకు సరిపోని పరిస్థితి నెలకొంది. ఒక అఫ్జల్‌నగర్‌లోనే కాదు ఈ సమస్య.. నగరంలోని పలు కాలనీలు, బస్తీల్లోనూ ఇదే పరిస్థితి.

నగరంలో నల్లా నీటికి కటకట

- వేసవిలో పెరిగిన వినియోగం
- తగ్గుతున్న సరఫరా సమయం
- పడిపోతున్న భూగర్భజలాలు
- అడుగంటుతున్న బోర్లు..
- జటిలమవుతున్న తాగునీటి సమస్య

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో రోజు విడిచి రోజు సరఫరా చేసే నీటికి లోప్రెషర్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. మండుతున్న ఎండలతో నీటి వినియోగం బాగా పెరిగింది. కోటి జనాభా దాటిన నగరానికి నిర్దిష్ట సమయం ప్రకారం సరఫరా చేసే నీరు ఏ మాత్రం సరిపోవడం లేదు. భూగర్భజలాలు అడుగంటి ఇళ్లలోని బోర్లన్నీ ఎండిపోతున్నాయి. ఇప్పటివరకు జలమండలి సరఫరా చేసే నీరు, ఇళ్లలోని బోర్లతో గొంతు తడుపుకొన్న వారు ప్రస్తుతం గడ్డు పరిస్థితిలో ఉన్నారు. పలు బస్తీలు, కాలనీ వాసులు సరిపడా నీరు రాక ఇబ్బందులకు గురవుతుండగా.. ఎగువ ప్రాంతాల వాసులకు క్రమంగా నీటి సరఫరా పూర్తిగా తగ్గుముఖం పట్టింది. పలు కాలనీలకు, బస్తీలకు వాటర్ ట్యాంకర్లే దిక్కైనా.. వాటి సరఫరా కూడా అంతంత మాత్రంగా తయారైంది. రోజు రోజుకూ ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య మరింత జటిలమవుతోంది.

నగరంలోని పలు ప్రాంతాలకు లో ప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతోంది. కొన్ని నివాస సముదాయాల్లో నల్లాలకు అక్రమంగా మోటార్ వినియోగించడంతో పరిసర గృహాలకు లోప్రెషర్ సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా నగరంలోని మలక్‌పేట్, సలీంనగర్, తేజ్‌నగర్ కాలనీ, బంజారా బస్తీ, పశ్చిమ ప్రశాంత్‌నగర్, వాంబే కాలనీ, గడ్డిఅన్నారం, సంతోషనగర్ మాధవనగర్ కాలనీ, మారుతీ నగర్, కొత్తపేట్, న్యూ మారుతీనగర్, సత్యానగర్, ఎస్‌బీహెచ్ కాలనీ, న్యూ నాగోల్, మోహన్ నగర్ పరిధి, జనప్రియ అవెన్యూ, జనప్రియ క్వార్టర్స్, ఆర్టీసీ కాలనీ, భరత్‌నగర్, శివమ్మ నగర్, ముషీరాబాద్, భోలక్‌పూర్‌లోని మహాత్మా నగర్, ఇందిరానగర్, రాంనగర్ కూరగాయల మార్కెట్, కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్- 1, 2, వాజ్‌పేయి నగర్, దత్తాత్రేయ నగర్, అంబేడ్కర్‌నగర్, మాణిక్యానగర్ జగద్గిరిగుట్ట పరిధిలోని మగ్దూంనగర్, భగత్‌సింగ్ మార్గ్, గవర్నమెంట్ స్కూలు, కూకట్‌పల్లి, భాగ్యనగర్ సెక్షన్, కేపీహెచ్‌బీ సెక్షన్ల పరిధి, కాలనీల్లో తరచూ లోప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతోంది. కనీస అవసరాలకు కూడా నీళ్లు సరిపోవడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు.

ఇదీ అధికారుల లెక్క..

గ్రేటర్ పరిధిలో దినసరి 565 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా అవుతోందని జలమండలి లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. వేసవి దృష్ట్యా మే నెలాఖరు నాటికి అదనంగా మరో 42 మిలియన్ గ్యాలన్ల నీటిని అదనంగా సరఫరా చేసేవిధంగా చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో నగర పరిధిలో 22 ఎంజీడీలు, ఓఆర్‌ఆర్ లోపలి గ్రామాలకు 20 ఎంజీడీల నీరు సరఫరా చేయాలని నిర్ణయించి గత నెలలో అదనంగా 22 ఎంజీడీల నీరు సరఫరా చేసినట్లు పేర్కొంటున్నారు. ఈ నెలలో 12 ఎంజీడీ, మే నెలలో 8 ఎంజీడీల నీరు అదనపు సరఫరాకు ప్రణాళికలు రూపొంచినట్లు పేర్కొంటున్నారు. పెరిగిన వినియోగంతో సరఫరా జరుగుతున్న నీరు ఏ మూలకూ సరిపోని పరిస్థితి నెలకొంది

ఫిర్యాదుల వెల్లువ

నగరంలో వందలాది కాలనీల్లో నీటి సరఫరా అరకొరగా జరుగుతున్నట్లు జలమండలికి ఫిర్యాదుల తాకిడి పెరిగింది. ప్రధానంగా నీటి సరఫరా లోప్రెషర్, నిర్దిష్ట సమయంపై కూడా ఫిర్యాదులు అందుతున్నట్లు తెలుస్తోంది. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యపై దినసరి ఫిర్యాదుల సంఖ్య కూడా పెరగడం బట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



30 నుంచి 45 నిమిషాలే..

వేసవి ఎండలు ముదురుతుండటంతో నీటి వినియోగం పెరిగింది. రోజు విడిచి రోజు అందించే నీటి సరఫరా సమయం కూడా పలు ప్రాంతాల్లో తగ్గుముఖం పట్టింది. సాధారణంగా రెండు గంటల పాటు నీటి సరఫరా ఉంటుంది. తాజాగా పలు బస్తీల్లో కనీసం అరగంట నుంచి 45 నిమిషాల మించి సరఫరా కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొద్దిసేపే నీటిని విడుదల.. అదీ కూడా లో ప్రెషర్‌తో వస్తుండంతో సరిపోని పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 5 గంటలకే నీటిని వదులుతుండడం ఇబ్బందిగా తయారైంది. మరికొన్ని ప్రాంతాల్లో మిట్ట మధ్యాహ్నం, సమయపాలన లేకుండా ఇష్టానుసారం సరఫరా జరుగుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండి, శ్రీనివాసనగర్, బీదలబస్తీ, టీఆర్‌టీ కాలనీ, మేడిబావి, బ్రాహ్మణ బస్తీ, శ్రీనివాస్‌నగర్, మహ్మద్‌గూడ, శ్రీనివాస నగర్, షాబాద్‌గూడ, వారాసిగూడ, బౌద్ధనగర్, అంబానగర్, పార్సిగుట్ట, న్యూఅశోక్‌నగర్, లలితానగర్ తదితర ప్రాంతాల్లో అంతంత మాత్రమే నీటి సరఫరా అవుతోంది. న్యూఅశోక్‌నగర్, పార్సిగుట్ట, సంజీవపురం, మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ, మేడిబావి, బన్సీలాల్‌పేట్, సీసీ నగర్, భోలక్‌పూర్ మేకలమండి ప్రాంతంలో నీటి సరఫరా సరిగా లేక ఇబ్బందులు తప్పడం లేదు.

మొగిలయ్యకు ఎన్‌ఆర్‌ఐ చేయూత

లక్డీకాపూల్ : అనారోగ్యంతో బాధపడుతున్న బలగం మొగిలయ్యకు ప్రవాస భారతీయుడు సంజయ్, అతని స్నేహితులు ఆర్థిక సాయం అందజేశారు. మొగిలయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. మొగిలయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సంజీవ్ అతడికి చేయూత అందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో తన స్నేహితులతో కలిసి 1.05 లక్షలు సేకరించి కూకట్‌పల్లిలో ఉంటున్న సంజీవ్ తల్లి ఉమాదేవి ఖాతాలో జమ చేశారు. శుక్రవారం నిమ్స్ ఆస్పత్రికి వచ్చిన ఉమాదేవి మొగిలయ్యకు నగదు అందజేశారు. మొగిలయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఎంబీబీఎస్ సీటు పేరుతో వైద్యుడికి టోకరా

- తన కుమారుడి కోసం ప్రయత్నించిన అహ్మదాబాద్ వాసి
- ఫోన్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన సంస్థ సంప్రదింపులు
- రూ.30 లక్షలు చెల్లించిన తర్వాత మోసపోయినట్లు గుర్తింపు
- అక్కడి సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- నగరంలో ప్రత్యేక బృందం విచారణ

సాక్షి, సిటీబ్యూరో: నీట్‌లో ఆశించిన స్థాయిలో ర్యాంకు రాకపోవడంతో తన కుమారుడికి ఎంబీబీఎస్ సీటు కోసం ఆన్‌లైన్‌లో ప్రయత్నించిన అహ్మదాబాద్ వైద్యుడికి హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి టోకరా వేశాడు. ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ పేరుతో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపిన అతను రూ.30 లక్షలు కాజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కోసం గాలిస్తున్న ప్రత్యేక బృందం శుక్రవారం నగరానికి వచ్చి వెళ్లింది. అహ్మదాబాద్, ప్రహ్లాద్‌నగర్‌కు చెందిన డాక్టర్ జిగీష్ దేశాయ్ చాలా ఏళ్లుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. అయన కుమారుడు షేవస్ గత ఏడాది 12వ తరగతి పూర్తి చేసుకున్నాడు. ఇతడిని కూడా తన లాగే డాక్టర్ చేయాలని భావించిన జిగీష్ కుమారుడితో నీట్ పరీక్ష రాయించారు. ఆన్‌లైన్‌లో మెడిసిన్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్నా.. అవసరమైన స్థాయిలో ర్యాంకు రాకపోవడంతో మొదటి రెండు దశల కౌన్సెలింగ్‌లో అతడికి సీటు రాలేదు. అయితే దేశ వ్యాప్తంగా ఉన్న పలు ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీల నుంచి ఆయనకు ఫోన్లు రావడం మొదలైంది. తాము ఆయా వైద్య విద్యా కళాశాలలతో ఒప్పందాలు చేసుకున్నామని, మేనేజ్‌మెంట్, ఎన్నారై కోటాలో సీట్లు ఇప్పిస్తామని చెప్పారు. మరోపక్క జిగీష్ కూడా ఆన్‌లైన్‌లో మెడిసిన్ సీట్లు ఇప్పించే సంస్థల కోసం సెర్చ్ చేశాడు. గత ఏడాది మార్చి 5న హైదరాబాద్‌కు చెందిన ఓ కన్సల్టెన్సీ పేరుతో దాని మేనేజర్ జిగీష్‌కు కాల్ చేశారు. తమకు కర్ణాటకకు చెందిన వైద్య కళాశాలలతో ఒప్పందాలు ఉన్నట్లు చెప్పాడు. బెంగళూరుతో పాటు ఆ చుట్టుపక్కల ఉన్న ప్రముఖ కాలేజీల్లో సీటు ఇప్పిస్తామని చెప్పారు. మేనేజర్ నుంచి పదేపదే ఫోన్ కాల్స్ రావడంతో కర్ణాటకలో ఉన్న కాలేజీల విషయంపై దేశాయ్ ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశారు. ఈ నేపథ్యంలో అతను అక్కడి ఆకాష్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఎంచుకున్న అతను అందులోనే సీటు కావాలంటూ మేనేజర్‌ను కోరగా... అందులో అడ్మిషన్ కోసం రీ-రిజిస్ట్రేషన్ చేసుకుని హైదరాబాద్ రావాలని సూచించాడు. దీంతో నగరానికి వచ్చిన డాక్టర్ దేశాయ్ కన్సల్టెన్సీకి వెళ్లి మేనేజర్‌ను కలిశారు. బేరసారాల తర్వాత రూ.65 లక్షలకు మేనేజ్‌మెంట్ కోటాలో ఇప్పించేలా ఒప్పందం చేసుకున్నాడు. వివిధ దఫాలుగా మొత్తం రూ.30 లక్షలు తీసుకున్నారు. సదరు కాలేజీలో షేవస్‌కు సీటు లభించలేదు. ఎన్నిసార్లు కోరినా తమ డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన జిగీష్ దేశాయ్ ఈ ఏడాది ఫిబ్రవరి మూడో వారంలో అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అందులో భాగంగా ఓ ప్రత్యేక బృందం శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చి సదరు కన్సల్టెన్సీలో మేనేజర్ విషయంపై ఆరా తీసింది. అతడి ఆచూకీ లభించకపోవడంతో తిరిగి వెళ్లినట్లు సమాచారం. సదరు కన్సల్టెన్సీకి ఈ మోసంతో ఏమైనా సంబంధం ఉందా? అందులో పని చేస్తూ మేనేజర్ ఆ డబ్బు స్వాహా చేశాడా? అనే కోణంలో అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు


ప్రణయ్ (ఫైల్)

దుండిగల్: బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా, పద్మానగర్‌కు చెందిన మర్క ప్రణయ్(20) దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున అతను తన స్నేహితుడు అఖిల్‌తో కలిసి బైక్‌పై గండిమైసమ్మ నుంచి బహదూర్‌పల్లి వైపు వెళ్తున్నారు. అతి వేగం కారణంగా బహదూర్‌పల్లి హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న ప్రణయ్ ఎగిరి డివైడర్‌పై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అఖిల్ కాళ్లు విరిగాయి. బాధితులను సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా ప్రణయ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అఖిల్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

23 కిలోల గంజాయి స్వాధీనం

అల్వాల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 23 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేట్ బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు వివరాలు వెల్లడించారు. కానాజీగూడ గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీలో గురువారం రాత్రి ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి దాడి చేసిన అల్వాల్ పోలీసులు క్రిష్ణా జిల్లాకు చెందిన కనకం దుర్గాప్రసాద్, పాల్వంచకు చెందిన పెట్టం పవన్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మాదక ద్రవ్యాల విక్రయాలపై నిఘా పెంచామని, గంజాయి తదితర వస్తువులు విక్రయిస్తూ పోలీసులకు చిక్కితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఏసీపీ పేర్కొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రామలింగరాజు

20 నిమిషాల్లో స్నాచర్లను పట్టేశారు

బంజారాహిల్స్: గొలుసు దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు 20 నిమిషాల్లోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10, గాయత్రిహిల్స్‌కు చెందిన వెంకటేష్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో వెంకటగిరిలోని కేకే వైన్స్ షాప్ వద్ద బైక్‌ను ఆపి స్నేహితుడి కోసం వేచి చూస్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతడి మెడలో ఉన్న తులం బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. అప్రమత్తమైన బాధితుడు 11.45 గంటలకు డయల్ 100కు ఫోన్ చేశాడు. అదే సమయంలో డ్యూటీలో ఉన్న జూబ్లీహిల్స్ డీఐ డి.శ్రీనివాస్ సెట్‌లో స్నాచింగ్ విషయం తెలుసుకుని హుటాహుటిన ఎస్‌ఐ నర్సింగ్‌రావుతో కలిసి 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకున్నాడు. మార్గమధ్యంలోనే నైట్ డ్యూటీ ఎస్‌ఐ నాగరాజు, పెట్రోకార్ బ్లూకోట్స్ పోలీసులను అప్రమత్తం చేసి అన్ని రహదారుల్లో నిఘా ఉంచాలని ఆదేశించాడు. బాధితుడిని కారులో ఎక్కించుకుని శ్రీకృష్ణానగర్, యూసుఫ్‌గూడ, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో నిందితుల కోసం గాలించారు. స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు వ్యక్తులు తెల్లచొక్కాలు వేసుకుని ఉన్నట్లు చెప్పడంతో పోలీసులు తెల్లచొక్కాలు వేసుకున్న వారందరినీ పరిశీలించుకుంటూ వెళ్తుండగా శ్రీకృష్ణానగర్‌లోని ఓ పాన్ డబ్బా వద్ద ఇద్దరు వ్యక్తులు సిగరెట్ తాగుతూ కనిపించారు. పోలీసులను చూసి వారు పారిపోయేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన పోలీసులు 12.25 గంటలకు వారిని అదుపులోకి తీసుకున్నారు. 12.05 గంటలకు స్పాట్‌కు చేరుకున్న పోలీసులు సరిగ్గా 20 నిమిషాల్లోనే నిందితులను పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేశారు. నిందితుల వివరాలు తీయగా వీరిలో ఒకరు ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రంజిత్ అనే కారు డ్రైవర్ కాగా మరొకరు వెంకటగిరికి చెందిన షేక్ షర్ఫుద్దీన్‌గా గుర్తించారు. మద్యం కోసం గొలుసు దొంగతనం చేసినట్లుగా అంగీకరించారు. జూబ్లీహిల్స్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


నిందితులు రంజిత్, షేక్ షర్ఫుద్దీన్

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఘరానా దొంగ అరెస్ట్
- రూ. 5 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం


నిందితుడు శివరాత్రి ప్రభు

నాగోలు: రాత్రి వేళల్లో బైక్‌పై తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను ఎల్‌బీనగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ. 5 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..మేడ్చల్ జిల్లా, మరిపెల్లిగూడేనికి చెందిన శివరాత్రి ప్రభు కర్మన్‌ఘాట్, గ్రీన్ పార్క్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. వృత్తిరీత్యా కారు మెకానిక్ అయిన అతను కొద్దిరోజులు కారు డ్రైవర్‌గా కూడా పనిచేశాడు. చెడు అలవాట్లకు బానిసైన ప్రభు గత కొన్నేళ్లుగా దొంగతనాలకు పాల్పడుతున్నాడు. సరూర్‌నగర్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్, ఘట్‌కేసర్, గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని పలు ఇళ్లల్లో చోరీలు చేశాడు. పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలు తరలించగా, అక్కడ అతడికి అనూప్, అఫ్రోజ్‌లతో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక ముగ్గురు కలిసి పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో పంజా విసిరారు. ఈ నెల 9న ఎల్‌బీనగర్ పరిధిలోని సౌభాగ్యనగర్‌లో నివాసం ఉంటున్న భాస్కర్ ఇంటికి తాళం వేసి వరంగల్ వెళ్లాడు. 12న ఇంటికి తిరిగి వచ్చి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు మెయిన్ డోర్ తాళం పగలగొట్టి అల్మారాలో ఉన్న బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్, నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున శివరాత్రి ప్రభును అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. ఎల్‌బీనగర్, హయత్‌నగర్, సరూర్‌నగర్, చైతన్యపురి, విశాఖపట్నం, మహారాష్ట్రలోనూ చోరీలకు పాల్పడినట్లు తెలిపాడు. అతడి నుంచి 35 గ్రాముల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి, రూ. 1, 30 లక్షల నగదు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

యువకుడిపై హత్యాయత్నం

ఐదుగురు నిందితుల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

పహాడీషరీఫ్: భూ కబ్జా నేపథ్యంలో ఓ యువకుడిని హత్య చేసేందుకు యత్నించిన ఐదుగురు వ్యక్తులను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం ఏసీపీ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి చెరువు కట్ట దిగువన ఉన్న కాలనీలో ఉప్పుగూడ రక్షాపురం కాలనీకి చెందిన నేనావత్ రాజుకు 60 గజాల స్థలం ఉంది. ఈ స్థలంలో జంగమ్మెట్ రవీంద్రనాయక్ నగర్ కాలనీకి చెందిన తన బంధువు కేతావత్ మహేష్‌నాయక్‌తో కలిసి ఈ నెల 9న ఉదయం ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. భోజనం తెస్తానంటూ వెళ్లిన మహేష్ రాకపోవడంతో మధ్యాహ్నం భోజనం కోసం రాజు హోటల్‌కు వెళ్తుండగా ముత్యాలమ్మ ఆలయం వద్ద శ్రీరాం కాలనీకి చెందిన బుడిగపాటి అనిల్ కుమార్ తన స్నేహితులు అజయ్, రోహిత్ పాల్, పడిగ సాయిరెడ్డి, మహ్మద్ సమీర్‌లతో కలిసి అతడిని అడ్డుకున్నాడు. ఎందుకు ఇళ్లు కడుతున్నారంటూ ఇనుప రాడ్లతో రాజుపై దాడికి పాల్పడ్డారు. వారి బారి నుంచి తప్పించుకున్న బాధితుడు అక్కడి నుంచి పరారై ప్రాణాలు దక్కించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో బీజేవైఎం నేత అరెస్ట్


నిందితుడు రోహిత్ రుద్రాంగి

హిమాయత్‌నగర్: నడిరోడ్డుపై క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రోహిత్ రుద్రాంగిని సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.50వేల నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని, నిందితుడిని నారాయణగూడ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే..ముంబైకి చెందిన బుకీలు ఇచ్చిన 'రాధేఎక్స్చ్' ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా రోహిత్ రుద్రాంగి, కును అగర్వాల్ అనే వ్యక్తితో కలిసి బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తన సిబ్బందితో కలిసి గురువారం రాత్రి హైదర్‌గూడ పెట్రోల్ బంక్ వద్ద దాడి చేశారు. కన్ను అగర్వాల్ పరారుకాగా రోహిత్ రుద్రాంగి డబ్బుతో పట్టుబడ్డాడు. అతను అప్పటికే రూ.లక్షల్లో ఇతరులకు ఆన్‌లైన్ ద్వారా డబ్బు పంపినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. అతడి నుంచి రూ. 50 వేల నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అతడిని తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఐస్‌క్రీమ్ కంపెనీ సీజ్


తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు

మియాపూర్: కల్తీ ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు శుక్రవారం చందానగర్, జవహర్‌నగర్ రోడ్డులో ఉన్న బెస్ట్ ఐస్‌క్రీమ్ కంపెనీపై దాడులు నిర్వహించారు. పరిశ్రమలో శుభ్రత పాటించడం లేదని, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేదని, కల్తీ ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రఘు ఫిర్యాదు మేరకు చందానగర్ సర్కిల్ -21 ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హృదయ సదరు కంపెనీని పరిశీలించారు. కంపెనీలో శుభ్రత లేకపోవడం, మాన్యుఫాక్చర్ డేట్ కూడా వేయడం లేదని, ఐదేళ్లుగా లైసెన్స్ లేకుండానే కంపెనీని నిర్వహిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంపెనీలో ముడి సరుకును స్వాధీనం చేసుకుని ల్యాబ్‌కు పంపామని, కంపెనీ నిర్వాహకుడు శ్రీనివాస్‌రెడ్డి పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు భానుతేజ, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేటి నుంచి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లో రోడ్డు నెం.12లోని ఆయుర్మేఘ పునరుద్ధరణ కేంద్రం ఆధ్వర్యంలో వృద్ధులు, మహిళల కోసం ఈ నెల 15వ తేదీ నుంచి 22 వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కేంద్రం కేంద్రం వ్యవస్థాపకులు మూర్తి తెలిపారు. సంస్థ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత కన్సల్టేషన్, వైద్యసలహాలు, అన్ని పంచకర్మ చికిత్సలపై 20 శాతం తగ్గింపు ఉంటుందని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులపై నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు. వివరాలకు ఫోన్: 91549 76896లో సంప్రదించవచ్చన్నారు.

వైద్య శిబిరానికి మంచి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వెంగళరావునగర్: వికాస తరంగిణి ఈఎస్‌ఐ శాఖ ఆధ్వర్యంలో బేగంపేట మెడికోవర్ ఆస్పత్రి సహకారంతో శుక్రవారం ఈఎస్‌ఐ సమీపంలోని శ్రీవిజయలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తుల నుంచి మంచి స్పందన లభించింది. ఆలయ పూజారి గట్టు రంగాచారి స్వామి పుట్టిన రోజు సందర్భంగా వైద్య శిబిరాన్ని నిర్వహించామని వైద్యులు, వికాస తరంగిణి ప్రతినిధులు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. వికాస తరంగిణి చైర్మన్ మురళీకృష్ణ, ప్రముఖ సామాజికవేత్త, ఆరోగ్య సంచాలకులు మధుబాబు, ఆలయ కమిటీ కార్యదర్శి జనార్ధన్, మేనేజర్ మల్లేష్ తదితరులు వైద్య శిబిరంలో తమ సహాయ సహకారాలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

21 నుంచి రైస్‌బ్రాన్ ఆయిల్‌పై అంతర్జాతీయ సదస్సు

సనత్‌నగర్: రైస్ బ్రాన్ ఆయిల్‌పై ఈ నెల 21 నుంచి 23 వరకు ఏడో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రైస్ బ్రాన్ ఆయిల్ (ఐఏఆర్‌బీఓ), ద సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఈఏ) సంయుక్తంగా నగరంలోని మారియట్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ సదస్సు నిర్వహించనున్నాయి. ఆసమ్ రైస్ బ్రాన్ ఆయిల్ ఫర్ సస్టెయినబుల్ ఎకో సిస్టమ్ (స్థిరమైన పర్యావరణ వ్యవస్థ కోసం అద్భుతమైన రైస్ బ్రాన్ ఆయిల్) థీమ్‌తో ఈ సదస్సు కొనసాగించనున్నట్లు ఎస్‌ఈఏ ఇండియా అధ్యక్షులు అజయ్‌ఝున్‌ఝువాలా, ఐఏఆర్‌బీఓ సెక్రటరీ జనరల్, ఎస్‌ఏఈ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీవీ మెహతాలు ఓ ప్రకటనలో తెలిపారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు ఎనలేనివి: మంత్రి తలసాని



రాంగోపాల్‌పేట్: అగ్నిమాపక సిబ్బంది సేవలు వెలకట్టలేనివని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్‌లో జరిగిన అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమానికి హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక పరికరాలను ఆయన పరిశీలించి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన వేణు

చిలకలగూడ : మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ హరీష్ తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండికి చెందిన అలకపల్లి వేణు (47) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నినెలలగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈనెల 13న బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య సంధ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యవకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: అప్పులబాధ తాళలేక రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా జీడిపల్లికి చెందిన ఎర్ర నర్సింగరావు (21) ప్రైవేటు ఉద్యోగి. తాగుడుకు బానిసైన నర్సింగరావు తనకు సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లితండ్రుతో గొడవ పడ్డాడు. వారు నిరాకరించడంతో మేడ్చల్–మనోహరాబాద్ రైల్వేస్టేషన్ల మధ్యకు చేరుకుని రైలుకిందపడి ఆత్యహత్య చేసుకుని మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్‌కు నీరాజనం





ప్రేమ్‌నగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో కేక్ కట్‌చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ఫిలింనగర్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్...



అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో...

- వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ జయంతి
- బాబాసాహెబ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి
- పలు ప్రాంతాల్లో సేవాకార్యక్రమాల నిర్వహణ

బంజారాహిల్స్: కుల, మత, లింగ, ప్రాంత, వర్ణ, వర్గ, వ్యత్యాసలేని ప్రజాస్వామ్య ప్రవక్త, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే ప్రజలు చైతన్యవంతులై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించిన భారత రాజ్యాంగ నిర్మాత రాజనీతిజ్ఞుడు, ప్రజాస్వామ్య స్వాప్నికుడు, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు శుక్రవారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని గల్లీ, గల్లీ అంబేడ్కర్‌కు నీరాజనాలు పలికాయి. జాతికి ఆయన చేసిన సేవలను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గుర్తు చేసుకున్నారు. ప్రతాప్‌నగర్‌లో టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో యువసేన అధ్యక్షుడు నల్ల శివ మాదిగ 400 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు జనం పూల మాలలు వేసి నీరాజనాలు పట్టారు.

లిబర్టీ వద్ద ప్రముఖుల నివాళి...

లిబర్టీ: లిబర్టీ సమీపాన ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. మంత్రుల కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజుసాగర్, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో...

వెంగళరావునగర్: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సమాజ సేవకుడు వినయ్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ దేదీప్య విజయ్ ప్రారంభించారు. వెంగళరావునగర్ ప్రధాన రహదారిలో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీ నరసింహనగర్‌లో భారతీయ జనతాపార్టీ జాతీయ మహిళామోర్చా కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివమాదిగ



ఫిలింనగర్‌లో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి



ప్రతాప్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్



సుదదేవ్‌నగర్ బస్తీలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి



ప్రేమ్‌నగర్‌లో అంబేడ్కర్, రమాబాయి వేషధారణలో చిన్నారులు



జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



ఎస్పీఆర్‌హిల్స్‌లో...



తుమ్మలబస్తీలోని కార్పొరేటర్ విజయారెడ్డి...



బషీర్‌బాగ్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి...



దెక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్...



నివాళులస్తున్న ఆప్ కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ కుమారస్వామి



కల్యాణ్‌నగర్‌లో కార్పొరేటర్ దేదీప్య విజయ్...



వెంగళరావునగర్‌లో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి



రహమత్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి గజ మాల వేస్తున్న నవీన్‌యాదవ్



ఎల్లారెడ్డిగూడలో అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకురాలు కీర్తిరెడ్డి జూటూరు



దళిత బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



నివాళులర్పిస్తున్న బీజేపీ నేత డాక్టర్ పద్మ వీరపనేని

కుమార్తెను రక్షించి మృత్యుఒడికి తల్లి!

- ఇటీవల ఒంటికి నిప్పు అంటుకుని తీవ్రంగా గాయపడ్డ మహిళ
- ఏడాదిన్నర కుమార్తెను రక్షించే క్రమంలో తల్లికి అంటుకున్న మంటలు
- పూజ గదిలోని దీపం అంటుకుని ఘటన

హిమాయత్‌నగర్: అల్లారుముద్దుగా పెరుగుతున్న కుమార్తెకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ఆ దృశాన్ని చూసిన ఆ తల్లి తల్లడిల్లింది. వాటిని ఆర్పేసి కుమార్తెను ఒడిలోకి తీసుకుంది. చిన్న నిప్పురవ్వ పెద్దగా ఎగిసిపడి ఆ తల్లిని మృత్యువు రూపంలో కబళించింది. శరీరానికి మంటలు వ్యాపించడంతో బిగ్గరగా కేకలు వేయగా ఇరుగుపొరుగు వారు వచ్చి ఆ తల్లిని ఆస్పత్రిలో చేర్పించారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాగృతి కాలేజీ సమీపంలో ఈ నెల 8న ఈ సంఘటన చోటు చేసుకుంది. 70 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న ఆ తల్లి శుక్రవారం ఉదయం చనువు చాలించడంతో ఆ ఇంటిలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలివీ... బీదర్ జిల్లా అంబదాబాద్ గ్రామానికి చెందిన మోరె విజయ్, మోరే నిఖిత(22)లకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 16 నెలల చిన్నారి గౌరి ఉంది. రెండున్నర సంత్సరాలుగా జాగృతి కాలేజీ సమీపంలో వీరు నివాసం ఉంటున్నారు. వృత్తిరీత్యా విజయ్ హైటెక్ సిటీలో పని చేస్తుండగా నిఖిత ఇంటివద్దనే ఉంటూ చిన్నారి ఆలనాపాలన చూసుకుంటుంది. ఈ నెల 8న నిఖిత కిచెన్‌లో పనిచేస్తుండగా చిన్నారి గౌరి పాకుతూ పూజ గదిలోకి వెళ్లి దీపాన్ని తాకడంతో చేయి కాలింది. దీంతో చిన్నారి ఏడుస్తుండటంతో గదిలోకి వెళ్లిన నిఖిత ఆ మంటను ఆర్పేసి చిన్నారి ఒడిలోకి తీసుకుంది. ఇద్దరూ కలసి బయటకు వస్తున్న సమయంలో కిందపడ్డ దీపం అక్కడున్న ఇతర వస్తువులకు అంటుకుని మంటలు వ్యాపించాయి. ఆ మంటలు నిఖిత చీరకు అంటుకోగా.. పరిగెత్తుతూ కుమార్తెను వేరే రూమ్‌లో పెట్టి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించింది. అప్పటికే శరీరం 70 శాతంకు పైగా కాలింది. నిఖిత అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు వచ్చి అంబులెన్స్ సాయంతో ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నిఖిత శుక్రవారం తనువు చాలించింది.

నిత్య జనగణమన

నల్లకుంట: నిత్య జనగణమన కార్యక్రమాన్ని బీజేపీ అంబర్‌పేట ఎస్సీ మోర్చా కన్వీనర్ శివకుమార్ ప్రారంభించారు. నిర్వాహకులు నేలంటి మధు, అతిథులు నల్లవెల్లి విజయేందర్ రెడ్డి, మల్లాది భిక్షపతియాదవ్, మల్లాది క్రాంతి తదితరులతో కలిసి శివకుమార్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ర

16న త్రోబాల్ ఎంపిక పోటీలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర త్రో బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లోని బ్లూ బెల్స్ హైస్కూల్‌లో 33వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలురు, బాలికలకు త్రో బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓదెలు యాదవ్ తెలిపారు. పోటీలో పాల్గొనేవారు 2004 ఏప్రిల్ 15 తర్వాత జన్మించిన వారు అర్హులు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ సమీపంలోని శ్రీకృష్ణానగర్‌లో నిబంధనల విరుద్ధంగా పోలీసుల కళ్లుగప్పి హుక్కా సరఫరా చేస్తున్న కేంద్రంపై బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా మూడు హుక్కా పాట్స్‌తో పాటు హుక్కా తీసుకుంటున్న అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. కొంత కాలంగా శ్రీకృష్ణానగర్‌లో మహ్మద్ అమన్, సాయికృష్ణ అనే ఇద్దరు యువకులు హుక్కా సెంటర్ అడ్డదారుల్లో నడిపిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ హరీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఈ సెంటర్‌పై దాడి చేయగా అయిదుగురు హుక్కా పీలుస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి హుక్కా సామగ్రిని సీజ్ చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీ మిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 20, దొండ 21, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 16, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 50, మొరంగడ్డ 16, కందగడ్డ 45, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 3–5.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తి ముందస్తు అరెస్టు



చింటును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

బంజారాహిల్స్: ఒక వర్గంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఎస్పీఆర్‌హిల్స్ గ్రౌండ్‌లో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకున్న చింటూ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసే క్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. గతంలో ఎస్ఆర్‌నగర్ పరిధిలో ఒక వర్గాన్ని ఉద్దేశించి చింటు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు పలు సెక్షన్ల కింద ఆయనకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ముందస్తు అరెస్ట్ చేసినట్లు జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం



లక్డీకాపూల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ సూచించిన మార్గం ప్రతి ఒక్కరూ అనుసరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం నిమ్స్‌లో డాక్టర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఎంఎస్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, హెచ్ఓడీ పరంజ్యోతి, నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, నిమ్స్ పారామెడికల్ యూనియన్ ప్రెసిడెంట్ శాంతకుమారి, నిమ్స్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పి.సుశీలకుమారి, ప్రధాన కార్యదర్శి బి.శేఖర్, దాసరి గోవింద్, విద్యాసాగర్, ప్రశాంత్, రమణమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...


చిట్టి తల్లులకు 'స్వేచ్ఛ'

సాక్షి, అమరావతి : రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళా సాధికారతలో ఏపీ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. రేపటి పౌరులైన కిశోర బాలికల ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. సమర్థవంతంగా మెన్స్ట్రువల్ హైజీన్ (బహిష్టు సమయంలో పరిశుభ్రత) కార్యక్రమాల అమలులో కూడా రాష్ట్రం రెండో స్థానంలో ఉంటోంది. ఈ అంశాన్ని ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. నెలసరి సమయంలో స్కూళ్లు, కళాశాలల్లో చదివే విద్యార్థినులు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 'స్వేచ్ఛ' కార్యక్రమం ద్వారా శానిటరీ న్యాప్‌కిన్లను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. 2021–22లో 1.48 కోట్ల శానిటరీ నాప్‌కిన్ల పంపిణీతో తమిళనాడు దేశంలో మొదటి స్థానంలో ఉండగా, 1.16 కోట్లతో ఏపీ రెండో స్థానంలో ఉంది. అనంతరం 58.27 లక్షలతో ఒడిశా మూడో స్థానంలో నిలిచింది.

తప్పు చేసిన పోలీసులను బొక్కలో వేస్తాం: బాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/నూజివీడు: 'పోలీసులకు సంస్కారం నేనే నేర్పించా.. మీపై సైకో ఆఫీసర్ల పెత్తనం ఎక్కువగా ఉంది. కొంత మంది తప్పులు చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి కేసునూ సమీక్షించి తప్పు చేసిన పోలీసులను బొక్కలో వేస్తాం'అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు హెచ్చరించారు. శుక్ర వారం రాత్రి 'ఇదేమి కర్మ–మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా నూజివీడులో రోడ్‌షో నిర్వహించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి అంతా తాను చేసిందేనని చెప్పుకొచ్చారు.

సైంటిఫిక్ సెయింట్ గురువిశ్వస్ఫూర్తి ఇక లేరు



పెనుగంచిప్రోలు: ఆధ్యాత్మిక గురువు, సైంటిఫిక్ సెయింట్ గురు విశ్వస్ఫూర్తి (83) ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో గురువారం రాత్రి మరణించారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం ఎన్టీఆర్ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలు గ్రామంలో వేలాది మంది భక్తుల ఓంకార నాదం, మూల మంత్రోచ్ఛరణల మధ్య స్ఫూర్తి ఓం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగాయి. గురుదేవుల కోరిక మేరకు శుక్రవారం ఉదయం ఆయన పార్థివ దేహాన్ని విజయవాడ నుంచి పెనుగంచిప్రోలు తంబరేణి గార్డెన్స్‌కు తీసుకొచ్చారు. కడసారి ఆయన పార్థివ దేహాన్ని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

రాష్ట్ర డిస్కంలకు అప్పుల షాక్!

ఆస్తులతో పోల్చితే 150 శాతానికిపైగా మించిన అప్పులు

- ఏటేటా పెరిగిపోతున్న నష్టాలతో దివాలా బాటలో పయనం
- ఆర్థిక లోటు, నిర్వహణ వ్యయం కొరతతో రుణాలే గతి
- వార్షిక రేటింగ్స్ నివేదికలో వెల్లడించిన కేంద్రం
- బిల్లులు, బకాయిల వసూళ్లు మెరుగుపడాలని సూచన



■ రెండింటి పనితీరు మెరుగుపడాలి

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల అప్పులు కొండల్లా పేరుకుపోతున్నాయి. ఆర్థిక లోటు, నిర్వహణ మూలధన వ్యయం కొరత కారణంగా ఏటా మరింతగా అప్పులు చేస్తున్నాయి. దీంతో 2019–20లో రూ.5.01 లక్షల కోట్లుగా డిస్కంల అప్పులు.. 2021–22 నాటికి రూ.6.2లక్షల కోట్లకు (24%వృద్ధి) ఎగబాకాయి. చాలా రాష్ట్రాల్లో డిస్కంల ఆస్తులతో పోల్చితే వాటి అప్పులు 100 శాతానికి మించిపోయి దివాలా బాటపట్టాయి. అందులో తెలంగాణ సహా మరో మూడు రాష్ట్రాల్లోని డిస్కంల అప్పులు ఆస్తుల కంటే 150శాతానికి మించిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. కేంద్ర విద్యుత్ శాఖ తాజాగా ప్రకటించిన డిస్కంల 11వ వార్షిక రేటింగ్స్, ర్యాంకింగ్స్ నివేదిక ఈ అంశాలను బహిర్గతం చేసింది. విద్యుత్ సబ్సిడీల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వాల జాప్యం, బిల్లుల వసూళ్లలో అలస్యంతో డిస్కంలు అప్పులు చేయకతప్పడం లేదని ఈ నివేదిక పేర్కొంది. డిస్కంల ఆర్థిక పునర్వ్యవస్థీకరణకు గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన ఉజ్వల్ డిస్కం యోజన (ఉదయ్) పథకం కింద డిస్కంల రుణాలను రాష్ట్ర ప్రభుత్వాలు టేకోవర్ చేసుకోవడంతో కొంత భారం తగ్గిందని తెలిపింది.

రాష్ట్రంలోని ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల (టీఎస్ఎన్పీడీసీఎల్/ టీఎస్ఎస్పీడీసీఎల్)ల పనితీరు, ఆర్థిక పరిస్థితిపై ఈ నివేదికలో కేంద్ర విద్యుత్ శాఖ కీలక వ్యాఖ్యలు చేసింది. రెండు డిస్కంలు కూడా ఇంధన వ్యయం పెరుగుదల భారాన్ని వినియోగదారులపై ఎప్పటికప్పుడు ఆటోమేటిగ్గా బదిలీ చేయాలని.. డిస్కంల నష్టాలను ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని సూచించింది. రాష్ట్ర ఈఆర్సీ ట్రూఅప్ ఆర్డర్ 2020–21ను జారీ చేయాలని, ఉద్యోగుల వ్యయ భారాన్ని సంస్థ తగ్గించుకోవాలని స్పష్టం చేసింది.

■ నష్టాల్లో కూరుకుపోయిన ఉత్తర డిస్కం

- ఉత్తర తెలంగాణలోని 17 జిల్లాల పరిధిలో 63,48,874 మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఎన్పీడీసీఎల్.. దేశంలోని 51 డిస్కంలలో 47వ స్థానంలో నిలిచింది. దీనికి 2020–21లో రూ.204 కోట్ల నష్టాలు వచ్చాయి.
- ఒక్కో యూనిట్ విద్యుత్ సరఫరా అంచనా వ్యయం, వాస్తవ వ్యయం మధ్య తేడా 2020–21లో 0.68 పైసలుకాగా.. 2021–22లో రూ.1.52కి పెరిగింది. అంటే సరఫరా చేసిన ప్రతి యూనిట్ విద్యుత్‌పై నష్టాలు గణనీయంగా పెరిగాయి.
- సాంకేతిక, వాణిజ్య నష్టాలు (ఏటీఅండ్‌సీ) 2020–21లో 9శాతం ఉండగా.. 2021–22లో ఏకంగా 14.1 శాతానికి ఎగబాకాయి.
- వినియోగదారుల నుంచి కరెంట్ బిల్లులను 60 రోజుల్లోగా వసూలు చేసుకోవాల్సి ఉండగా.. ఈ డిస్కం పరిధిలో సగటున 267 రోజులు పడుతోంది.
- గత మూడేళ్లలో ప్రభుత్వానికి సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి ఏకంగా 40శాతం బిల్లులు వసూలు కాలేదు.

దక్షిణ డిస్కంపై బకాయిల బండ

- దక్షిణ తెలంగాణలోని 1,04,36,589 మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఎస్పీడీసీఎల్.. దేశంలోని 51 డిస్కంలలో 43వ ర్యాంకు సాధించింది. 2020–21లో రూ.627 కోట్ల నష్టాలను మూటగట్టుకుంది.
- సరఫరా చేసిన ప్రతి యూనిట్ విద్యుత్‌పై రూ.1.40 నష్టం వస్తోంది.
- జెన్‌కోలకు సంస్థ బిల్లుల చెల్లింపులకు 375 రోజులను తీసుకుంటోందని.. దీనిని 45 రోజులకు తగ్గించుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది.
- వినియోగదారుల నుంచి కరెంట్ బిల్లుల వసూళ్లకు 130 రోజులు తీసుకుంటోంది.
- గత మూడేళ్లలో ప్రభుత్వానికి సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి 25శాతం బిల్లులు వసూలు కాలేదు.



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రులు, నాయకులు

అంబేడ్కర్‌కు సీఎం జగన్ నివాళి

సాక్షి, అమరావతి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నివాళులు అర్పించారు. తాడేపల్లిలోని సీఎం జగన్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పినిపే విశ్వరూప్, ఆదిమూలపు సురేశ్, బాపట్ల ఎంపీ నందిగం సురేశ్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్ పాల్గొన్నారు.

అత్యుత్తమ బీమా పథకం 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'

- 'ఇన్నోవేషన్ కేటగిరీ'లో ఏపీకి ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని అందించిన కేంద్రం
- ఏపీ స్ఫూర్తితో జాతీయ స్థాయిలో ఫసల్ బీమాలో మార్పులు చేసినట్లు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని దేశంలోనే అత్యుత్తమ పంటల బీమా పథకంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ – క్రాప్ ప్రామాణికంగా యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ప్రకటించింది. రైతులపై పైసా కూడా భారం పడకుండా నోటిఫైడ్ పంటలకు 100% బీమా కల్పిస్తున్న రాష్ట్రమని ఏపీపై ప్రశంసలు కురిపించింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)పై ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో గురువారం ప్రారంభమైన జాతీయ స్థాయి వర్క్‌షాపులో 'ఇన్నోవేషన్ కేటగిరి' కింద ఉత్తమ బీమా పథకంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ఎంపిక చేశారు. ఈమేరకు కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా చేతుల మీదుగా రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను స్ఫూర్తిగా తీసుకుని జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో పలు మార్పులు చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా వెల్లడించారు. పంటల బీమా అమలులో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వర్క్‌షాప్‌లో ఆయన ప్రశంసించారు.

'గిరిజన సలహా మండలి' జాడేది!

- మూడేళ్లుగా భేటీకి నోచుకోని ట్రైబల్ అడ్వయిజరీ కమిటీ
- గిరిజన ప్రాంతాల్లో సంక్షేమ కార్యక్రమాలపై లోపించిన నిఘా

సాక్షి, హైదరాబాద్: గిరిజనులు, ఆదివాసీలు, షెడ్యూల్డ్ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిపై లోతైన ఆలోచనలు, కీలక నిర్ణయాలు తీసుకునే అధికారం ఉన్న 'గిరిజన సలహా మండలి(ట్రైబల్ అడ్వయిజరీ కమిటీ) మూడేళ్లుగా ఉలుకూపలుకూలేదు. ప్రతి ఆర్నెల్లకోసారి తప్పకుండా ఈ కమిటీ సమావేశమై గిరిజన సంబంధిత అంశాలను సమీక్షించడం, ప్రభుత్వానికి సలహాలు, సూచనలు, వివిధ రకాల ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. దీంతోపాటు ఐటీడీఏ(సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ)లకు సంబంధించిన పరిపాలన నివేదికలకు ఈ కమిటీ ఆమోదం తప్పనిసరి. 2020 జనవరిలో చివరిసారిగా ఈ కమిటీ సమావేశమైంది. ఇంతటి కీలక బాధ్యతలున్న ఈ కమిటీ మూడేళ్లుగా భేటీ కాకపోవడంతో ఐటీడీఏల పరిపాలన నివేదికలు ఏమవుతున్నాయి? గిరిజన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సంగతి ఎలా ఉంది? గిరిజనులు, ఆదివాసీల అభ్యున్నతికి చేసిన సూచనలు, సలహాలు ఏమవుతున్నాయో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది.

టీఏసీపై గిరిజన సంక్షేమశాఖ శీతకన్ను

ట్రైబల్ అడ్వయిజరీ కమిటీని సమన్వయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖదే. అన్ని ప్రభుత్వశాఖల హెచ్‌వోడీలతోపాటు ప్రభుత్వ కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధానకార్యదర్శులకు సమాచారం ఇచ్చి టీఏసీ నిర్వహించేందుకు ఈ శాఖ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, సమావేశాల నిర్వహణకు ఆ శాఖ ఉత్సాహం చూపినట్లు లేదు. సమావేశం గురించి కనీసం కమిటీ చైర్మన్, సభ్యులతో చర్చించిన దాఖలాల్లేవని తెలుస్తోంది. మూడేళ్లుగా సమావేశం నిర్వహించకపోవడంతో గత కార్యక్రమాల పురోగతి, లక్ష్యాలు, సాధన తదితరాల జాడ లేకుండా పోయింది. వాటిపై నిఘా కరువైంది.

వివేకా హత్య కేసులో ఉదయ్‌కుమార్‌రెడ్డి అరెస్టు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో పులివెందులకు చెందిన యూసీఐఎల్ ఉద్యోగి గజ్జెల ఉదయ్‌కుమార్‌రెడ్డిని సీబీఐ అధికారులు శుక్రవారం ఉదయం అరెస్టు చేశారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారి రాంసింగ్ (ఐవో)ను మార్చి ఆయన స్థానంలో సీబీఐ డీఐజీ చౌరాసియా, ఐవోగా ఎస్పీ వికాస్ సింగ్‌తోపాటు మరికొందరు అధికారులను నియమించిన విషయం తెలిసిందే. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో సీబీఐ అధికారులు పట్టణంలోని ఉదయ్‌కుమార్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఆయనకు నోటీసు ఇచ్చారు. ఆయన్ని, ఆయన తండ్రి జయప్రకాష్‌రెడ్డిని రెండు వాహనాల్లో పులివెందుల శివారుకు తీసుకెళ్లారు. అక్కడ జయప్రకాష్‌రెడ్డిని దించేసి, కడప సెంట్రల్ జైలులో ఉన్న సీబీఐ కార్యాలయానికి రావాలని చెప్పారు. ఉదయ్‌కుమార్‌రెడ్డిని కడపలోని సీబీఐ కార్యాలయానికి తీసుకెళ్లారు.

జయప్రకాష్‌రెడ్డి లాయర్‌తో కలిసి ఉదయం 9 గంటల ప్రాంతంలో సీబీఐ ఆఫీసుకు చేరుకోగా.. ఉదయ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేస్తున్నట్లు మెమోను ఆయనకు ఇచ్చారు. సాయంత్రం 4 గంటల సమయంలో పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సీఐ రాజుకు కూడా ఉదయ్‌కుమార్‌రెడ్డి అరెస్టు మెమో ఇచ్చారు. కాగా, వివేకా హత్య కేసుకు సంబంధించి తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలని తనను వేధిస్తున్నారని గతంలో సీబీఐ అధికారి రాంసింగ్‌పై ఉదయ్‌కుమార్ రెడ్డి కేసు పెట్టిన విషయం తెలిసిందే.

నగర వార్తలు

నగరంలో మరో నాలుగు జోయాలుక్కాస్ షోరూమ్‌లు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ జువెల్లరీ బ్రాండ్ జోయాలుక్కాస్ హైదరాబాద్‌లో మరో నాలుగు షోరూమ్‌లను ప్రారంభించనుంది. ఎన్నో డిజైన్లు, వెరైటీల బంగారం ఆభరణాలతో కస్టమర్లను కట్టిపడేస్తున్న జోయాలుక్కాస్.. మెహిదీపట్నం, సుచిత్ర, చార్మినార్, చందానగర్‌లలో ప్రీమియం షో రూమ్‌లను ప్రారంభించనున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 16న ఉదయం 11:30 గంటలకు మెహిదీపట్నంలో, సాయంత్రం 5 గంటలకు సుచిత్రలో అలాగే ఈ నెల 17న ఉదయం 11:30 గంటలకు చార్మినార్ లో, సాయంత్రం 5 గంటలకు చందానగర్‌లలో షో రూమ్‌లను ప్రారంభించనున్నట్లు పేర్కొంది.

ఇళ్లను ముంచెత్తిన వరద

- పలువురిని రక్షించిన డీఆర్‌ఎఫ్ టీమ్



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని న్యూ అంబేడ్కర్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వంతెన (బ్రిడ్జి) పనుల వల్ల ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నాలా నీటిని పక్క నుంచి డైవర్ట్ చేశారు. దీంతో గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఎగువ ప్రాంతా నుంచి వచ్చిన నాలా వరద నీరు రివర్స్ కావడంతో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సమీపాన అంబేడ్కర్ నగర్‌లోని దాదాపు 10 ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో ఇళ్లలోని బియ్యం, నిత్యావసర వస్తువులు పాడయ్యాయి. మోకాలి లోతు నీరు చేరింది. ఈ సమాచారం అందుకున్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) టీం సభ్యులు లైఫ్ జాకెట్లు ధరించి ఇళ్లలో చిక్కుకున్న ధనమ్మ, వెంకటమ్మ, చెల్లయ్య, మల్లేష్, అంజయ్య, నరేందర్, సాగర్, రాంచందర్ దివ్యాంగురాలు లక్ష్మీలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఎక్కువగా అద్దెకు ఉండేవారు ఉండటంతో ఇళ్లకు తాళాలు వేసి సమీపాన ఉన్న కమ్యూనిటీ హాల్‌కు వారిని తరలించారు.



రాజ్యాంగ స్ఫూర్తితో నడుచుకోవడమే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి

- సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జ్ రేణుక యారా



నివాళులర్పిస్తున్న చీఫ్ జడ్జ్ రేణుక యారా

సాక్షి, సిటీబ్యూరో: ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తితో ప్రాథమిక హక్కులను గౌరవించడమే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు ఘనమైన నివాళి అని సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జ్, హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుక యారా తెలిపారు. పురాణ హవేలీలోని సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 132వ జయంతి కార్యక్రమంలో చీఫ్ జడ్జ్ రేణుకయారా పూలమాలతో అంజలి ఘటించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై అవగాహన పెంచుకోవడంతో పాటు మన హక్కులకు ఉన్న పరిమితులను గుర్తుంచుకోవాలన్నారు. ప్రాథమిక బాధ్యతలు విస్మరించి కేవలం హక్కుల కోసం మాట్లాడటం, లేదా హక్కులను విస్మరించి బాధ్యతలను గుర్తు చేయటం రెండూ సరికాదని అభిప్రాయపడ్డారు. హక్కులు, బాధ్యతలను సమన్వయంతో ముందుకు వెళ్లడమే నిజమైన రాజ్యాంగ స్ఫూర్తి అని వివరించారు. ఇతర దేశ రాజ్యాంగాలతో పోల్చి చూస్తే మన రాజ్యాంగం ఎంతో విశిష్టమైనదని అదనపు జిల్లా జడ్జి, కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పట్టాభి రామారావు పేర్కొన్నారు. వివక్షత లేని సమాజం కోసం అసమానతలను తొలగించటం కోసం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగంలో అనేక అధికరణలను రూపొందించారని రెండవ అదనపు చీఫ్ జడ్జ్ కాళ్లూరి ప్రభాకర్ రావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ కె.మురళీమోహన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్ కుమార్, హైకోర్టు న్యాయవాది బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ మానవాళికి స్ఫూర్తి

చిక్కడపల్లి: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాహిత్యం.. సిద్ధాంతాలు కేవలం ఒక దేశం, వర్గం ప్రజలకు పరిమితం కాదని ప్రపంచ మానవాళి అంతటికీ స్ఫూర్తి అని రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ విశ్రాంత ముఖ్య కమిషనర్ బుద్ధా మురళి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్ధా మురళి మాట్లాడుతూ... అంబేడ్కర్ రాజ్యాంగంలో చిన్న రాష్ట్రాల ఆవశ్యకతను స్పష్టం చేసిన నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. అందుకే రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టారన్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, కొల్లి నాగేశ్వర్‌రావు, మూలవాసి ఉద్యమకవి మాస్టర్జీ పాల్గొన్నారు.

అందరివాడు అంబేడ్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అందరివాడు అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ సమితి చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టి విజయ్ కుమార్‌గౌడ్, కన్వీనర్ ఐలి వెంకన్నగౌడ్, ఎం.వి. రమణ అన్నారు. శుక్రవారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అంటరానివాడు అన్న సమాజమే నేడు అంబేడ్కర్‌ను అందరివాడు అని అంటున్నదని ఇది దేశం గర్వించదగ్గ పరిణామం అని స్పష్టం చేశారు. సమాజంలోని అసమానతలను రూపుమాపి అణగారిన వర్గాలకు ఆత్మగౌరవాన్ని కల్పించిన మహానుభావుడు అంబేడ్కర్ అన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు.



నివాళులర్పిస్తున్న సమితి చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్ తదితరులు

కేన్సర్‌పై అవగాహన వాక్

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద మహీంద్రా యూనివర్సిటీ అవుట్ రీచ్ క్లబ్ ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన వాక్ శుక్రవారం జరిగింది. క్యానథాన్ పేరుతో నిర్వహించిన ఈ అవగాహన నడకను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాకతో పాటు బసవతారకం కేన్సర్ ఆస్పత్రి సీఈవో ప్రభాకర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో అవుట్‌రీచ్ క్లబ్ అధ్యక్షురాలు సుహితతో పాటు 250 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ద్వారా ఈ మహమ్మారిని జయించవచ్చనే నినాదాలతో నడకను కొనసాగించారు.



శోభానాయుడితో కూచిపూడి నాట్యానికి శోభ



పురస్కార గ్రహీత కన్నారావుతో జొన్నలగడ్డ అనూరాధ తదితరులు

చిక్కడపల్లి: కూచిపూడి నాట్యమంటే అందరికీ తెలిసిన పేరు శోభానాయుడు అని... ఆ కళకే ఆమె శోభ తెచ్చారని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నృత్యశాఖ ఆచార్యులు డాక్టర్ జొన్నలగడ్డ అనూరాధ కొనియాడారు. శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై శోభానాయుడు శిష్యులు సుజాతామూర్తి, లావణ్య, ఉషాకిరణ్, భాస్కర్, పూర్ణ తదితరుల కలసి పద్మశ్రీ డాక్టర్ శోభానాయుడు జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ అనూరాధ నాట్య రూపకల్పన చేసిన వందే యాదగిరి నారసింహ అంశాన్ని అపర్ణ, వైష్ణవి, ప్రవీణ తదితరులు నవరస భరితంగా నర్తించారు. శివరంజనీనాయుడి బృందం శివ స్తుతి, విజయశాస్త్రి అన్నమయ్య కీర్తన, అనిత జతి స్వరంలను నయన మనోరంగా నర్తించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ జొన్నలగడ్డ అనూరాధ ప్రముఖ గాయకుడు అమలాపురం కన్నారావును సత్కరించి మాట్లాడారు. శోభానాయుడు నటనతో నాట్యరూపకాన్ని రక్తి కట్టిస్తే కన్నారావు గానం అద్భుతంగా సరి తూగేదని ప్రశంసించారు. శోభానాయుడు ఏ పాత్ర వేసినా ఆ పాత్రను సజీవంగా ప్రత్యక్షం చేసేదని వివరించారు. కార్యక్రమంలో ప్రముఖులు సుమలత తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలని టవర్ ఎక్కి నిరసన

ఆరుగంటలపాటు టవర్‌పైనే బాధితుడు

పోలీసుల చొరవతో కథ సుఖాంతం

హస్తినాపురం: రెండేళ్ల క్రితం నగరంలో వచ్చిన వరదలకు నష్టపోయిన కుటుంబాలను ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ లింగోజిగూడ డివిజన్ అధికారినగర్ బస్తీ అధ్యక్షుడు బొల్లెద్దుల నర్సింగ్‌రావు(40) చింతలకుంటలోని రేడియో స్టేషన్ టవర్‌పైకి ఎక్కి హల్‌చల్ చేశారు. అప్పట్లో వరదల కారణంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని లింగోజిగూడలో దాదాపు 40 ఇళ్లు కూలిపోగా, ఇద్దరు మృతి చెందారు. వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు, నాయకులు బాధితులకు నష్టపరిహారంతో పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఏళ్లు గడుస్తున్నా ఇచ్చిన ఆ హామీని అమలు చేయలేదు. దీంతో విసిగిపోయిన బాధితుడు నర్సింగ్‌రావు శుక్రవారం ఉదయం 7.30 గంటలకు చింతలకుంటలోని రేడియో స్టేషన్ టవర్ ఎక్కి సుమారు ఆరు గంటలపాటు నిరసన వ్యక్తం చేశారు. తన డిమాండ్లను పరిష్కరించేవరకు రేడియో స్టేషన్ టవర్ దిగేదిలేదని ఎవరైనా ఒత్తిడి చేస్తే ఇక్కడ నుంచి దూకేస్తానని బెదిరించాడు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని టవర్ ఎక్కిన నర్సింగ్‌రావుకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా కిందకి దిగలేదు. దీంతో నర్సింగ్‌రావు కుటుంబ సభ్యులను సంఘటనా స్థలానికి రప్పించారు. పలుమార్లు కుటుంబ సభ్యుల విజ్ఞప్తితో మధ్యాహ్నం 1.30 గంటలకు నర్సింగ్‌రావు కిందికి దిగిరావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వరదల్లో నష్టపోయిన నిరుపేదలకు పరిహారం ఇవ్వకుండా... డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, దళితబంధును కేవలం బీఆర్‌ఎస్ నాయకులకే ఇస్తున్నారని విమర్శించారు. తమ కాలనీలో ఉన్న అవేర్ గ్లోబల్ ఆస్పత్రిలో కాలనీవాసులందరికీ ఉచితంగా వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. నర్సింగ్‌రావు కుటుంబానికి అండగా ఉంటామని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి తెలిపారు. సమస్య పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం నర్సింగ్‌రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ఇంటికి పంపించేశారు.



నర్సింగ్‌రావుకు ధైర్యం చెబుతున్న సామ రంగారెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

క్లుప్తంగా...

9 ఏళ్ల పాలనలో దళితులను కేసీఆర్ మోసం చేశారు

బీజేపీ ఎంపీ డా.కె.లక్ష్మణ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్ల పాలనలో దళితులను మోసం చేసి, అవమానాలపాలు చేసిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే నైతికహక్కులేదని బీజేపీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఇప్పటిదాకా దళితులకు కేసీఆర్ చేసిన పాపాలు, తప్పిదాలకు అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ఏర్పాటుతో ప్రాయశ్చితం చేసుకోవాలి చూస్తున్నారని విమర్శించారు. 2016లో అంబేడ్కర్ విగ్రహస్థాపనకు శంకుస్థాపన చేసి ఏడేళ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విగ్రహావిష్కరణ చేసిన విషయాన్ని దళితులు గ్రహించాలన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామన్న హామీని నిలబెట్టుకోకుండా మొదట దగా చేసింది ఈ వర్గాన్నే అని పేర్కొన్నారు. ఎస్సీ ఉపప్రణాళిక నిధులు మళ్లించి, నిరుద్యోగ యువతకు చేయూతనిచ్చే ఎస్సీ కార్పొరేషన్‌ను నీరుగార్చిన ఘనత కేసీఆర్ సర్కార్‌దేనన్నారు.

దళితుల ఓట్ల కోసమే...

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై మంద కృష్ణ మాదిగ



ఉప్పరిగూడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మందకృష్ణ, రాములు

ఇబ్రహీంపట్నం రూరల్: ఏనాడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయని ముఖ్యమంత్రి కేసీఆర్.. ఏకంగా 125 అడుగు విగ్రహం ఏర్పాటు చేయడం దళితుల ఓట్ల కోసమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడలో అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే కె.రాములుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మంద కృష్ణ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దళితులను మరోమారు మోసం చేసేందుకే అంబేడ్కర్‌ను ముందుకు తీసుకొస్తున్నారన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్నే మార్చాలని కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దళితులపై ఎలాంటి ప్రేమ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు కేంద్రం అప్పనంగా కట్టబెడుతోందని మండిపడ్డారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల అడుగుజాడల్లో పయనించాలని ఆయన కోరారు.

'దళిత బంధు' పక్కదారి పట్టింది: ఇందిరాశోభన్



సాక్షి, హైదరాబాద్: దళిత బంధు స్కీం పక్కదారి పడుతోందని, దళితులను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని తెలంగాణ ఆత్మగౌరవ అధ్యక్షురాలు ఇందిరా శోభన్ ఆరోపించారు. దళిత బంధు స్కీంపై ఆర్టీఐ నుంచి పూర్తి సమాచారం తాము సేకరించామని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాగానే దళిత ముఖ్యమంత్రి అని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తా అని అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ హామీనిచ్చి మోసం చేశారని విమర్శించారు. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే దళితులు, సంక్షేమం సీఎంకి గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఒక కంపెనీ తన వస్తువు అమ్ముకోవడానికి బ్రోచర్ తయారు చేసినట్టుగానే సీఎం పొలిటికల్ బ్రోచర్ తయారు చేసారని ఎద్దేవా చేశారు. అబద్ధాలతో ఎన్ని రోజులు పాలను కొనసాగిస్తారని ఇందిరా శోభన్ ప్రశ్నించారు.

నేడు ఓరుగల్లులో బీజేపీ 'నిరుద్యోగ మార్చ్'

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు వరంగల్‌లో 'నిరుద్యోగ గర్జన'కు బీజేపీ సిద్ధమైంది. శనివారం సాయంత్రం 4 గంటలకు హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ చౌరస్తా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తోంది. ఈ ర్యాలీలో పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ సహా ముఖ్య నేతలు పాల్గొంటారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ, కేబినెట్ నుంచి ఐటీ శాఖ మంత్రి బర్తరఫ్, టీఎస్‌పీఎస్సీ బోర్డు ప్రక్షాళన, లీకేజీతో నష్టపోయిన నిరుద్యోగులకు పరిహారం చెల్లింపు డిమాండ్లతో బీజేపీ ఈ నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తోంది. బీజేపీ నిర్వహించబోయే నిరుద్యోగ మార్చ్‌కు ఓయూ, కేయూ జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు. నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నిరుద్యోగ మార్చ్ నిర్వహణ కమిటీ కన్వీనర్ డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మిగిలిన 9 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోనూ మే నెలాఖరులోగా నిరుద్యోగ మార్చ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను ఏకం చేసేలా మిలియన్ మార్చ్ తరహాలో హైదరాబాద్‌లో మార్చ్ నిర్వహిస్తామని వెల్లడించారు.

పెరుగుతున్న కంపల్సివ్ బయింగ్ డిజార్డర్ బాధితులు
ఇదొక తీవ్రమైన ఒత్తిడితో కూడిన మానసిక వ్యాధి అంటున్న నిపుణులు
సమస్యగా మారుతున్న నిరంతర షాపింగ్, కొనుగోలు ప్రియత్వం

కరోనా సమయంలో చేసిన ఆన్‌లైన్ షాపింగ్ ఓ ముఖ్య కారణం
సీబీఎస్‌డీ బాధితుల్లో 34% ఆన్‌లైన్ షాపింగ్‌కు అలవాటు పడినవారే..
మందులు, జీవనశైలి మార్పులతో కూడిన చికిత్సతోనే చెక్



➤ గత కొన్ని రోజులుగా శ్రీనగర్ కాలనీ నివాసి లలిత (35) ఏదో ఒత్తిడికి గురవుతున్నట్టు కనిపిస్తోంది. ఇంట్లో ఏవో కొన్ని వస్తువులు రహస్యంగా దాస్తోంది. డబ్బులు ధారాళంగా ఖర్చు చేస్తోంది. ఈ విషయాలన్నీ గమనించిన కుటుంబసభ్యులు ఎందుకయినా మంచిదని ఒకరోజున సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లారు. కొన్ని గంటల పాటు పరిశీలించిన వైద్యుడు ఆమె సీబీఎస్‌డీ అనే వ్యాధికి గురైందని నిర్ధారించారు. అదేమిటీ..తరచూ షాపింగ్ చేస్తుంటే సరదా అనుకున్నాం కానీ అదొక వ్యాధి అనుకోలేదే అని ఆశ్చర్యపోయారు కుటుంబ సభ్యులు. నగరంలో విజృంభిస్తున్న సరికొత్త మానసిక వ్యాధికి లలిత ఓ ఉదాహరణ.

అను'కొనడమే' ఆలస్యం!

సాక్షి, హైదరాబాద్: కంపల్సివ్ బయింగ్ బిహేవియర్ లేదా కంపల్సివ్ బైయింగ్, షాపింగ్ డిజార్డర్ (సీబీఎస్‌డీ/సీబీడీ)తో బాధపడుతున్నవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఒకప్పుడు మహిళల్లో ఎక్కువగా కన్పించే ఈ సమస్య ఇప్పుడు అందరినీ వేధిస్తోందని మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు. సీబీఎస్‌డీ తీవ్రమైన ఒత్తిడితో ముడిపడిన మానసిక ఆరోగ్య పరిస్థితి అని, అనవసరమైన వాటిని కూడా కొనడాన్ని నియంత్రించుకోలేని సమస్యగా మనస్తత్వవేత్తలు పేర్కొంటున్నారు. ఇటీవలే ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇంపల్స్ కంట్రోల్ డిజార్డర్స్ (కొన్నిప్రత్యేక అలవాట్ల నియంత్రణ లోపాలు)లో ఒకటిగా దీనిని చేర్చింది. ఈ సమస్య ఉన్నవారికి తరచుగా షాపింగ్ చేయాలనే కోరిక కలుగుతుంటుంది. అధిక వ్యయం వల్ల ఉత్పన్నమయ్యే ఆర్థికసమస్యలు, అనుబంధాల విచ్ఛిన్నం వంటి ప్రతికూల ఫలితాలున్నప్పటికీ పట్టించుకోకుండా అదేపనిలో నిమగ్నమైపోతారు. ఈ రుగ్మత ఉన్నవారు తమ బడ్జెట్‌పై స్పష్టమైన వైఖరి లేకుండా వారి సాధారణ కార్యకలాపాలను సైతం నిర్లక్ష్యం చేస్తూ కొనడంలోనే నిమగ్నమవుతుంటారు.

కరోనా సహా...కారణాలనేకం..

➤ మానసిక, పర్యావరణ, జీవ సంబంధమైన కారణాలుసహా అనేక అంశాలు కంపల్సివ్ షాపింగ్‌ను ప్రేరేపిస్తున్నాయి. పెరిగిన ఇంటర్నెట్, సోషల్ మీడియా, క్రెడిట్ కార్డ్‌లు, ఆన్‌లైన్ షాపింగ్, ప్రకటనలు, ప్రమోషన్ కార్యక్రమాలు కూడా సీబీఎస్‌డీకి దోహదపడుతున్నట్లు మనస్తత్వవేత్తలు పేర్కొంటున్నారు. మరోవైపు ఆర్థిక అవగాహన లోపించడం, రుణాలు సులభంగా అందుబాటులోకి రావడం కూడా కారణమవుతున్నాయి. మరీ ముఖ్యంగా కరోనా సమయంలో ప్రతి చిన్న వస్తువును ఆన్‌లైన్ ద్వారా కొనడం అత్యధికశాతం మందిని ఈ వ్యాధికి చేరువ చేసిందంటున్నారు. కంపల్సివ్ షాపింగ్ కోసం చికిత్స కోరిన వ్యక్తుల్లో దాదాపు 34% మంది ఆన్‌లైన్ షాపింగ్‌కు అలవాటు పడినవారని జర్మనీలోని హన్నోవర్ మెడికల్ స్కూల్ పరిశోధకులు తేల్చడం గమనార్హం.

భావోద్వేగ పరిస్థితులతో వ్యాధి తీవ్రం..

➤ కంపల్సివ్ షాపింగ్ లింగ భేదాలకు అతీతంగా ఉందని నిపుణులు అంటున్నారు. అయితే సాధారణంగా పురుషులతో పోలిస్తే మహిళలకు కాస్త షాపింగ్ ప్రియత్వం ఎక్కువ. అందువల్ల మహిళలే ఎక్కువగా ఈ వ్యాధి బారినపడే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఒత్తిడి, ఆందోళన, నిరాశ, ఆత్మవిశ్వాస లోపం వంటి ప్రతికూల భావోద్వేగ పరిస్థితులతో వ్యాధి తీవ్రతరం కావొచ్చు. బైపోలార్ ఎఫెక్టివ్ డిజార్డర్ (కొన్ని సమయాల్లో కుంగుబాటు, కొన్ని సమయాల్లో విపరీత ప్రవర్తన), అబ్సెసివ్-కంపల్సివ్ డిజార్డర్ (అతిగా ప్రవర్తించడం) (ఓసీడీ) తదితర ఇంపల్స్ కంట్రోల్ డిజార్డర్స్‌తో బాధపడుతున్న వ్యక్తులలో కంపల్సివ్ షాపింగ్‌ను వైద్యులు గుర్తిస్తున్నారు. దీనికి మందులు, జీవనశైలి మార్పుల కలయికతో కూడిన సమగ్ర చికిత్స విధానం అవసరమని వైద్యులు అంటున్నారు. వ్యక్తులు ఖర్చు చేసే అలవాటుపై తిరిగి నియంత్రణ సాధించేందుకు ఈ చికిత్స సహాయపడుతుందని చెబుతున్నారు. కంపల్సివ్ షాపింగ్‌తో పోరాడుతున్న వ్యక్తులు శిక్షణ పొందిన మానసిక ఆరోగ్య నిపుణుల నుంచి సహాయం పొందాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

అభివృద్ధి చెందిన దేశాల్లోనూ..

➤ సమగ్ర మనోరోగ చికిత్స జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం, అభివృద్ధి చెందిన దేశాలలో 5% మంది పెద్దలను కూడా సీబీఎస్‌డీ ప్రభావితం చేస్తోంది. ప్రతి 20 మందిలో ఒకరు దీని బారిన పడుతున్నారని ఇంటర్నేషనల్ బిజినెస్ టైమ్స్ నివేదించింది. వీరిలో ప్రతిముగ్గురిలో ఒకరు ఆన్‌లైన్ కొనుగోలు వ్యసనంతో బాధపడుతున్నారు. 'షాపింగ్‌పై కోరికతో వారు కొనుగోలు చేయగలిగిన దానికంటే ఎక్కువ కొనుగోలు చేస్తారు.

మహిళలే కాదు..అందరిలోనూ కన్పిస్తోంది



➤ గతంలో పార్కిన్సన్స్ లాంటి మెదడు మీద ప్రభావం చూపే వ్యాధుల్లో ఒక లక్షణంగా ఈ సీబీడీని గుర్తించేవాళ్లం. దీన్ని బైపోలార్ డిజార్డర్ అనేవాళ్లం. అయితే ఇటీవలి కాలంలో ఇతరత్రా వ్యాధులు లేకుండానే..సీబీడీకి గురవుతున్నారు. విచిత్రమేమిటంటే అవసరానికో, ఆర్థికంగా బాగుండో కొనేవారిలా కాకుండా ఈ వ్యాధికి గురైన వారు కొన్నవాటితో సంతోషం కూడా పొందరు. కొన్నప్పటికీ అసంతృప్తితో ఉంటారు. అవమానంగా ఫీలవుతారు. దాంతో మళ్లీ కొంటారు. అలా అలా.. మత్తు పదార్థాలకు అలవాటైన వారిలా.. కొంటున్న విషయాన్ని, కొన్న వస్తువుల్ని రహస్యంగా ఉంచుతారు. వీరికి చికిత్సలో భాగంగా కౌన్సెలింగ్ తో పాటు మందులను కూడా వాడాల్సి ఉంటుంది. గతంలో మహిళల్లో ఎక్కువగా చూసేవాళ్లం. ఇప్పుడు అందరిలోనూ కనిపిస్తోంది.

–డాక్టర్ చరణ్ తేజ,
న్యూరో సైకియాట్రిస్ట్, కిమ్స్ ఆసుపత్రి

అంబేడ్కర్‌ను అవమానించిన ద్రోహి కేసీఆర్..

ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగాన్ని మార్చాలంటూ అంబేడ్కర్‌ను అవమానించిన ద్రోహి కేసీఆర్ అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల అన్నారు. దళితులు, బలహీన వర్గాల ప్రజల కోసం పోరాడిన, మహిళల హక్కుల కోసం కొట్లాడిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. నేడు తెలంగాణలో అంబేడ్కర్‌కు, ఆయన రూపొందించిన రాజ్యాంగానికి, దళితులకు గౌరవం లేదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం ట్యాంక్‌బండ్ దగ్గర అంబేడ్కర్ విగ్రహానికి ఆమె నివాళులు అర్పించారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ.. మరియమ్మ అనే దళిత మహిళను జైల్లో పెట్టి చిత్రహింసలకు గురిచేసి చంపేసిన ప్రభుత్వమిదని గుర్తు చేశారు. ఎన్నికలే లేకపోతే కేసీఆర్ అంబేడ్కర్ విగ్రహం కూడా కట్టేవారు కాదని తెలిపారు. 80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్, భారత రాజ్యాంగాన్నే చదవలేదని విమర్శించారు. అందుకే కేసీఆర్‌కు రాజ్యాంగం పుస్తకాన్ని బహుమతిగా పంపిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో 19 లక్షల దళిత కుటుంబాలుంటే.. కనీసం లక్ష కుటుంబాలకు కూడా దళిత బంధు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు దళితుల మీద, అంబేడ్కర్‌పై నిజంగా ప్రేమ ఉంటే దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితబంధు, కార్పొరేషన్ లోన్లు ఇవ్వాలని షర్మిల డిమాండ్ చేశారు.

విగ్రహాలు కాదు.. దళితులకు చేసిందేమిటి?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను మోసం చేస్తున్నాయి ● ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫైర్



సభలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో కలిసి అభివాదం చేస్తున్న మధుయాష్కీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్, రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి, నదీమ్ జావెద్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ''ఒకరు 20 అడుగులు, మరొకరు 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ పేద దళితులకు చేసిందేమీ లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను మోసం చేస్తున్నాయి. కేవలం ప్రకటనలు చేస్తే సరిపోదు. పేద దళితుల కోసం చేసిందేమిటో చెప్పాలి..'' అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. నేటి ప్రభుత్వాలు భావ ప్రకటనా స్వేచ్ఛను, హక్కులను హరిస్తున్నాయని మండిపడ్డారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో జరిగిన 'జైభారత్ సత్యాగ్రహ సభ'లో మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

దళితుల పేరు చెప్పి మోసం..

కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని కేసీఆర్ దళితుల పేరు చెబుతూ మోసం చేస్తున్నారని ఖర్గే విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో దళితుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించినది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్లు, మూడెకరాల భూమి ఇవ్వకుండా దళితులను మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడ్డాక దళితుల కోసం ఎన్ని నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. కేవలం పేపర్లలో ప్రకటనలు ఇస్తే సరిపోదన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని.. భావ ప్రకటన స్వేచ్ఛను, హక్కులను హరిస్తున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దేశానికి ఎంతో సేవ చేసిందని.. కానీ ఆగమేఘాలపై రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేశారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో ఏనాడూ ప్రతిపక్షాలపై కక్షగట్టలేదన్నారు. కానీ తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ బలహీనపర్చే కుట్ర చేస్తున్నారని విమర్శించారు.

మీరు చేసిందేంటో చెప్పండి..

కాంగ్రెస్ ఏం చేసిందని కొందరు విమర్శిస్తున్నారని, నాడు చేసిన కాంగ్రెస్ తెచ్చిన సంస్కరణలతోనే నేడు మోదీ ప్రధాని అయ్యారని, అమిత్‌షా హోం మంత్రి అయ్యే అవకాశం వచ్చిందని ఖర్గే చెప్పారు. రాజ్యాంగ రచనలో అంబేడ్కర్‌తో కలిసి నెహ్రూ పని చేశారని, రాజ్యాంగ పరిరక్షణకు తోడ్పడ్డారని గుర్తుచేశారు. బీజేపీ నేతలు దేశానికి చేసినదేమిటో చెప్పాలన్నారు. దేశ సేవలో వారి పాత్ర ఏమిటని ప్రశ్నించారు. పైగా ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ.. అదేమీ చేయకపోగా ఎయిర్‌పోర్టులు, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణిలో ప్రైవేటీకరణతో నేడు ఉద్యోగాల సంఖ్య 40వేలకు తగ్గిందని చెప్పారు. కాగా.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రేవంత్‌రెడ్డి, భట్టి పాదయాత్రలు చేపట్టారన్నారు.



పాదయాత్రలో భట్టి, ఎంపీ కోమటిరెడ్డి, మధుయాష్కీ

కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- ఇన్నేళ్లుగా అంబేడ్కర్ జయంతుల్లో ఎందుకు పాల్గొనలేదు
- అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత కేసీఆర్‌కు లేదు
- బీజేపీ కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో బండి సంజయ్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సంజయ్

సాక్షి, హైదరాబాద్: ఇన్నేళ్లుగా రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనలేదో సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు.గతంలో ఈ కార్యక్రమాలకు హాజరుకాకుండా అంబేడ్కర్‌ను అవమానించిన కేసీఆర్ ఎన్నికలొస్తున్నాయని ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. అలాగే, రూ.కోట్లు వెచ్చించి ప్రకటనలు ఇస్తూ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి సంజయ్, ఇతరనేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ.. 'దళితబంధు దేశానికి దిక్సూచి అంటూ ఇచ్చిన ప్రకటనలను చూసి జనం నవ్వుకుంటున్నారు. ఎంతమందికి దళితబంధు ఇచ్చారో, ఎవరెవరికి ఇచ్చారో చెప్పాలి. దీనిపై సీఎం శ్వేతపత్రం విడుదల చేయాలి' అని అన్నారు. అంబేడ్కర్‌ను, దళితులను అడుగడుగునా అవమానించిన కేసీఆర్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించే అర్హత లేదన్నారు. 'తెలంగాణ ఉద్యమ సమయంలో దళితుడినే తొలి సీఎంగా చేస్తానని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదు. దళితులకు మూడెకరాలు ఎందుకివ్వలేదు? దళితుల పేరిట ఉన్న జాగాలను ఎందుకు లాక్కుంటున్నారు? ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ నిధులివ్వకుండా పేదలకు విద్య, వైద్యాన్ని ఎందుకు దూరం చేస్తున్నారు?' అంటూ కేసీఆర్‌కు ప్రశ్నలు సంధించారు. దమ్ముంటే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. వీటికి సమాధానాలు ఇవ్వలేనిపక్షంలో తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలన్నారు. అణగారిన వర్గాల దిక్సూచి అంబేడ్కర్ అని ఐక్యరాజ్యసమితి చెప్పిందంటే అంబేడ్కర్ గొప్పతనం అర్థం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నేతలు బంగారు శ్రుతి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, కొప్పు బాషా, మాజీ డీజీపీ క్రిష్ణప్రసాద్ పాల్గొన్నారు. కాగా, ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సంజయ్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

మహాశయా... మన్నించు...

'అంబేడ్కర్ మహాశయా... మాట ఇస్తున్నా. 2023లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించి తీరుతాం. బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అధికారంలోకి వచ్చాక మీ ఆశయాలకు అనుగుణంగా పాలన చేస్తూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడతామని పార్టీపక్షాన హామీ ఇస్తున్నా' అని అంబేడ్కర్‌ను ఉద్దేశించి బండి సంజయ్ లేఖ రాశారు. 'మహాశయా... మన్నించు.. మీ వంటి చారిత్రక వ్యక్తి విగ్రహాన్ని దళిత ద్రోహి ప్రారంభించడం బాధగా ఉంది. మీరు రాసిన రాజ్యాంగాన్ని తిరగరాస్తామంటూ మిమ్మల్ని అవమానించినోళ్లే ఓట్ల కోసం మీ జపం చేస్తున్నారు' అని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం సర్వం ధారపోసిన మహనీయుడు మీరు. అందరికీ ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి మీరు. అలాంటి మీ విగ్రహం వద్దే ఓట్ల రాజకీయ క్రీడను మొదలుపెట్టడం బాధగా ఉందన్నారు. '2024లో కేంద్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ మీ విగ్రహం సాక్షిగా చెప్పడం ఈ శతాబ్దపు పెద్ద జోక్. తొమ్మిదేళ్లుగా తెలంగాణ ప్రజలను గాలికొదిలేసి ఫాంహౌజ్‌కే పరిమితమైన కేసీఆర్ ఇంకా పగటి కలలు కంటున్నారు' అని ఎద్దేవాచేశారు. 'నిరసనలు, ధర్నాలను నిషేధిస్తూ ప్రజాస్వామ్యాన్ని అడుగడుగునా ఖూనీ చేస్తున్నోళ్లే మీ సిద్ధాంతం గొప్పదని బాకాలు కొడుతున్నారని ధ్వజమెత్తారు.

దళితుల కళ్లలో మట్టికొట్టిన కేసీఆర్

- సచివాలయానికి అంబేడ్కర్ పేరు, విగ్రహ ఏర్పాటు సంతోషమే
- మరి దళిత సీఎం, మూడెకరాల భూమి, రిజర్వేషన్లు, ఇతర హామీల అమలేది?
- పైగా దళితుల భూములు లాక్కుంటున్నారు: ఈటల ఫైర్



మీడియాతో మాట్లాడుతున్న ఈటల. చిత్రంలో మహేశ్వర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో అంబేడ్కర్ జపం చేయకపోతే పుట్టగతులు ఉండవని గ్రహించడం వల్లే కేసీఆర్ కొత్తగా అంబేడ్కర్ నామ స్మరణ మొదలుపెట్టారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. సచివాలయానికి అంబేడ్కర్ పేరు, విగ్రహం ఏర్పాటు సంతోషమేనని.. కానీ దళితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చి వారికి న్యాయం చేసేది ఎప్పుడని ప్రశ్నించారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణభవన్‌లోని ఈటల, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈటల మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు, రిజర్వేషన్లు ఇలా ఏ ఒక్కహామీ అమలు కాలేదని.. దళితుల కళ్లలో కేసీఆర్ మట్టి కొట్టారని మండిపడ్డారు.

దళితుల భూములను లాక్కుంటున్నారు..

కేసీఆర్ పాలనలో దళితులకు అడుగడుగునా అవమానాలే ఎదురవున్నాయని ఈటల వ్యాఖ్యానించారు. దళిత సీఎం హామీ ఇచ్చి మాట తప్పడం తెలంగాణ రాష్ట్రంలో తొలి ఉల్లంఘన అని.. కేబినెట్‌లో ఉన్న దళిత ఉప ముఖ్యమంత్రిని సాకులు చెప్పి తీసేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని మండిపడ్డారు. గత ప్రభుత్వాలు దళితులకు ఇచ్చిన భూములను కేసీఆర్ ప్రభుత్వం లాక్కుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. మహనీయుడి విగ్రహం పెట్టినంత మాత్రాన ఎవరూ కేసీఆర్‌కు జేజేలు కొట్టబోరని వ్యాఖ్యానించారు.

దళిత బిడ్డలు కేసీఆర్‌ను క్షమించరు: రేవంత్



కోమటిరెడ్డి, రేవంత్, ఉత్తమ్ సరదా సంభాషణ

ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు అంబేడ్కర్ పేరు పెడితే ఎందుకు తొలగించారో సీఎం కేసీఆర్ చెప్పాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తానన్న కేసీఆర్.. మాట తప్పారని, పైగా కేబినెట్‌లో ఉన్న దళిత డిప్యూటీ సీఎంను బర్తరఫ్ చేశారని మండిపడ్డారు. కేసీఆర్ ముక్కు నేలకు రాసిన తర్వాతగానీ దళిత బిడ్డలు ఆయనను క్షమించబోరని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌లో 8నుంచి 10 శాసనసభ స్థానాలు గెలుస్తామని.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం ప్రవేశ పరీక్షలు కూడా సరిగా నిర్వహించలేపోయిందని.. తాము అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. ఇటీవల కాంగ్రెస్‌ను వీడిన వారిని ఉద్దేశిస్తూ.. ఎండినపోయిన ఆకులు రాలిపోయినా, చిగురించే కొత్త నాయకత్వం వస్తుందని వ్యాఖ్యానించారు.

భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

నస్పూర్‌లో సభకు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా గద్దర్ నేతృత్వంలో నిర్వహించిన ఆటాపాటా, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బీజేపీ పాలన అంతానికి బీజం: ఉత్తమ్

అంబేడ్కర్ జయంతి రోజున జరుపుతున్న ఈ సత్యాగ్రహ సభతో దేశంలో బీజేపీ పాలన అంతమొందించేందుకు బీజం పడాలని పీసీసీ మాజీ చీఫ్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాహుల్‌గాంధీపై దుర్మార్గంగా అనర్హత వేటు వేశారని విమర్శించారు. 125 అడుగుల ఎత్తున్న అంబేడ్కర్ విగ్రహం ప్రతిష్ఠించడంకాదు..వారికోసం ఏం చేశారో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 17 లక్షల మంది దళితులు ఉంటే.. 1,700 మందికే దళితబంధు ఇచ్చారని మండిపడ్డారు.

తాడిచర్ల గనుల నుంచి కేసీఆర్‌కు 10 వేల కోట్లు: ఎంపీ కోమటిరెడ్డి

సింగరేణికి చెందిన తాడిచర్ల బొగ్గుబ్లాకులను కేసీఆర్ ప్రైవేటుపరం చేసి రూ.10 వేల కోట్లు తీసుకున్నారని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. ఇలా అవినీతి ద్వారా వచ్చిన డబ్బులతోనే దేశవ్యాప్తంగా పార్టీలకు ఎన్నికల ఖర్చుగా ఇవ్వడానికి ముందుకు వచ్చారని పేర్కొన్నారు. లేకుంటే ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని నిలదీశారు. నేడు భట్టి చేస్తున్న పాదయాత్ర చూస్తుంటే నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన పాదయాత్ర గుర్తుకు వస్తోందని చెప్పారు.

దేశాన్ని దోచి పెడుతున్నారు: భట్టి

దేశాన్ని అదానీ, అంబానీ, నీరవ్ మోదీ, లలిత్ మోదీలకు దోచి పెడుతున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చింది ఇందుకోసమేనా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అపార వనరులు ఉన్నా అభివృద్ధి జరగలేదన్నారు. గిరిజనులు పోడు సమస్యతో బాధపడుతున్నారని.. తాము అధికారంలోకి రాగానే పట్టాలు ఇస్తామని ప్రకటించారు. సింగరేణి ఉద్యోగాల గని అని.. కానీ ప్రైవేటీకరణతో నష్టం చేస్తున్నారని భట్టి చెప్పారు. గతంలో సింగరేణిలో లక్షా 20వేల ఉద్యోగాలు ఉంటే.. 40 వేలకు తగ్గించారని చెప్పారు. తాము కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఒక్క బొగ్గు గనిని కూడా ప్రైవేటీకరించబోమని.. కార్మికులకు అన్యాయం జరగనీయబోమని స్పష్టం చేశారు. గిరిజనులకు పోడు పట్టాలు ఇస్తామన్నారు. ప్రాణహిత ప్రాజెక్టును బొందపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు కడితే.. ఇక్కడి రైతుల పంటలు నీట మునుగుతున్నాయన్నారు.

మండే ఎండల్లోనూ... అందంగా... ఆరోగ్యంగా



ఎండాకాలం కాసేపు బయటికి వెళితే చాలు ముఖ చర్మం కమిలిపోతుంది. విపరీతంగా చెమటలు పోస్తాయి. నీరసం, నిస్త్రాణ కలుగుతాయి. కాసేపు పని చేస్తే చాలు శరీరం అలసిపోయి, సొమ్మసిల్లినట్లు అవుతుంది. బయటికి వెళ్లేటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఎండల్లోనూ అందంగా ఆరోగ్యంగా ఉండవచ్చు. అవేమిటో చూద్దాం...

మంచి నీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటి నుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.

- గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.
- నిమ్మరసం వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.
- ఉప్పు, కొద్దిగా మసాలాలు జోడించి పెరుగు చిలికి చేసే మజ్జిగ శరీరంలో వేడిని చల్లారుస్తుంది. డీహైడ్రేషన్ ను నివారిస్తుంది. ఇది ఎలక్ట్రోలైట్ల భరితం. వేసవి తాపంతో పోరాడటానికి మజ్జిగ ఒక మంచి ఆప్షన్. దీనిలో క్యాలరీలు తక్కువ. కాల్షియం, పొటాషియంతో పాటు ప్రొటీన్ కూడా దీని నుంచి దొరుకుతుంది. అసిడిటీని తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అదేవిధంగా పెరుగు తీసుకోవడం కూడా మంచిదే.
- గసగసాలను ఎక్కువగా ఆహారపదార్థాల్లో వాడాలి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అంతే కాదు, వేడిని తగ్గించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.
- కొత్తిమీరను ఆహారంలో అధికంగా తీసుకోవాలి. కొత్తిమీర రసం లేదా వంటకాల్లో దీన్ని వాడినా... శరీరంలోని అధిక ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.



చర్మ సంరక్షణ ముఖ్యం

- వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్‌ని రాసుకోవడం వల్ల చర్మానికి సమస్యలు తగ్గుతాయి. ఈ సన్‌స్క్రీన్ లోషన్‌ని బయటికి వెళ్లినప్పుడు మాత్రమే కాకుండా ఇంట్లో ఉన్నప్పుడు కూడా అప్లై చేసుకోండి. సన్‌స్క్రీన్ లోషన్ వాడటం వల్ల చర్మ సమస్యలు ఉండవు. అలాగే చర్మానికి రక్షణ ఉంటుంది.
- ఎండల్లో బయటకు వెళ్ళినప్పుడు చర్మాన్ని కవర్ చేసుకోవడం అవసరం. కాబట్టి మీరు బయటకు వెళ్లేటప్పుడు గొడుగుని తీసుకు వెళ్లడం మర్చిపోకండి. అలానే ఎండాకాలంలో బయటకు వెళ్ళేటప్పుడు సన్ గ్లాసెస్‌ని ధరించడం, తలకు పెద్ద టోపీ పెట్టుకోవడం పైగా ఎలాంటి సమస్యలూ రావు.
- వేసవిలో ఆయిల్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. ఇంటి వంటలలో కూడా నూనె వాడకం తగ్గించాలి.
- ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మసాలా కూరలు తగ్గించాలి.
- అల్పాహారంగా ఆవిరి కుడుములు, ఇడ్లీ వంటివి తీసుకుంటే మేలు.
- కర్బూజా, పుచ్చకాయలు, ఈత కాయలు, తాటి ముంజలు వంటి సీజనల్ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచిది.
- వేసవిలో రోజుకోసారి రాగిజావ తీసుకోవడం వల్ల కడుపులో చల్లగా ఉండటంతోపాటు మరెన్నో లాభాలు ఉన్నాయి. రాగుల్లో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి.

నీళ్లు ఏ బాటిల్‌లో తాగుతున్నారు..?

అసలే ఎండాకాలం.. దాహం వేస్తుంటుంది. ఇంట్లో ఉన్నప్పుడంటే కావలసినప్పుడల్లా నీళ్లు తాగుతుంటాం. మరి బయటికి వెళ్లేటప్పుడు? అందులో ఆలోచించేదేముంది... ఒక వాటర్ బాటిల్ తీసుకెళతాం.. అంతే కదా అని సింపుల్‌గా చెప్పేస్తాం. అయితే ఆ బాటిల్ దేనితో తయారు చేసింది... అంటే నూటికి తొంభై పాళ్లు 'ప్లాస్టిక్ బాటిల్' అనే సమాధానం వస్తుంది. దాహం వేసినప్పుడు నీళ్లు తాగడం వల్ల ఎంత ఉపయోగమో, ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీళ్లు తాగడం అంత ప్రమాదం. అది ఎండాకాలం అయితే కనక ఈ ప్రమాదం ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఇంతకీ ఏమిటా నష్టాలు అంటారా? అదే చూద్దాం..

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు అని పదే పదే చెబుతున్నా కూడా ప్లాస్టిక్ ఇంకా వాడకంలోనే ఉండటానికి కారణం ఏమిటంటే, దానిని క్యారీ చేయడం చాలా సులువు. నిర్వహించడం ఇంకా సులువు. ఒకవేళ ఎక్కడైనా పెట్టి మరచిపోయినా పెద్ద ఖరీదు ఉండదు కాబట్టి దిగులు పడనక్కరలేదు. అందువల్ల పర్యావరణ ప్రేమికులు ఎంతగా నెత్తీ నోరు బాదుకుంటున్నా, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే విషయంలో వెనకబడవలసి వస్తోంది.

- ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ అయినా, భారీ ప్లాస్టిక్ కంటైనర్లు అయినా వాటి నుంచి నీరు తాగడం ప్రమాదకరం. ముఖ్యంగా ఎండలో ఎక్కువగా ఉంచిన ప్లాస్టిక్ బాటిల్స్‌లోని నీటిని అసలు తాగకూడదు.
- పరిశోధన ప్రకారం.. ప్లాస్టిక్ బాటిల్స్ మీద ఎండ పడితే.. అవి మైక్రోప్లాస్టిక్‌లను విడుదల చేస్తాయి. అలాంటి పరిస్థితుల్లో మనం ఈ నీటిని తాగితే.. శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను కాపాడే.. ఎండోక్రైన్ వ్యవస్థ ప్రభావితం అవుతుంది. ఇలాంటి నీటిని ఎక్కువగా తీసుకుంటే.. ఆరోగ్యం దెబ్బతింటుంది. కాలేయాన్ని కూడా పాడు చేస్తుంది.
- ఎండలో ఉండే.. ప్లాస్టిక్ బాటిల్ నుంచి డయాక్సిన్ లాంటి టాక్సిన్ నీటిలోకి విడుదల అవుతుంది. ఈ డయాక్సిన్ నీటిని తాగితే.. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బాటిల్ నీళ్ల తాగితే.. వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. మగవారిలో శుక్ర కణాల సంఖ్య కూడా తగ్గవచ్చు.



బాటిల్ వాటర్‌లో మైక్రో ప్లాస్టిక్స్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

- మైక్రోప్లాస్టిక్స్ కలిసిన నీటిని తాగితే పొత్తి కడుపునకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. హార్మోన్ల అసమతుల్యం, పీసీఓఎస్, ఒవేరియన్ సమస్యలు, బ్రెస్ట్ క్యాన్సర్, కోలన్ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలు రావొచ్చు.
- ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిది కాదు. బయటకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లకు ఎండ తగిలితే.. అస్సలే తాగొద్దు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్లను కొంతమంది అలానే ఉపయోగిస్తారు. ఇంటికి తీసుకొచ్చి ఫ్రిడ్జ్‌లో పెట్టుకుంటారు. ఇది ఇంకా అపాయకరమైనది. ఇలా అస్సలు చేయొద్దు ఎప్పుడూ.

ఏం చేయాలి మరి?

ప్లాస్టిక్ బాటిల్స్ అంతగా వాడుకలోకి రాని రోజుల్లో పెద్దవాళ్లు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు స్టీలు లేదా ఇత్తడి మరచెంబులు తీసుకు వెళ్లేవారు. ఇప్పుడు కూడా అదే మంచిది. అందుకు తగ్గట్టు ఇప్పుడు మార్కెట్‌లో రకరకాల సైజుల్లో, ఆకారాలలో రాగి, స్టీలు, ఇత్తడి బాటిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇవి కాస్తంత ఖరీదు ఎక్కువైనా, ప్లాస్టిక్ వాడకం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలతో పోల్చుకుంటే ఫరవాలేదనిపిస్తుంది.

- ప్లాంట్ బేస్డ్ బాటిల్స్, గాజుసీసాలు, అల్యూమినియం వాటర్ క్యాన్స్ కూడా అందుబాటులోకి వస్తున్నాయి. మనం వాడకం మొదలు పెడితే ధరలు కూడా అందుబాటులోనే ఉంటాయి.

మీకు తెలుసా?



రోజంతా చురుకుగా, ఆరోగ్యంగా ఉండాలంటే అల్పాహారం తీసుకోవడం అవసరం. దీనిలో మొలకెత్తిన గింజలు, ఉడికించిన కోడిగుడ్లు, నూనె లేకుండా చేసిన చపాతీలు, పండ్ల రసాలే కాక... ఐదు నానబెట్టిన బాదం పప్పులు, పండ్లు, కూరగాయలతో కలగలిపిన సలాడ్ లు వంటివి తీసుకుంటుంటే అనారోగ్యాన్ని కలిగించే వైరల్ ఇన్ఫెక్షన్‌లు దరిచేరవు. వీటితోపాటు.. తీసుకునే అల్పాహారంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గడమే కాకుండా, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అలాగే డైటింగ్ చేసే వారు నిర్లక్ష్యం చేయకుండా.. అల్పాహారం తీసుకోవడం మరువకూడదు.

గ్యాస్ ఆదా చేద్దామా?

ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు వంటకు గ్యాసే వాడుతున్నారు. దాంతో వంట గ్యాస్ ధర రోజురోజుకీ పెరిగి మంట గ్యాస్‌గా మారిపోతోంది. అందుకే దాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే ఎక్కువకాలం పాటు గ్యాస్ వచ్చే విధంగా చూసుకోవచ్చు. గ్యాస్ ఆదాకు చిట్కాలు తెలుసుకుందాం...



వంట చేసేటప్పుడు రోజులో ఒకేసారి ఎక్కువ మొత్తంలో కూర వండుకోవడం మంచిది. ఉదయం ఒకసారి, మధ్యాహ్నం ఒకసారి, రాత్రి ఒకసారి... ఇలా వండడం వల్ల గ్యాస్ ఎక్కువ మొత్తంలో పోతుంది. అదే మధ్యాహ్న భోజనం చేయడానికి ఒక గంట ముందు వండుకుంటే, అదే కూర మధ్యాహ్నానికి, రాత్రికి కూడా వస్తుంది. దీనివల్ల రెండు మూడుసార్లు గ్యాస్‌ను వాడాల్సిన అవసరం రాదు.

- **ప్రెషర్ కుకర్ బెస్ట్:** ప్రెషర్ కుకర్ అధిక పీడనం కింద ఆవిరి మీద ఆహారాన్ని ఉడికిస్తుంది పైగా రెండు మూడు రకాలను ఒకేసారి కుకర్‌లో పెట్టవచ్చు కాబట్టి తక్కువ సమయంలో వంట పూర్తవుతుంది. గ్యాస్ కూడా ఆదా అవుతుంది.
- చిన్నగిన్నెలో వంటలు చేస్తున్నప్పుడు పెద్ద బర్నర్ వాడకూడదు. అలా వాడటం వల్ల మంట చాలా మటుకు బయటికి పోతుంది. దాంతో ఆ మేరకు గ్యాస్ వృథా అయినట్లే కదా.. అందువల్ల సాధ్యమైనంత వరకు చిన్న బర్నర్‌నే వాడటం మంచిది.
- బర్నర్లను తరచూ శుభ్రపరుస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల అది త్వరగా వేడెక్కి వంట త్వరగా పూర్తయ్యేలా చేస్తుంది.
- వంట పూర్తవడానికి కొంచెం ముందే స్టవ్ ఆపి వేయండి. గిన్నె మీద మూత మాత్రం తీయవద్దు. లోపల ఉన్న వేడి ఆ మిగతా వంటను పూర్తి చేస్తుంది. దీనివల్ల గ్యాస్ ఆదా అవుతుంది.
- వంట చేస్తున్నప్పుడు గిన్నె మీద మూత పెట్టే ఉంచండి. ఎందుకంటే మూత పెట్టడం వల్ల లోపల ఉన్న వేడి బయటికి పోదు. ఆ వేడి మీదే త్వరగా ఉడుకుతుంది. అదేవిధంగా స్నానానికి వేడినీళ్లను గ్యాస్ మీద పెట్టవద్దు. నీళ్ల వేడెక్కడానికి చాలా సమయం పడుతుంది. దాంతో ఎక్కువ గ్యాస్ వాడాల్సి వస్తుంది.
- పగటిపూట వంట చేస్తున్నప్పుడు వంటగదిలోని లైట్లను ఆన్ చేయవద్దు. దీనివల్ల శక్తి ఆదా అవుతుంది. అలాగే మీకు తెలియకుండానే గ్యాస్ వినియోగం కూడా తగ్గుతుంది.

ఈ చిట్కాలన్నీ పాటించడం వల్ల గ్యాస్ సిలెండర్ దాదాపు పది రోజులు అదనంగా వచ్చే అవకాశం ఉంది.

సినిమా

కేరాఫ్ ఫారిన్

సమ్మర్‌లో కూల్‌గా ఉండే లొకేషన్స్‌ని ఎంచుకుని, వెకేషన్‌కి వెళుతుంటారు కొందరు స్టార్స్. కొందరిని షూటింగే చల్లని ప్రాంతాలకు తీసుకెళుతుంది. అలా 'కేరాఫ్ ఫారిన్' అంటూ షూటింగ్స్‌కి, వెకేషన్‌కి విదేశాలు వెళ్లిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.


కమల్‌హాసన్


ప్రభాస్


అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్

- రెండు వారాలుగా ఫారిన్‌లోనే ఉంటున్నారు ఇండియన్. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' ('భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల తైవాన్‌లో జరిగిన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం సౌతాఫ్రికాలో జరుగుతోంది. కమల్‌పై ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్నారు శంకర్. ఈ వారం కూడా 'ఇండియన్ 2' టీమ్ సౌతాఫ్రికాలోనే ఉంటుందని తెలిసింది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా కీలక పాత్రలు చేస్తున్నారు.
- ఇటలీలో ఫైట్స్ చేశారు ప్రభాస్. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'సలార్' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ గత నెలలో ఇటలీ లొకేషన్స్‌లో జరిగింది. ముఖ్యంగా ప్రభాస్‌పై యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా 'సలార్' సినిమా యూనిట్ మరోసారి ఫారిన్ వెళ్లనుందని సమాచారం. బుడాపెస్ట్ లొకేషన్స్‌లో 'సలార్' షూటింగ్‌ను ప్లాన్ చేశారు. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. 'సలార్' చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రీకరణలో ప్రభాస్ పాల్గొంటున్నారని తెలిసింది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి కాగానే 'సలార్' కోసం ప్రభాస్ ఫారిన్ ఫ్లైట్ ఎక్కుతారని ఫిల్మ్‌నగర్ సమాచారం.
- లండన్‌లో ప్రేమ పాఠాలు నేర్చుకుంటున్నారు శర్వానంద్. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్, కృతీ శెట్టి జంటగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల లండన్‌లో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. గత వారం శర్వానంద్, కృతీపై కీలక సన్నివేశాలు, ఓ పాట చిత్రీకరించారు.
- బాలీవుడ్ 'బడే మియా చోటే మియా' లండన్‌కు షిఫ్ట్ అయ్యారు. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బడే మియా చోటే మియా'. ఇటీవల ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను స్కాట్లాండ్‌లో చిత్రీకరించారు. అట్నుంచి అటు లండన్ వెళ్లారు. మరో పది రోజులపాటు లండన్ షెడ్యూల్ జరుగుతుందట. అలాగే మరో బాలీవుడ్ మూవీ 'యానిమల్' షూటింగ్ కూడా లండన్‌లో జరిగింది. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్.

ఈ చిత్రాలతో పాటు మరికొన్ని చిత్రాలు ఫారిన్ లొకేషన్స్‌లో షూటింగ్స్‌ను ప్లాన్ చేశాయి.


రణ్‌బీర్ కపూర్


శర్వానంద్

సమ్మర్ బ్రేక్


మహేశ్‌బాబు


రామ్‌చరణ్


ఎన్టీఆర్

షూటింగ్స్‌కు సమ్మర్ బ్రేక్ ఇచ్చారు కొందరు స్టార్ హీరోలు. ప్రతి ఏడాది సమ్మర్‌కు ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్లే మహేశ్‌బాబు ఈ ఏడాది కూడా ఫారిన్ టూర్ వెళ్లారు. ఫ్యామిలీతో కలిసి విదేశాల్లో వెకేషన్ టైమ్‌ను ఆస్వాదిస్తున్నారు. మహేశ్ ఫ్యామిలీ ప్రస్తుతం జర్మనీలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఫారిన్ వెకేషన్‌ను పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు మహేశ్‌బాబు. మరోవైపు 'జనతా గ్యారేజ్' చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల మొదలైన ఈ సినిమా తొలి షెడ్యూల్ ముగిసింది. నెక్ట్స్ షెడ్యూల్ గోవాలో ప్లాన్ చేశారు. అయితే ఈ సినిమా షూటింగ్ నుంచి ఎన్టీఆర్ స్మాల్ బ్రేక్ తీసుకున్నారని తెలిసింది. గోవా షెడ్యూల్‌లో వచ్చే నెల జాయిన్ అవుతారట ఎన్టీఆర్. ఇక రామ్‌చరణ్ ఫుల్ వెకేషన్ మోడ్‌లో ఉన్నారు. ఇటీవల రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసన దుబాయ్ వెళ్లొచ్చారు. ప్రస్తుతం ఈ దంపతులు మాల్దీవుల్లో ఉన్నారు. ఈ వెకేషన్‌ను పూర్తి చేసిన తర్వాత రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' షూటింగ్‌లో పాల్గొంటారు. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

నేను సింగిల్


పూజా హెగ్డే

'ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే నాకు ఇష్టం' అంటున్నారు హీరోయిన్ పూజా హెగ్డే. సల్మాన్ ఖాన్ హీరోగా ఫర్హాద్ సామ్జీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కిసీ కా భాయ్.. కిసీ కీ జాన్'. సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్‌కి జోడీగా నటించారు పూజా హెగ్డే. కాగా ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పటి నుంచి సల్మాన్, పూజా హెగ్డే డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. పైగా మంగళూరులో జరిగిన పూజ సోదరుడు రిషబ్ హెగ్డే వివాహానికి సల్మాన్ ఖాన్ హాజరవడం డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఈ వార్తలపై తాజాగా పూజా హెగ్డే స్పందిస్తూ– ''నా గురించి ఎన్నో వార్తలు వస్తుంటాయి. వాటిల్లో సల్మాన్‌గారితో డేటింగ్ అనేది ఒకటి. ఇలాంటి వార్తల గురించి నేను పెద్దగా పట్టించుకోను. ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే ఇష్టం. ఇప్పుడు నా దృష్టంతా కెరీర్‌పైనే ఉంది. వేర్వేరు భాషల్లో ఎక్కువ సినిమాల్లో నటించాలన్నదే నా లక్ష్యం. సల్మాన్‌గారితో నటించడం గొప్ప అనుభూతి'' అన్నారు.

భావోద్వేగాల విమానం


ధ్రువన్, సముద్ర ఖని

నటుడు, దర్శకుడు సముద్ర ఖని లీడ్ రోల్‌లో శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విమానం'. మాస్టర్ ధ్రువన్, మీరా జాస్మిన్, అనసూయ భరద్వాజ్, రాహుల్ రామకృష్ణ, ధన్‌రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని జూన్ 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఓ ప్రోమోను విడుదల చేశారు. జీ స్టూడియోస్ సౌత్ మూవీస్ హెడ్ అక్షయ్ క్రేజీవాల్ మాట్లాడుతూ– ''తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'విమానం'. అంగ వైకల్యంతో బాధపడే మధ్య వయస్కుడిగా, భార్య లేకపోయినా తనయుణ్ని జాగ్రత్తగా చూసుకునే తండ్రి వీరయ్యగా సముద్రఖని అద్భుతంగా చేశారు. బలమైన కథాంశంతో చక్కని భావోద్వేగాలతో ఈ చిత్రం ఉంటుంది. కిరణ్ కొర్రపాటితో అసోసియేట్ కావటం హ్యాపీ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వివేక్ కాలేపు, సంగీతం: చరణ్ అర్జున్.

ఆ సమయంలో రాకీ భాయ్ ఎక్కడ?


యశ్


హీరో యశ్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన 'కేజీఎఫ్' తొలి, మలి భాగాలకు విశేష స్పందన లభించిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్: ఛాప్టర్ 2' విడుదలై శుక్రవారం (ఏప్రిల్ 14)తో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా 'కేజీఎఫ్ 2'షార్ట్ వీడియోను ఈ చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ షేర్ చేసింది. '1978 నుంచి 1981వరకు రాకీ భాయ్ ఎక్కడ?, ఆ ప్రామిస్ నిలబడిందా?' అనేవి ఈ వీడియోలో కనిపించాయి. అలాగే '3'తో ఈ వీడియో పూర్తవుతుంది. దీంతో 'కేజీఎఫ్ 3' ఉంటుందని స్పష్టమవుతోంది.


గుల్షన్ దేవయ్య, గుల్జార్, రాజ్ రాచకొండ

ఇద్దరు అపరిచితుల కథ

గుల్షన్ దేవయ్య, సయామీ ఖేర్ జంటగా 'మల్లేశం' చిత్రం ఫేమ్ రాజ్ రాచకొండ దర్శకత్వం వహించిన చిత్రం '8 ఏఎమ్ మెట్రో'. శిలాదిత్య బోరా ప్లాటూన్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా మే 19న ఈ సినిమా రిలీజ్ కానుంది. ప్రముఖ గేయ రచయిత, దర్శకుడు గుల్జార్ ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేసి, మాట్లాడుతూ– ''ఈ చిత్రకథ చదివినప్పుడు గొప్ప అనుభూతి కలిగింది. అందుకే నా కవితలు అందించాను'' అన్నారు. ''మెట్రో ట్రైన్‌లో కలుసుకుని, ఒకరినొకరు తెలుసుకునే ఇద్దరు అపరిచితుల కథే ఈ సినిమా'' అన్నారు రాజ్ రాచకొండ. ''ఈ చిత్రంలో నా పాత్రకి ఒక సీక్రెట్ ఉంది. అది ఇద్దర్నీ వేరు చేయడంతో పాటు నమ్మకాల్ని కూడా చీల్చుతుంది'' అన్నారు గుల్షన్.

ప్రచండ తరుణం షురూ


రితికా, అశోక్, శ్రుష్టి

అశోక్ రాజ్, రితికా రాజ్, శ్రుష్టి వర్మ, వినయ్ బిద్దప్ప, ఉగ్రం మంజు, రవితేజ ప్రధాన పాత్రల్లో 'ప్రచండ తరుణం కావ్యం' అనే సినిమా షురూ అయింది. బాల పులిబోయిన దర్శకత్వంలో పులిచర్ల నాగరాజు, రామచంద్ర, కొల్లకుంట నాగరాజు నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ప్రొడక్షన్ హెడ్ రాజ్యలక్ష్మి కెమెరా స్విచ్చాన్ చేయగా, కన్నడ హీరో సిద్ధార్థ్ మహేశ్ క్లాప్ కొట్టారు. రచయిత పరుచూరి గోపాలకృష్ణ స్క్రిప్ట్‌ని అందించారు. ''మన పురాణాలు, ఇతిహాసాలను సైన్స్ అండ్ టెక్నాలజీతో బ్యాలెన్స్ చేసి తయారు చేసిన స్క్రిప్ట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది'' అన్నారు దర్శక-నిర్మాతలు.

సాక్షి బిజినెస్

శనివారం
15-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)		
సెన్సెక్స్ ▲	38	60,431
నిఫ్టీ ▲	16	17,828

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,055	▽	110
డోజోన్స్	33,811	▽	216
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,872	▲	29
డాక్స్	15,808	▲	78
షాంఘై	3,338	▲	20
నికాయ్	28,493	▲	337

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

టాటా కార్లు మరింత ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ కాస్త ప్రియం కానున్నాయి. మోడల్, వేరియంట్‌ను బట్టి ధర సగటున 0.6 శాతం పెరగనుంది. మే 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నాయని కంపెనీ శుక్రవారం ప్రకటించింది. 2023 ఫిబ్రవరి తర్వాత ధరలు పెంచడం ఇది రెండవసారి. నియంత్రణపర మార్పులు, ముడిసరుకు వ్యయం అధికం కావడం తాజా నిర్ణయానికి దారి తీసిందని టాటా మోటార్స్ తెలిపింది.

ఆరు లేయర్లతో ప్లాస్టో వాటర్ ట్యాంకులు




హైదరాబాద్: నీటి ట్యాంకుల తయారీ సంస్థ ప్లాస్టో ఆరు లేయర్లతో కూడిన ట్యాంక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. నాణ్యమైన ప్లాస్టిక్ మెటీరియల్‌తో తయారుచేసిన ఈ ట్యాంకు సూర్యరశ్మిని లోపలికి ప్రవేశించనీయకుండా చేసి అధిక ఉష్ణోగ్రతల్లోనూ నీటిని చల్లగా ఉంచుతుంది. ప్రమాదకర యూవీ కిరణాల నుంచి రక్షణ నిస్తుంది. సులభంగా శుభ్రం చేసుకునేలా వీటిని రూపొందించారు. ''ప్రతి ఒక్కరికి ఏడాది పాటు సురక్షితమైన, ఆరోగ్యకరమైన తాగునీటికి అందించాలనే లక్ష్యంతో వీటిని తయారు చేసాము. ప్లాస్టో డీలర్ స్టోర్లలో ఇవి లభ్యమవుతాయి'' అని కంపెనీ ప్రకటన ద్వారా తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-4-2023	
విశాఖ	420-00
చిత్తూరు	428-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	385-00
విజయవాడ	385-00
రిటైల్ ధర (డజను)	66.00
14-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	363-00
వరంగల్	365ద-00
రిటైల్ ధర	4.85

పరుగెడుతున్న ఈ-టూ వీలర్లు



- 2022-23లో రెండున్నర రెట్ల వృద్ధి
- అమ్మకాలు 8,46,976 యూనిట్లకు
- ఫేమ్ మరో నాలుగేళ్లు పొడిగించాలి
- డిమాండ్ చేస్తున్న ఈవీ పరిశ్రమ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు భారత రోడ్లపై దూసుకెళ్తున్నాయి. సొసైటీ ఆఫ్ మాన్యుఫ్యాక్చరర్స్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఎస్ఎంఈవీ) ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 8,46,976 యూనిట్లు అమ్ముడయ్యాయి. 2021-22 విక్రయాలతో పోలిస్తే ఏకంగా రెండున్నర రెట్లకుపైగా వృద్ధి నమోదు కావడం విశేషం. ఎలక్ట్రిక్ టూ వీలర్లు 2021-22లో భారత్‌లో 3,27,900 యూనిట్లు అమ్ముడయ్యాయి. పెట్రోల్ భారం నుంచి బయటపడేందుకు, అలాగే తక్కువ ఖర్చుతో ప్రయాణించే వెసులుబాటు ఉండడంతో ఎలక్ట్రిక్ టూ వీలర్లకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం సబ్సిడీలతో ప్రోత్సహించడం కలిసి వచ్చే అంశం.

విభాగాల వారీగా ఇలా..

గరిష్ట వేగం గంటకు 25 కిలోమీటర్ల లోపు ప్రయాణించే లో స్పీడ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ గత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 1.2 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. గంటకు 25 కిలోమీటర్ల కంటే అధిక వేగంతో ప్రయాణించే హై స్పీడ్ ఈ-టూ వీలర్లు 7,26,976 యూనిట్లు విక్రయం అయ్యాయి. 2021-22లో లో స్పీడ్ 75,457 యూనిట్లు, హై స్పీడ్ 2,52,443 యూనిట్లు రోడ్డెక్కాయి. నీతి ఆయోగ్ లక్ష్యం, ఇతర పరిశోధన సంస్థల అంచనాల కంటే 25 శాతం తక్కువ స్థాయిలో గత ఆర్థిక సంవత్సరంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయి.

పరిశ్రమకు అడ్డంకులు..

దశలవారీ తయారీ కార్యక్రమం (పీఎంపీ) పథకం కింద మార్గదర్శకాలను పాటించనందుకు ఫేమ్-2 రాయితీలను నిలిపివేయడం ఈ-టూ వీలర్ల అమ్మకాలపై ప్రభావం చూపిందని ఎస్ఎంఈవీ తెలిపింది. 'స్థానికీకరణలో జాప్యం సాకుతో వినియోగదారులకు ఒరిజినల్ పరికరాల తయారీదారులు (ఓఈఎం) ఇప్పటికే బదిలీ చేసిన రూ.1,200 కోట్ల కంటే ఎక్కువ సబ్సిడీని అకస్మాత్తుగా నిలిపివేయడం హాస్యాస్పదం. అలాగే తక్కువ ఇన్వాయిస్ చేశారనే ఆరోపణ కారణంగా ఖరీదైన ఈ-టూ వీలర్లను తయారు చేస్తున్న ఓఈఎంలకు చెందిన మరో రూ.400 కోట్లు నిలిచిపోయాయి. దీని పర్యవసానంగా మూలధన నిధుల కొరతతో వారి వ్యాపార కార్యకలాపాలు కుంటుపడ్డాయి. నేడు పరిశ్రమలో 95 శాతానికి పైగా ప్రాతినిధ్యం వహిస్తున్న 16 కంపెనీలు ప్రస్తుత గందరగోళ పరిస్థితి నుంచి పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. 2023-24లో తమ వ్యాపార ప్రణాళికలు చేసుకోవడానికి వీలుగా ఫేమ్ దశలవారీ తయారీ కార్యక్రమం తాలూకా అడ్డంకులకు తొలగించాలని విన్నవిస్తున్నాయి' అని వివరించింది.

ఎండమావిలా లక్ష్యం..

ద్విచక్ర వాహన రంగంలో 2022-23లో ఈ-టూ వీలర్ల వాటా 5% మాత్రమే. స్వల్పకాలిక లక్ష్యం 30 శాతం. 2030 నాటికి ఇది 80 శాతానికి చేర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఈ లక్ష్యం మరింత ఎండమావిలా కనిపిస్తోందని ఎస్ఎంఈవీ డైరెక్టర్ జనరల్ సోహిందర్ గిల్ వ్యాఖ్యానించారు. 'పరిశ్రమ అన్నీ కోల్పోలేదు. ఈ రంగాన్ని తిరిగి గాడిలో ఉంచగలిగేది దశలవారీ తయారీ కార్యక్రమం (పీఎంపీ) అర్హత ప్రమాణాలను రెండేళ్లు పొడిగించడం. అలాగే దీనిని ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఇచ్చితంగా అమలు చేయడం. ఫేమ్ పథకం కొనసాగింపుపై ప్రభుత్వ నిర్ణయం మొత్తం పరిశ్రమ విధిని నిర్ణయించే కీలకాంశం. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత కోసం పరిశ్రమ ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థ అభివృద్ధిని ప్రోత్సహించడానికి, స్వయం-సమర్థవంతంగా చేయడానికి కనీసం 3-4 ఏళ్ల పాటు ఫేమ్ పథకాన్ని పొడిగించడం చాలా ముఖ్యం' అని తెలిపారు.

కస్టమర్లకే నేరుగా సబ్సిడీ..

ప్రస్తుతం నెలకొన్న గందరగోళం వల్ల దీర్ఘకాలిక వ్యూహాన్ని అభివృద్ధి చేయడం కంపెనీలకు కష్టతరం అవుతోందని గిల్ వివరించారు. 'సబ్సిడీలలో ఏదైనా ఆకస్మిక తగ్గింపు వృద్ధిపై గణనీయ ప్రభావాన్ని చూపుతుంది. ఈ-మొబిలిటీ కోసం ప్రభుత్వ ప్రణాళికను ప్రమాదంలో పడేస్తుంది. ప్రస్తుత విధానంలో తయారీదార్లు సబ్సిడీని కస్టమర్‌కు బదిలీ చేస్తారు. విక్రయం తర్వాత ప్రభుత్వం నుండి క్లెయిమ్ చేసుకుంటారు. ఇది మోసపూరితంగా సబ్సిడీని క్లెయిమ్ చేయడానికి ఓఈఎంలు అమ్మకాలను మార్చడానికి దారితీయవచ్చు. ప్రభుత్వం నేరుగా కస్టమర్‌కు ప్రోత్సాహకాలను చెల్లించడానికి ప్రత్యక్ష సబ్సిడీ విధానాన్ని ప్రవేశపెట్టాలి' అని వివరించారు.

ఈవీలకు సిడ్బీ ఫైనాన్సింగ్!

ముంబై: ఎలక్ట్రిక్ వాహన విభాగంలో ఉత్తమ ఫైనాన్సింగ్‌కు వీలుగా చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు(సిడ్బీ) పైలట్ పథకానికి తెరతీసింది. తద్వారా మొత్తం ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) పరిశ్రమ పటిష్టతకు మద్దతివ్వనుంది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల తోపాటు ఫోర్ వీలర్ల కొనుగోళ్లకు రుణ సౌకర్యాలు కల్పించనుంది. వెరసి ఎలక్ట్రిక్ వాహన కొనుగోళ్లకు ఎంఎస్ఎంఈలు, ఈవీ లీజింగ్ కంపెనీలకు ప్రత్యక్షంగా ఆర్థిక తోడ్పాడును అందించనుంది. అంతేకాకుండా బ్యాటరీ స్వాపింగ్‌సహా చార్జింగ్ సదుపాయాల కల్పనకు సైతం అండగా నిలవనుంది. ఈవీ ఎకోసిస్టమ్‌లో రుణాలందించేందుకు వీలుగా చిన్న ఎన్‌బీఎఫ్‌సీలకు పోటీ రేట్లకు ఫైనాన్సింగ్‌ను ఏర్పాటు చేయనుంది.

ఫండ్స్ నిర్వహణ ఆస్తుల్లో 7% వృద్ధి

- మార్చి నాటికి రూ.40.05 లక్షల కోట్లు
- యాంఫీ డేటా విడుదల



ముంబై: మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) 2023 మార్చి నాటికి సగటున రూ.40.05 లక్షల కోట్లకు చేరాయి. 2022 మార్చి నాటికి ఉన్న రూ.37.70 లక్షల కోట్లతో పోలిస్తే 7 శాతం వృద్ధి చెందినట్టు మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో సెన్సెక్స్ నికరంగా 0.72 శాతమే పెరగడం గమనార్హం. అదే కాలంలో ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువ రూ.5.86 లక్షల కోట్ల మేర తగ్గిపోయింది. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల ఏయూఎంలో రిటైల్ ఇన్వెస్టర్లకు సంబంధించిన ఏయూఎం (ఈక్విటీ, హైబ్రిడ్, సొల్యూషన్ ఓరియెంటెడ్) 2023 మార్చి చివరికి రూ.6,83,296 కోట్లకు చేరుకుంది. ఇన్వెస్టర్ల సంఖ్య పెరుగుతూ వెళ్లడం మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఈక్విటీ మార్కెట్ల పట్ల నమ్మకాన్ని ప్రదర్శించడంగా యాంఫి సీఈవో ఎన్ఎస్ వెంకటేశ్ అన్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం తదితర అనిశ్చితుల్లోనూ మార్కెట్ పట్ల ఇన్వెస్టర్లు నమ్మకంగా ఉండడాన్ని ప్రస్తావించారు. 2022-23లో ఈక్విటీ ఫండ్స్‌లోకి నికరంగా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు యాంఫి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సిప్ రూపంలో నెలవారీ పెట్టుబడులు కూడా ఎప్పటికప్పుడు నూతన గరిష్టాలకు చేరుతున్నాయి. 2023-24 సంవత్సరంలోనూ రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడుల ప్రవాహం మెరుగ్గానే ఉంటుందన్న అంచనాను వెంకటేశ్ వ్యక్తం చేశారు. సిప్ ఖాతాల సంఖ్య మార్చి చివరికి 6.36 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో 21.65 లక్షలు మేర పెరిగింది.

ఆగస్టులో హ్యుందాయ్ ఎక్స్‌టర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ ఈ ఏడాది భారత్‌లో విడుదల చేయనున్న చిన్న ఎస్‌యూవీకి ఎక్స్‌టర్‌గా నామకరణం చేసింది. ఈ మేరకు టీజర్‌ను విడుదల చేసింది. జూలైలో ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఆగస్ట్ నుంచి మార్కెట్లో అడుగు పెట్టనుందని సమాచారం. దక్షిణ కొరియాతోపాటు పలు దేశాల్లో అమ్ముడవుతున్న ఏఐ3 (క్యాస్పర్) మోడల్‌కు స్వల్ప మార్పులతో ఇక్కడ ప్రవేశపెట్టనున్నారు. ఈ వాహనం భారత్ కోసం తయారు చేస్తున్నారు. భవిష్యత్‌లో పొరుగున ఉన్న దేశాలకూ ఎగుమతి చేస్తారు. గ్రాండ్ ఐ10 నియోస్ ప్లాట్‌ఫామ్‌పై దీనిని అభివృద్ధి చేస్తున్నారు. 1.0 లీటర్ టీ-జీడీఐ టర్బో పెట్రోల్ ఇంజన్, 1.2 లీటర్ పెట్రోల్ ఇంజన్ వేరియంట్లతో తయారు కానుంది.

ఎన్ఎస్ఈలో చమురు, గ్యాస్ ట్రేడింగ్

ఫ్యూచర్ కాంట్రాక్టులకు రెడీ



న్యూఢిల్లీ: నైమెక్స్ క్రూడ్, నేచురల్ గ్యాస్‌లలో ఫ్యూచర్ కాంట్రాక్టులను ప్రవేశపెట్టనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ పేర్కొంది. కమోడిటీ డెరివేటివ్స్ విభాగంలో మే 15 నుంచి వీటిని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి గత నెలలో అనుమతులు లభించడంతో రుపీ ఆధారిత నైమెక్స్ డబ్ల్యూటీఐ చమురు, నేచురల్ గ్యాస్ ఫ్యూచర్ కాంట్రాక్టులకు తెరతీసింది. దీంతో ఎన్ఎస్ఈ ఎనర్జీ బాస్కెట్‌లో మరిన్ని ప్రొడక్టులకు వీలు చిక్కనుంది. కమోడిటీ విభాగం మరింత విస్తరించనుంది. వీటి ద్వారా మార్కెట్ పార్టిసిపెంట్ల(ట్రేడర్లు)కు ధరల రిస్క్ హెడ్జింగ్‌కు ఇతర అవకాశాలు లభించనున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. డబ్ల్యూటీఐ చమురు, నేచురల్ గ్యాస్ డెరివేటివ్స్ కాంట్రాక్టులను రుపీ ఆధారితంగా సెటిల్ చేసేందుకు ఎన్ఎస్ఈ సీఎంఈ గ్రూప్‌తో డేటా లైసెన్సింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

తొమ్మిదేళ్లలో 90 వేల స్టార్టప్‌లు: అశ్వినీ వైష్ణవ్



జైపూర్: గడిచిన తొమ్మిదేళ్లుగా దేశీయంగా స్టార్టప్‌ల సంఖ్య గణనీయంగా పెరిగిమదని, 90,000కు చేరుకుందని ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అంకుర సంస్థల సంస్కృతిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ చర్యలు ఇందుకు దోహదపడుతున్నాయని ఆయన వివరించారు. జైపూర్‌లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) సెంటర్ ఏర్పాటు సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు.

సాక్షి స్పోర్ట్స్



హార్దిక్‌పై రూ. 12 లక్షల జరిమానా

ఐపీఎల్ తాజా సీజన్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా మరో కెప్టెన్‌పై జరిమానా పడింది. పంజాబ్ కింగ్స్ జట్టుతో గురువారం మొహాలిలో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటాను పూర్తి చేయడంలో విఫలమైంది. దాంతో ఐపీఎల్ నిర్వాహకులు గుజరాత్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై రూ. 12 లక్షలు జరిమానాగా విధించారు. బెంగళూరు కెప్టెన్ డుప్లెసిస్‌పై, రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ సామ్సన్‌లపై కూడా స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా పడింది.

క్వార్టర్ ఫైనల్లో ఓడిన సాకేత్ జోడీ

ఫ్లోరిడాలో జరుగుతున్న సరసోటా ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లో 2-6, 4-6తో డస్టిన్ బ్రౌన్ (జమైకా)-టిమ్ సాండ్‌కౌలెన్ (జర్మనీ) జంట చేతిలో ఓడిపోయింది. సాకేత్, యూకీలకు 1,930 డాలర్ల (రూ. 1 లక్షా 57 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

'బెట్టింగ్'కు ప్రచారం

మెకల్లమ్‌పై ఈసీబీ విచారణ



లండన్: ఇంగ్లండ్ టెస్టు టీమ్ హెడ్ కోచ్, న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ వివాదానికి కేంద్ర బిందువయ్యాడు. ఒక బెట్టింగ్ కంపెనీ '22బెట్ ఇండియా'కు అతను బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌లో బెట్టింగ్ చేయమంటూ అభిమానులను ప్రోత్సహిస్తూ అతను ఇచ్చిన ప్రకటనలు ఇటీవల వెల్లువెత్తాయి. సైప్రస్‌లో రిజిస్టర్ అయిన బెట్22తో గత నవంబర్‌లో మెకల్లమ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. దాంతో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) దీనిపై దృష్టి సారించింది. ఈసీబీ అవినీతి నిరోధక విభాగం నిబంధనల ప్రకారం 'ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బెట్టింగ్‌లో పాల్గొనడం, పాల్గొనేలా చేయడం లేదా అందుకు ప్రోత్సహించడం చేయరాదు'. టీమ్ హెడ్ కోచ్‌గా మెకల్లమ్‌కు ఈ నిబంధనలు వర్తిస్తాయి. ప్రస్తుతం ఈ అంశంపై విచారణ జరుపుతున్నట్లు ఈసీబీ ప్రకటించింది. న్యూజిలాండ్‌లో కూడా నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తుండటంతో '22బెట్ ఇండియా'పై ఆ దేశం నిషేధం విధించింది కూడా. ఆ దేశానికి చెందిన 'ప్రాబ్లమ్ గ్యాంబ్లింగ్ ఫౌండేషన్' సంస్థనే మెకల్లమ్ గురించి ఈసీబీకి తెలియజేసింది. మెకల్లమ్ కోచ్‌గా వచ్చాక ఆడిన 12 టెస్టుల్లో ఇంగ్లండ్ 10 టెస్టులు గెలిచింది.

జొకోవిచ్‌కు షాక్



మోంటెకార్లో: ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ మోంటె కార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్‌ను దాటలేకపోయాడు. ఇటలీ ప్లేయర్ లొరెంజో ముసెట్టి 2 గంటల 54 నిమిషాల్లో 4-6, 7-5, 6-4తో టాప్ సీడ్ జొకోవిచ్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2013, 2015లలో ఈ టోర్నీలో విజేతగా నిలిచిన జొకోవిచ్ ఈ మ్యాచ్‌లో ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసి, తన సర్వీస్‌ను ఎనిమిదిసార్లు కోల్పోయాడు. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ సిట్సిపాస్ (గ్రీస్), మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) కూడా ఇంటిముఖం పట్టారు. క్వార్టర్ ఫైనల్స్‌లో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6-2, 6-4తో రెండో సీడ్ సిట్సిపాస్‌పై, హోల్గర్ రూన్ (డెన్మార్క్) 6-3, 6-4తో మెద్వెదెవ్‌పై నెగ్గి సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు.

బ్రూక్ బంగారం...



హ్యారీ బ్రూక్

- సెంచరీ సాధించిన హ్యారీ బ్రూక్
- సన్‌రైజర్స్ మరో విజయం
- 23 పరుగులతో కోల్‌కతా ఓటమి
- రాణా, రింకూ మెరుపులు వృథా

కోల్‌కతా: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రైజర్స్ 23 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హ్యారీ బ్రూక్ (55 బంతుల్లో 100 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఈ సీజన్‌లో తొలి సెంచరీతో చెలరేగగా, కెప్టెన్ మార్క్‌రమ్ (26 బంతుల్లో 50; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (17 బంతుల్లో 32; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ నితీశ్ రాణా (41 బంతుల్లో 75; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), రింకూ సింగ్ (31 బంతుల్లో 58 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు.

మెరుపు భాగస్వామ్యాలు...

ఇన్నింగ్స్ మొదటి ఓవర్ నుంచే బ్రూక్ దూకుడు మొదలైంది. ఉమేశ్ వేసిన తొలి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన అతను, ఉమేశ్ తర్వాతి ఓవర్లో వరుస బంతుల్లో రెండు సిక్సర్లు బాదాడు. రసెల్ ఒకే ఓవర్లో మయాంక్ (9), రాహుల్ త్రిపాఠి (9)లను అవుట్ చేసినా మరోవైపు బ్రూక్ జోరు ఆగలేదు. అతనికి జత కలిసి మార్క్‌రమ్ కూడా చెలరేగిపోయాడు. ఫలితంగా పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 75/2కు చేరింది. మరోవైపు సుయశ్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్.. వరుణ్ వేసిన తర్వాతి ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన మార్క్‌రమ్ తర్వాతి బంతికి వెనుదిరిగాడు. ఫెర్గూసన్ వేసిన ఇన్నింగ్స్ 15వ ఓవర్లో బ్రూక్ పండగ చేసుకున్నాడు. తొలి బంతిని సిక్స్‌గా మలచిన అతను మరో 4 ఫోర్లు బాదాడు. అభిషేక్ కూడా మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చడంతో 18 ఓవర్లు ముగిసేసరికి రైజర్స్ స్కోరు 200 పరుగులకు చేరింది. బ్రూక్, అభిషేక్ నాలుగో వికెట్‌కు 33 బంతుల్లోనే 72 పరుగులు జత చేశారు. చివరి ఓవర్ మూడో బంతికి సింగిల్ తీసి బ్రూక్ శతకాన్ని అందుకోగా, ఆఖర్లో క్లాసెన్ (6 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగాడు. 45 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద బ్రూక్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను సుయశ్ వదిలేయడం కూడా రైజర్స్ ఇన్నింగ్స్‌లో కీలక క్షణం. దీనిని వాడుకున్న బ్రూక్ ఆ తర్వాతి 27 బంతుల్లో మరో 55 పరుగులు చేశాడు.

13, 3, 13... తొలి మూడు మ్యాచ్‌లలో హ్యారీ బ్రూక్ స్కోర్లు ఇవి! దాంతో అన్ని వైపుల నుంచి విమర్శలు, సన్‌రైజర్స్ అభిమానుల నుంచి సోషల్ మీడియాలో కొత్త తరహా మీమ్స్! వేలంలో రూ.13.5 కోట్లకు కొన్న ప్లేయర్ ఇలాగా ఆడేది అంటూ వ్యాఖ్యలు... కానీ శుక్రవారం నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్రూక్ తన విలువేమిటో చూపించాడు. టీమ్ మేనేజ్‌మెంట్ తనపై ఉంచిన అంచనాలను అందుకుంటూ మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగాడు. 2023 ఐపీఎల్ సీజన్‌లో తొలి సెంచరీని నమోదు చేసిన ఈ ఇంగ్లండ్ బ్యాటర్ రైజర్స్‌కు ఘనమైన విజయాన్ని అందించాడు. మరోవైపు సొంత మైదానంలో కోల్‌కతా సమష్టి వైఫల్యంతో చిత్తయింది. గత రెండు మ్యాచ్‌లలో రెండు అద్భుత వ్యక్తిగత ప్రదర్శనలతో గట్టెక్కిన ఆ జట్టుకు ఈసారి ఏదీ కలిసి రాలేదు.



ఆరంభంలోనే తడబాటు...

ఛేదనలో నైట్‌రైడర్స్‌కు శుభారంభం దక్కలేదు. భువనేశ్వర్ వేసిన తొలి ఓవర్లోనే గుర్బాజ్ (0) అవుట్ కాగా, జాన్సెన్ వరుస బంతుల్లో వెంకటేశ్ అయ్యర్ (10), నరైన్ (0)లను వెనక్కి పంపాడు. ఇలాంటి స్థితిలో ఉమ్రాన్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్ కేకేఆర్ ఇన్నింగ్స్‌కు కాస్త ఊపు తెచ్చింది. ఈ ఓవర్లో రాణా వరుస బంతుల్లో 4, 6, 4, 4, 4, 6 (మొత్తం 28 పరుగులు) బాదడం విశేషం. అయితే తన వరుస ఓవర్లలో జగదీశన్, రసెల్ (3)లను మర్కండే అవుట్ చేయడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. రాణా మాత్రం తన జోరును కొనసాగించాడు. గత మ్యాచ్ హీరో రింకూ సింగ్ మరో ఎండ్ నుంచి కెప్టెన్‌కు సహకరించాడు. వీరిద్దరి భాగస్వామ్యం (39 బంతుల్లో 69) కొంత ఆశలు రేపినా... లక్ష్యం మరీ పెద్దది కావడంతో ఈ ఇద్దరి ప్రయత్నం సరిపోలేదు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (నాటౌట్) 100; మయాంక్ (సి) వరుణ్ (బి) రసెల్ 9; రాహుల్ త్రిపాఠి (సి) గుర్బాజ్ (బి) రసెల్ 9; మార్క్‌రమ్ (సి) రసెల్ (బి) వరుణ్ 50; అభిషేక్ (సి) శార్దుల్ (బి) రసెల్ 32; క్లాసెన్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 228. వికెట్ల పతనం:** 1-46, 2-57, 3-129, 4-201. **బౌలింగ్:** ఉమేశ్ 3-0-42-0, ఫెర్గూసన్ 2-0-37-0, నరైన్ 4-0-28-0, రసెల్ 2.1-0-22-3, వరుణ్ 4-0-41-1, సుయశ్ 4-0-44-0, శార్దుల్ 0.5-0-14-0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటింగ్: గుర్బాజ్ (సి) ఉమ్రాన్ (బి) భువనేశ్వర్ 0; జగదీశన్ (సి) (సబ్) ఫిలిప్స్ (బి) మర్కండే 36; వెంకటేశ్ (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 10; నరైన్ (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 0; రాణా (సి) సుందర్ (బి) నటరాజన్ 75; రసెల్ (సి) జాన్సెన్ (బి) మర్కండే 3; రింకూ (నాటౌట్) 58; శార్దుల్ (సి) సుందర్ (బి) ఉమ్రాన్ 12; ఉమేశ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 205. వికెట్ల పతనం:** 1-0, 2-20, 3-20, 4-82, 5-96, 6-165, 7-197. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-1-29-1, జాన్సెన్ 4-0-37-2, నటరాజన్ 4-0-54-1, ఉమ్రాన్ 2-0-36-1, మర్కండే 4-0-27-2, సుందర్ 2-0-20-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	4	3	1	6	1.588
లక్నో	4	3	1	6	1.048
గుజరాత్	4	3	1	6	0.341
కోల్‌కతా	4	2	2	4	0.711
చెన్నై	4	2	2	4	0.225
పంజాబ్	4	2	2	4	-0.226
హైదరాబాద్	4	2	2	4	-0.822
బెంగళూరు	3	1	2	2	-0.800
ముంబై	3	1	2	2	-0.879
ఢిల్లీ	4	0	4	0	-1.576

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు × ఢిల్లీ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
లక్నో × పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

కాంస్యంతో ముగింపు



అస్తానా (కజకిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను భారత జట్టు కాంస్య పతకంతో ముగించింది. టోర్నీ చివరిరోజు శుక్రవారం పురుషుల ఫ్రీస్టయిల్ 125 కేజీల విభాగంలో అనిరుధ్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించాడు. కాంస్య పతక బౌట్‌లో అనిరుధ్ 12-2తో సర్దార్‌బెక్ ఖొల్మతోవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందాడు. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో అనిరుధ్ 8-2తో తైకి యామమోటో (జపాన్)పై నెగ్గి, క్వార్టర్ ఫైనల్లో 0-2తో బతిర్‌ముర్జయెవ్ యుసుప్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. బతిర్‌ముర్జయెవ్ ఫైనల్ చేరుకోవడంతో అనిరుధ్‌కు కాంస్య పతకం కోసం పోటీ పడే అవకాశం దక్కింది. భారత్‌కే చెందిన పంకజ్ (61 కేజీలు), యశ్ (74 కేజీలు), దీపక్ పూనియా (92 కేజీలు), జాంటీ కుమార్ (86 కేజీలు) పతకాల బౌట్‌లకు అర్హత పొందలేకపోయారు. ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్ ఒక స్వర్ణం, రెండు కాంస్యాలు సాధించింది.

భారత్‌కు రెండో ఓటమి



తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో ఓటమి చవిచూసింది. జపాన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 0-3తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో రుతుజా 1-6, 0-6తో హొంటామా మాయి చేతిలో... రెండో మ్యాచ్‌లో అంకితా రైనా 2-6, 7-5, 3-6తో మొయుక ఉచిజిమా చేతిలో ఓటమి పాలయ్యారు. డబుల్స్ మ్యాచ్‌లో సహజ యామలపల్లి-వైదేహి జోడీ 3-6, 4-6తో షుకో అయోయామా-ఇరి హొజుమి జంట చేతిలో ఓడిపోయింది. హైదరాబాద్‌కు చెందిన సహజ భారత సీనియర్ జట్టు తరఫున తొలిసారి బరిలోకి దిగింది.

బార్సిలోనా ఓపెన్‌కు దూరం



మాడ్రిడ్: ఎడమ తుంటి గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో... ఈనెల 17న మొదలయ్యే బార్సిలోనా ఓపెన్ టోర్నీలో స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ బరిలోకి దిగడంలేదు. 36 ఏళ్ల నాదల్ బార్సిలోనా ఓపెన్‌లో రికార్డుస్థాయిలో 12 సార్లు చాంపియన్‌గా నిలిచాడు.

సచివాలయానికి సరికొత్త రహదారులు


అమరవీరుల స్మారకం వద్దకు వెళ్లేందుకు వీలుగా నిర్మించిన రోడ్డు

- గంటకు 20 వేల వాహనాలు తిరుగుతున్నట్టు ట్రాఫిక్ స్టడీలో గుర్తింపు
- కొన్ని ప్రాంతాల్లో రోడ్లు శాస్త్రీయంగా లేకపోవడంతో కొత్త రోడ్ల నిర్మాణం
- ఎన్టీఆర్ గార్డెన్స్–సెక్రటేరియట్ మధ్య రోడ్డు త్వరలో విస్తరణ

సాక్షి, హైదరాబాద్: భవన వైశాల్యం, నిర్మాణ ప్రత్యేకతల పరంగా దేశంలోనే అతిపెద్ద సచివాలయం. దేశంలో మరే ప్రభుత్వ భవనంపై లేనట్టుగా ఐదంతస్తులకు సరిపడా వైశాల్యంతో రెండు భారీ గుమ్మటాలు.. మంత్రిత్వ శాఖలకు సంబంధించి అన్ని విభాగాలు ఒకేచోట ఉండేలా ఏర్పాటు.. పీక్ అవర్స్‌లో ఆ భవనం చుట్టూ గంటకు 20 వేల వాహనాల ప్రవాహం.. నిత్యం వేల మంది సందర్శకులు వచ్చే ప్రాంగణం.. ముఖ్యమంత్రి, మంత్రులను కలిసేందుకు వచ్చే వీఐపీలు.. అలాంటి కీలకమైన ప్రాంతంలో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడితే ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ పరంగా ఇబ్బందులు రాకుండా రాష్ట్ర కొత్త సచివాలయం చుట్టూ విశాలమైన రహదారులను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని కొత్త రోడ్లను నిర్మించగా, మిగతా రోడ్లను విశాలం చేయటంతోపాటు మార్పుచేర్పులు చేస్తున్నారు.

నలువైపులా నాలుగు రోడ్లు..

సచివాలయం చుట్టూ 4 రోడ్లు సిద్ధమయ్యాయి. ఇప్పుడు వాహనాలు ఒకవైపు నుంచి వచ్చి ఒకవైపే వెళ్లే పరిస్థితి లేకుండా ఎటునుంచి ఎటైనా వెళ్లేలా రోడ్లను సిద్ధం చేశారు. కొత్త భవనాన్ని నిర్మించే సమయంలోనే రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఓ ప్రైవేటు సంస్థతో ట్రాఫిక్‌పై అధ్యయనం చేయించారు. కొన్ని రోడ్లు శాస్త్రీయంగా లేకపోవడంతో ట్రాఫిక్ అయోమయం కావడంతోపాటు ప్రమాదాలకు ఆస్కారమిస్తుందని తేలింది. దీంతో వాటన్నింటిని సరిచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఆమేరకు అధికారులు చర్యలు చేపట్టారు.

లుంబినీ వద్ద పాత రోడ్డును మూసేసి..

- ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లుంబినీ పార్కు వైపు వెళ్లే ప్రధాన రోడ్డు ప్రమాదాలకు ఆస్కారమిచ్చేలా ఉండటంతో లుంబినీ పార్కు వద్ద రోడ్డును మూసేశారు. సచివాలయ ప్రధాన ద్వారం ముందు నుంచి 110 అడుగుల వెడల్పుతో డబుల్ రోడ్డు నిర్మించారు. లుంబినీ వద్ద పాత రోడ్డును మూసేసి ట్రాఫిక్‌ను కొత్త రోడ్డుతో అనుసంధానించారు.
- బీఆర్‌కే భవనం వైపు మళ్లే చోట ఆదర్శనగర్ రోడ్డును వెడల్పు చేస్తున్నారు. అక్కడే ఉన్న కూడలిని మూసేసి వాహనాలకు ఎల్ఐసీ కార్యాలయం వద్ద యూ టర్న్ ఆప్షన్ ఇచ్చారు.
- లక్డీకాపూల్ నుంచి వచ్చే రోడ్డును సచివాలయ భవనం వద్ద వెడల్పు చేశారు. ఇక్కడి పెట్రోలు బంకును కూడా తరలించి అక్కడి నుంచి నేరుగా అమరవీరుల స్మారకం వద్దకు వెళ్లేందుకు వీలుగా రోడ్డును నిర్మించారు.
- సచివాలయ భవనం వెనక వైపు భవనాన్ని ఆనుకుని రోడ్డును వెడల్పు చేశారు. ఇక్కడే మసీదును నిర్మిస్తున్నారు. దానికి బయటి నుంచి కూడా జనం వచ్చేలా రోడ్డును సిద్ధం చేశారు.
- సచివాలయం–ఎన్టీఆర్ గార్డెన్స్ మధ్య (తెలంగాణ సచివాలయం పాత గేటు) ఉన్న రోడ్డును ఖైరతాబాద్ పెద్ద వినాయకుడిని ప్రతిష్ఠించే ప్రాంతం రోడ్డు వరకు వెడల్పు చేయనున్నారు.
- రోడ్లను ఇష్టమొచ్చినట్లు మార్చారని, కూడళ్లను మూసేశారని, ఇది వాహనదారులకు ఇబ్బందిగా ఉందన్న విమర్శలూ కొంతమంది నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఇది తాత్కాలికమేనని, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు తాజా మార్పులు దోహదపడతాయని అధికారులంటున్నారు.


సచివాలయం వద్ద కొత్తగా వేసిన రోడ్డు

డబ్బా చక్రాల సైకిల్..

ఈజీగానే తొక్కొచ్చు!



సైకిల్ అంటే ఎలా ఉంటుంది? రెండు పెద్ద చక్రాలు.. వాటిని అటాచ్ చేస్తూ ఫ్రేమ్, చైన్ అంతేకదా! సైకిల్ అనే కాదు.. ఏ వాహనానికైనా ఉండేది గుండ్రని టైర్లు, చక్రాలే. అలా కాకుండా సైకిల్‌కు చతురస్రాకారంలో టైర్లు ఉంటే? అలా సింపుల్‌గా తొక్కేసుకుంటూ వెళ్లిపోగలిగితే? అదెలా సాధ్యమనిపిస్తోంది కదా! రష్యాకు చెందిన 'ది క్వ్యా'సంస్థ ఇంజనీర్ సెర్గీ గోర్డీవ్ మాత్రం దీనిని చేసి చూపించాడు. చతురస్రాకారంలో టైర్లను రూపొందించి.. సాధారణ సైకిల్ ఫ్రేమ్‌కు అమర్చి నడిపించాడు. దీనికి సంబంధించిన వీడియో యూట్యూబ్‌లో వైరల్‌గా మారింది కూడా.

> ➤ ఇదో వినూత్న ఆలోచన, చాలా బాగుందని కొందరు నెటిజన్లు ప్రశంసిస్తుంటే.. అంతా బాగానే ఉందిగానీ.. స్పీడ్ బ్రేకర్లు, గుంతలు వస్తే పరిస్థితి ఏమిటన్న కామెంట్లూ వస్తున్నాయి.



'స్క్వేర్'టైర్లతో నడిచేదెలా?

యుద్ధ ట్యాంకుల చక్రాల్లో వాడే టెక్నాలజీని 'స్క్వేర్ టైర్'సైకిల్‌లో వినియోగించారు. సింపుల్‌గా చెప్పాలంటే.. ఇందులో చక్రాలు మొత్తానికి మొత్తంగా తిరగవు. జస్ట్ వాటి అంచున ఏర్పాటు చేసే ప్రత్యేకమైన బెల్ట్ మాత్రమే కదులుతుంది. అలాగే 'స్క్వేర్ వీల్'సైకిల్‌లో చతురస్రాకారపు వీల్స్ కదలకుండా అలాగే ఉంటాయి. సెర్గీ గోర్డీవ్ ప్రత్యేకమైన బెల్ట్‌ను తయారు చేసి వాటి అంచులో అమర్చాడు. పెడల్స్ తొక్కినప్పుడు ఆ బెల్ట్ కదిలేలా.. గేర్లను, చైన్‌లను అమర్చి అనుసంధానించాడు. పెడల్‌ను తొక్కినప్పుడు.. బెల్ట్ కదులుతూ సైకిల్ ముందుకు వెళుతుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.